www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 9-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 341 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి సా. 6.19 తదుపరి అమావాస్య నక్షత్రం: ధనిష్ఠ ఉ. 7.56, శతభిషం తె.4.56 వరకు; వర్జ్యం: మ. 2.14-3.38; దుర్ముహూర్తం: ఉ. 6.32-8.06; అమృతఘడియలు: రా. 10.38-12.02; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.32; సూర్యాస్తమయం: 6.21 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎన్నికల వేళ వంటగ్యాస్‌పై
రూ. 100 తగ్గింపు!
2



నారీశక్తిపై భారం తగ్గించేందుకే.. మహిళా దినోత్సవాన మోదీ ప్రకటన
ఢిల్లీలో ఇక రూ.803కే సిలిండర్.. 'ఉజ్వల్' లబ్ధిదారులకు రూ.503కే
తగ్గింపు ధర తక్షణమే అమల్లోకి.. పెట్రోల్, డీజిల్ రేట్లు యథాతథం
5 రాష్ట్రాల ఎన్నికలకు ముందు గత ఆగస్టులో గ్యాస్‌పై 200 తగ్గింపు



రాజ్యసభకు సుధామూర్తి
నామినేట్ చేసిన రాష్ట్రపతి ముర్ము
మీ నియామకం నారీశక్తికి ప్రతీక
ప్రధాని మోదీ శుభాకాంక్షలు 2
ఇది మహిళా దినోత్సవ కానుక
సేవకు పెద్ద వేదిక: సుధామూర్తి



బీఆర్ఎస్‌లోనే ఉంటా
పార్టీ మార్పు ప్రచారం అవాస్తవం
నా కుమారుడికి ఎంపీ టికెట్ వద్దు
అల్లుడి కాలేజీ కూల్చివేతపైనే
వేం నరేందర్‌రెడ్డిని కలిశా
కేటీఆర్‌తో సమావేశంలో
మాజీ మంత్రి మల్లారెడ్డి 12

హైదరాబాద్ అభివృద్ధి
బాధ్యత నాదే



పాతబస్తీ మెట్రోరైల్ శంకుస్థాపనలో ముఖ్యమంత్రి రేవంత్, ఎంపీ అసద్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు

గల్లీ గల్లీనీ డెవలప్ చేస్తాం.. ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ
నగర ప్రగతికి 2050 వైబ్రంట్ మాస్టర్ ప్లాన్
చంచల్‌గూడ జైలును తరలించి.. కేజీ టు పీజీ విద్యాసంస్థలు
చాంద్రాయణగుట్టలో అతిపెద్ద మెట్రోరైలు జంక్షన్
రోడ్ల విస్తరణకు రూ.120 కోట్లడిగితే రూ.200 కోట్లు ఇచ్చాం
పాతబస్తీ మెట్రోరైలు పనుల శంకుస్థాపనలో సీఎం రేవంత్
గోల్కొండలో మైనారిటీ గురుకులాన్ని ప్రారంభించిన సీఎం

అండగా ఉంటాం
ఐదేళ్లు మీదే అధికారం
రేవంత్ మొండి మనిషి
అదే.. సీఎంను చేసింది
ఎంపీ అసదుద్దీన్ వ్యాఖ్య

హైదరాబాద్/సిటీ, కార్వాన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర అభివృద్ధి పూర్తి బాధ్యతను తాను తీసుకుంటానని, అందుకే పురపాలకశాఖను తన దగ్గరే పెట్టుకున్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం '2050 వైబ్రంట్ మాస్టర్ ప్లాన్'ను తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఫలక్‌నుమా సమీపంలోని

మిగతా 13వ పేజీలో...

కాళేశ్వరం ఉద్యోగులు
కమిటీ ముందుకు


13

పనిచేస్తున్న, రిటైరైన ఉద్యోగులు, ఇంజనీర్లు నేడు హైదరాబాద్ రావాలన్న సాగునీటి శాఖ
బ్యారేజీలపై వివరాలు అడగనున్న ఎన్‌డీఎస్‌ఏ
రెండో రోజూ నిపుణుల బృందం పర్యటన
అన్నారం, సుందిళ్లను పరిశీలించిన బృందం
పిల్లర్లు, బ్యారేజీల డిజైన్లు, ఫొటోల పరిశీలన



కాంగ్రెస్ అభ్యర్థులుగా
రఘువీర్, వంశీచంద్
సురేశ్ షెట్కార్, బలరాంనాయక్ పేర్లూ ఖరారు.. తొలి జాబితాలో నాలుగు స్థానాలకు ప్రకటన
పలు రాష్ట్రాల్లో 39 స్థానాలకు అభ్యర్థుల ఎంపిక.. రాహుల్‌గాంధీ మళ్లీ వయనాడ్ నుంచి బరిలోకి
ఈ నెల 11న మరిన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం!

న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల ప్రకటనను కాంగ్రెస్ పార్టీ కూడా షురూ చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 39 స్థానాలకు అభ్యర్థులతో శుక్రవారం తొలి జాబితాను విడుదల చేసింది. ఇందులో భాగంగా తెలంగాణలో 17 నియోజకవర్గాలకుగాను నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మహబూబ్‌నగర్

మిగతా 12వ పేజీలో...

12
బీజేపీలోకి జలగం!
ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా వెంకట్రావ్
పోటీకి కాషాయ పార్టీ యోచన
కిరణ్‌కుమార్‌రెడ్డి ద్వారా యత్నం


14

విద్యుద్దీప కాంతుల్లో శుక్రవారం రాత్రి వేములవాడ రాజన్న ఆలయం

..భక్తవశంకర
శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు.. వేములవాడ, కీసరలో ఘనంగా వేడుకలు
ఏడుపాయలలో వనదుర్గా మహా జాతరకు అంకురార్పణ

అహో.. ఏఐ టీచరమ్మ!

కేరళలోని ఓ స్కూల్లో టీచర్ బొమ్మ అద్భుతాలు

» 'కృత్రిమ మేధస్సు టీచరమ్మ' దేశంలోనే తొలిసారి



తిరువనంతపురం, మార్చి 8: ఇప్పటికే కొన్ని కంపెనీలు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్-ఏఐ) ద్వారా యాంకర్లు, మోడళ్లను ప్రవేశపెట్టి ఔరా అనిపించాయి. అక్షరాస్యత శాతంలో ముందుండి.. విద్యారంగంలోనూ అద్భుతాలు సృష్టిస్తున్న కేరళలో ఓ 'ఏఐ టీచరమ్మ' వచ్చేసింది! తరగతి గదిలోకొచ్చి కరచాలనం చేస్తూ విద్యార్థులందరినీ పరిచయం చేసుకోవడమే కాదు.. వినసొంపైన స్వరంతో చక్కగా పాఠం కూడా చెప్పింది. అనంతరం విద్యార్థులడిగిన సందేహాలన్నింటినీ అంతే చక్కగా నివృత్తి చేసింది. 'అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రాజెక్టు'లో భాగంగా మేకర్‌ల్యాబ్స్ ఎడ్యుటెక్ సహకారంతో ఈ 'టీచరమ్మ కాని టీచరమ్మ'ను రూపొందించారు. చక్కని హెయిర్ క్రాఫ్, చీరకట్టులో మెడలో బంగారు నగల మాదిరిగా మైక్రో ఫోన్స్, స్పీకర్లు తగిలించుకొని తిరువనంతపురం కల్లంబలం ప్రాంతంలోని కేటీసీటీ పాఠశాలలో అడుగుపెట్టిన ఈ 'టీచర్ బొమ్మ'కు 'ఐరిస్' అని పేరు పెట్టారు. ఈ ఐరిస్.. అన్ని భాషల్లోనూ పాఠాలు చెప్పగలదు. కుడి, ఎడమ చేతులతోనూ బాణాలు వేసే నైపుణ్యం గల సవ్యసాచి మాదిరిగా.. ఏ వైపు నుంచి సందేహాలు వ్యక్తమైతే ఆ వైపునకు తలను బొంగరంలా తిప్పుతూ అర్థమయ్యేలా వివరించనూ గలదు. అయితే ఈ 'ఐరిస్'తో ఓ చిక్కుంది! స్కూల్ పిల్లలు అంటేనే అల్లరికి చిరునామా. తరగతి గదిలో గోల గోల చేస్తుంటారు. అయితే విద్యార్థుల అల్లరితో తరగతి గది గందరగోళంగా ఉంటే మాత్రం ఈ ఏఐ టీచరమ్మ పాఠాలు చెప్పదట!! విద్యార్థులంతా ఈ ఐరిస్ టీచింగ్‌ను తెగ ఆసక్తిగా విన్నారు! కారణం.. ఈ టీచరమ్మను కోపమే రాదు.. పిల్లలపై విసుక్కోదట కూడా! అందునా హోం వర్క్ ఇవ్వదట! ఏఐ టీచర్‌ను రూపొందించడం దేశంలోనే తొలిసారి అని చెబుతున్నారు. తరగతి గదిలో విద్యార్థులకు ఐరిస్ పాఠాలు చెబుతున్న దృశ్యాలు నెట్‌లో వైరల్ అవుతున్నాయి. అయితే.. ఈ ఐరిస్, స్కూల్లోని టీచింగ్ స్టాఫ్‌కు సపోర్టివ్ సిస్టమ్‌గానే ఉంటుందని స్కూల్ ప్రిన్సిపల్ మీరా సురేశ్ చెప్పారు.

ఏడాదికి మూడుసార్లు సీఏ పరీక్షలు

» ఫౌండేషన్, ఇంటర్‌లకు అవకాశం

న్యూఢిల్లీ, మార్చి 8: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) సీఏ ఫౌండేషన్, ఇంటర్ పరీక్షలను ఏడాదికి మూడుసార్లు నిర్వహించాలని నిర్ణయించింది. గురువారం నిర్వహించిన ఐసీఏఐ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. ఏటా జనవరి, మే/జూన్, సెప్టెంబరు నెలల్లో ఈ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఏడాది నుంచే దీన్ని అమలు చేస్తారు. గతంలో ఏటా జనవరి, మే/జూన్ నెలల్లో మాత్రమే వీటిని నిర్వహించేవారు. విద్యార్థులకు సౌలభ్యంగా ఉండేందుకు ఏడాదికి మూడుసార్లు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఐసీఏఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆయా పరీక్షల మధ్య వ్యవధిని కూడా రెండు నెలలు తగ్గించినట్లు ప్రకటించింది. తద్వారా విద్యార్థులు ఎక్కువ కాలం వేచి చూడకుండా పరీక్షలు రాసే అవకాశం లభిస్తుందని వెల్లడించింది.

లోకం తీరు



రాజ్యసభకు సుధామూర్తి

నామినేట్ చేసిన రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ/బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ మాజీ చైర్‌పర్సన్ సుధామూర్తి(73)ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యసభకు నామినేట్ చేశారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ శుక్రవారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 'సామాజిక, విద్యారంగంలో, దాతృత్వంలో సుధామూర్తి సేవలు స్ఫూర్తిదాయకం. పెద్దల సభలో ఆమె ఉనికి నారీశక్తికి తిరుగులేని నిదర్శనం. ఆమె పదవీకాలం ఫలప్రదమవ్వాలి' అని ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున సుధామూర్తిని రాజ్యసభకు ఎంపిక చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. 2006లో పద్మశ్రీ అవార్డు అందుకున్న ఆమెకు.. నిరుడు పద్మభూషణ్ పురస్కారం కూడా లభించింది. మహిళా దినోత్సవాన తనను రాజ్యసభకు ఎంపిక చేయడం రెట్టింపు విస్మయానికి గురిచేసిందని సుధామూర్తి అన్నారు. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో ఉన్న ఆమె.. 'చాలా సంతోషంగా ఉంది. నా కృషిని మోదీ గుర్తించారు. ఆయనకు ధన్యవాదాలు. ఇది మహిళాదినోత్సవం సందర్భంగా ప్రధాని నాకు ఇచ్చిన కానుక. పేదల కోసం పనిచేసేందుకు పెద్ద వేదిక దొరికినందుకు ఆనందంగా ఉంది' అని అన్నారు.

ఎస్‌బీఐ వినతిపై 11న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించేందుకు మరింత సమయం కావాలన్న ఎస్‌బీఐ అభ్యర్థనపై ఈ నెల 11న సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదురుగు జడ్జీల ధర్మాసనం విచారణ జరపనుంది. ఎన్నికల బాండ్ల వివరాలను ఈ నెల 6వ తేదీలోపు కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించాలని ఎస్‌బీఐని ఇంతకుముందు సుప్రీం కోర్టు ఆదేశించింది. అయితే జూన్ 30 వరకు గడువు పెంచాలని కోరుతూ ఎస్‌బీఐ పిటిషన్ వేసింది. దీనిపైనే సోమవారం ధర్మాసనం విచారణ జరపనుంది. కాగా, సకాలంలో వివరాలు ఇవ్వకుండా ఎస్‌బీఐ కోర్టు ధిక్కరణకు పాల్పడిందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫామ్స్(ఏడీఆర్), కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి.

ఇంకా జైల్లోనే ఉన్నట్లనిపిస్తోంది: సాయిబాబ

న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తానింకా జైల్లోనే ఉన్నట్లనిపిస్తోందని మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబ అన్నారు. జైల్లో తాను పడిన కష్టాలను గుర్తు చేసుకొని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. మావోయిస్టులతో సంబంధాల కేసులో నిర్దోషిగా విడుదలైన ఆయన.. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 'నాకు మీరు (మీడియా) మద్దతు ఇచ్చినందుకు.. ఆస్పత్రికి వెళ్లే బదులు.. ముందే మీతో మాట్లాడాలనే వచ్చాను. నేనింకా జైలు గదిలో మగ్గుతున్నట్లే ఉంది. నా తరఫున కేసులో పోరాడిన న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు. అందులో ఒకరు ఫీజు కూడా తీసుకోలేదు. విచారణ సందర్భంగా కొందరు పోలీసు అధికారులు నా న్యాయవాదులను బెదిరించారు' అని అన్నారు. తనపై ఉగ్రవాదిగా ముద్ర వేశారని సాయిబాబ కన్నీళ్లు పెట్టుకున్నారు. కాగా, సాయిబాబను నిర్దోషిగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మహారాష్ట్ర సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 11వ తేదీన ఈ పిటిషన్‌పై విచారణ జరగనుంది.

శరద్ పవార్ మనుమడి షుగర్ ఫ్యాక్టరీ జప్తు

ముంబయి, మార్చి 8: ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ సోదరుని మనుమడు రోహిత్ పవార్‌కు చెందిన చక్కెర కర్మాగారాన్ని శుక్రవారం ఈడీ అటాచ్ చేసింది. ఔరంగాబాద్ జిల్లాలోని కన్నాడ్ గ్రామంలో ఉన్న సహకార చక్కెర కర్మాగాన్ని జప్తు చేసింది. ఈ కర్మాగారానికి చెందిన 161.30 సెంట్ల స్థలం, ప్లాంటు, యంత్రాలు, భవనాలను తన ఆధీనంలోకి తెచ్చుకుంది. వీటి విలువ సుమారు రూ.50 కోట్లు ఉంటుంది. 38 ఏళ్ల రోహిత్ ప్రస్తుతం కర్జాత్-జమ్‌ఖేడ్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా కూడా ఉన్నారు. అజిత్ పవార్ పార్టీ నుంచి నిష్క్రమించిన తరువాత శరద్ వర్గం ఎన్‌సీపీలో ఆయన బలమైన నేతగా ఎదిగారు. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఈడీ ఆయనపై కేసు నమోదు చేసింది. రేషన్ కుంభకోణంలోనూ పాత్ర ఉందన్న ఆరోపణలపై ఇంతకుముందు విచారణ జరిపింది కూడా. మహారాష్ట్ర సహకార బ్యాంకులో రూ.25వేల కోట్ల కుంభకోణం జరిగిందన్న ఆరోపణలపై కూడా జనవరి నెలలో రోహిత్‌ను పది గంటల పాటు విచారించింది. ఫిబ్రవరి నెలలోనూ ప్రశ్నించింది.

డిబ్రూగఢ్ జైలు సూపరింటెండెంట్ అరెస్టు

డిబ్రూగఢ్, మార్చి 8: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపారన్న కారణంతో అస్సాంలోని డిబ్రూగఢ్ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌ను శుక్రవారం రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఆ జైలులోని ఖలిస్థాన్ అనుకూల ఉగ్రవాదులు స్పై కెమెరా సహా ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను సంపాదించుకోగలిగినా తగిన విధంగా స్పందించలేదని పేర్కొంటూ ఈ చర్యలు తీసుకున్నారు. 'వారిస్ పంజాబ్ దే'కు చెందిన అమృత్‌పాల్ సింగ్ సహా పది మందిని పంజాబ్‌లో అరెస్టు చేసిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఎస్ఏ) వారిని గత నెలలో ఈ జైలుకు డిటెన్యూలుగా పంపించింది. జైలులో ఉండగానే వారు స్మార్ట్ ఫోన్, సిమ్‌కార్డు, కీప్యాడ్ ఫోన్, స్పై కెమెరా పెన్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్ హెడ్‌ఫోన్లను సంపాదించుకోగలిగారు. .

జాయింట్ డిక్లరేషన్‌పై ఈపీఎఫ్‌వో ఉపశమనం

న్యూఢిల్లీ, మార్చి 8: ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్) పథకానికి సంబంధించి ఈపీఎఫ్‌వో తాజాగా కొన్ని మార్పులు చేసింది. ఈ పథకం నిబంధనల ప్రకారం నెలకు రూ.15 వేల వేతనం పైగా అందుకుంటున్న ఉద్యోగులు మూల వేతనంపై 12 శాతం కంట్రిబ్యూషన్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అయితే.. ఇప్పుడు కొందరు ఉద్యోగులకు సంబంధించి ఈ డిక్లరేషన్ ఫాం సమర్పణలో ఈపీఎఫ్‌వో కొంత ఉపశమనం కల్పించింది. ఈ మేరకు జనవరి 30న ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. తాజా సర్క్యులర్ ప్రకారం.. అధిక పింఛను కోరుకోని ఉద్యోగులు, అధిక పింఛను కోరుకుని కూడా డిక్లరేషన్ సమర్పించాలన్న నిర్దిష్ట సమయానికి(గత ఏడాది అక్టోబరు 31) ముందే సదరు సంస్థలో ఉద్యోగం మానేసిన వారు, మరణించిన ఉద్యోగుల విషయంలో డిక్లరేషన్ అవసరం లేదని స్పష్టం చేసింది.

రోడ్డు పక్కన నమాజ్ చేస్తున్న వ్యక్తిని తన్నిన ఎస్సై

» సస్పెండ్ చేసిన అధికారులు.. ఉత్తర ఢిల్లీలో ఘటన

న్యూఢిల్లీ, మార్చి 8: రోడ్డు పక్కన నమాజ్ చేస్తున్న వ్యక్తిని ఓ ఎస్సై కాలితో తన్నిన సంఘటన ఉత్తర ఢిల్లీలో చోటుచేసుకుంది. దీనిపై స్పందించిన పోలీసు ఉన్నతాధికారులు వెంటనే ఆ ఎస్సైని సస్పెండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంద్రలోక్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న మసీదు.. అసర్ కీ నమాజ్ కోసం వచ్చిన భక్తులతో నిండిపోయింది. స్థలం లేకపోవడంతో కొందరు రోడ్డు పక్కన నమాజ్ చేయడం ప్రారంభించారు. ఇది గమనించిన అక్కడి పోలీసు అవుట్ పోస్టు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆ ఎస్సై.. నమాజ్ చేయడానికి వంగొని ఉన్న వ్యక్తిని కాలితో తన్నారు. మరో వ్యక్తి తలపై కొట్టారు. ఈ సంఘటన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు రాస్తారోకో చేశారు. నార్త్ జోన్ డీసీపీ ఎం.కె.మీనా సంఘటన స్థలానికి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. వీడియోను పరిగణనలోకి తీసుకొని ఆ ఎస్సైని సస్పెండ్ చేసినట్టు తెలిపారు.

వంటగ్యాస్‌పై 100 తగ్గింపు

ఎన్నికల వేళ కేంద్రంలోని బీజేపీ సర్కార్ కీలక నిర్ణయం..మహిళా దినోత్సవాన మోదీ కానుక

» 'ఉజ్వల్' లబ్ధిదారులకు రూ.503కే

» తగ్గింపు ధర తక్షణమే అమల్లోకి

» పెట్రోలు, డీజిల్ రేట్లు యథాతథం

న్యూఢిల్లీ, మార్చి 8: లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాని మోదీ మహిళలకు ఓ వరం ప్రకటించారు. వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సిలిండర్ ధరను రూ.100 తగ్గిస్తున్నట్లు తెలిపారు. ఇది తక్షణమే.. శుక్రవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నారీశక్తిపై భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాని శుక్రవారం 'ఎక్స్'లో వెల్లడించారు. 'ఇవాళ మహిళా దినోత్సవాన ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.100 తగ్గించాలని మా ప్రభుత్వం నిర్ణయంచింది. మహిళల సాధికారత, వారి జీవన సౌలభ్యం మా లక్ష్యం. వీటికి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని పేర్కొన్నారు. అయితే పెట్రోలు, డీజిల్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పూ లేదు. రికార్డు స్థాయిలో గత 23 నెలలుగా వీటి ధరలు నిలకడగా ఉండడం గమనార్హం. కాగా.. గత ఆరు నెలల్లో ఎల్‌పీజీ సిలిండర్ ధర తగ్గించడం ఇది రెండోసారి. గత ఆగస్టులో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు సిలిండర్ ధరను రూ.200 తగ్గించారు. అలాగే ఉజ్వల యోజన (పీఎంయూవై) లబ్ధిదారులకు సిలిండర్‌పై రూ.300 వరకు సబ్సిడీ ప్రకటించారు. ఇది బీజేపీకి బాగా లబ్ధి చేకూర్చింది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో భారీ విజయానికి తోడ్పడిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకునే మోదీ ఇప్పుడు మరో వంద రూపాయలు తగ్గించారని వ్యాఖ్యానిస్తున్నాయి. అంతే కాదు.. ఉజ్వల యోజన లబ్ధిదారులకు రూ.300 సబ్సిడీని వచ్చే ఏడాది మార్చి వరకు పొడిగించాలని కేంద్ర కేబినెట్ గురువారమే నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి మోదీ హయాంలో గత తొమ్మిదేళ్లలో వంటగ్యాస్ ధర ఆకాశాన్నంటింది. 2020 నుంచి ఉజ్వల లబ్ధిదారులను మినహాయించి ఇతరులకు ఎల్‌పీజీ సబ్సిడీ ఇవ్వడం కేంద్రం ఆపేసింది. నిరుడు ఆగస్టులో 14.2 కిలోల సిలిండర్ ధర అత్యధికంగా రూ.1,102గా ఉండేది. దీనిపై కాంగ్రెస్, ఇతర విపక్షాలు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేశాయి. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో రూ.500కే సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించి విజయం సాధించింది కూడా. ఈ నేపథ్యంలోనే కేంద్రం గత ఆగస్టులో సిలిండర్ ధరను రూ.200 తగ్గించింది. దరిమిలా ఢిల్లీలో రూ.903కే సిలిండర్ అందుతోంది. ఇప్పుడు రూ.వంద తగ్గడంతో వినియోగదారులకు రూ.803కే అందనుంది. ఉజ్వల లబ్ధిదారులకు మాత్రం రూ.503కే లభిస్తుందని కేంద్ర పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి 'ఎక్స్'లో వెల్లడించారు. కాగా.. వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.100 తగ్గించడంతో కేంద్ర ఖజానాపై రూ.12 వేల కోట్ల భారం పడనుంది.



నేషనల్ క్రియేటర్స్ అవార్డుల కార్యక్రమంలో మోదీ

మినీ స్కర్టులతో కోణార్క్ శిల్పాలు

» ఇప్పటి ఫ్యాషన్ ఏనాడో చూపిన భారత్

» నేషనల్ క్రియేటర్స్ అవార్డుల వేదికపై మోదీ

ఆధునిక వస్త్ర శైలిని శతాబ్దాల క్రితమే ప్రపంచానికి భారత్ పరిచయం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఫ్యాషన్ రంగంలో ఆధునిక పోకడగా భావించే మినీ స్కర్టుల ధారణను కోణార్క్‌లోని శిల్పాల్లో చూడొచ్చునని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో శుక్రవారం జరిగిన ప్రప్రథమ నేషనల్ క్రియేటర్స్ అవార్డుల ప్రదానోత్సవంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'కోణార్క్‌లో శతాబ్దాలకాలం నాటి విగ్రహాలు మినీ స్కర్టులు, చేతిలో పర్సుతో ఉండటం చూస్తారు" అని మోదీ తెలిపారు. యువ కంటెంట్ క్రియేటర్ జాన్వీ సింగ్‌కు హెరిటేజ్ ఫ్యాషన్ ఐకాన్ అవార్డును ఈ కార్యక్రమంలో భాగంగా మోదీ అందించారు. అవార్డు ప్రదానం తర్వాత జాన్వీతో మోదీ భారతీయ ప్రాచీక కళాత్మకతపై ఆసక్తికరమైన సంభాషణ సాగించారు. భారతీయ వారసత్వం, సంస్కృతి ఏమిటనేది వస్త్ర రంగంలో ప్రపంచానికి తెలిపే కంటెంట్‌ను తయారుచేయాలని జాన్వీ సహా అవార్డులు అందుకున్న విజేతలందరినీ మోదీ కోరారు.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
హనుమకొండ	36.9	20.4
ఆదిలాబాద్	36.8	16.6
నల్లగొండ	36.5	23.0
నిజామాబాద్	36.2	20.5

ప్రారంభమైన హెచ్ 1బీ వీసా ప్రక్రియ

ముంబై, మార్చి 8: యూఎస్ ఫెడరల్ ఏజెన్సీ ఈ ఏడాది జనవరిలో లాటరీ వ్యవస్థలో పెద్ద మార్పులను ప్రతిపాదించింది. మరోవైపు తాజా మీడియా సమావేశంలో వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరీన్ జీన్ పియర్ మాట్లాడుతూ, గ్రీన్‌కార్డ్, హెచ్ 1బీ వీసా దరఖాస్తుల బ్యాక్‌లాగ్, చట్టపరమైన ఇమిగ్రేషన్ వ్యవస్థలోని సమస్యల పరిష్కారానికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 2025 ఆర్థిక సంవత్సరానికి హెచ్ 1బీ వీసా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రకటన వెలువడింది. ఆ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, సహకారాన్ని పెంపొందించడానికి 'ది యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్' (యూఎస్‌సీఐఎస్)... 'మైయూఎస్‌సీఐఎస్' సంస్థాగత ఖాతాలను ప్రారంభించాలని సూచించింది. తాజా ప్రకటన ప్రకారం.. మార్చి 6న హెచ్ 1బీ రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. మార్చి 22తో ముగుస్తాయి. ఎంపికైన దరఖాస్తుదారులను మార్చి 31న ప్రకటిస్తారు. ఏప్రిల్ 1 ఎంపికైన దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.

17న ముంబైలో కాంగ్రెస్ ర్యాలీ

కేంద్రంలో అధికారంలోకి వస్తే 30 లక్షల ఉద్యోగాల భర్తీ

» వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరకు చట్టబద్ధత

» కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భారత్ జోడో న్యాయ్ యాత్ర ముగింపు సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ముంబైలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ ర్యాలీకి ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలను కూడా ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించే ముందు ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. సమగ్ర కుల గణన చేపడతామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ ప్రకటించి 30 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో తమ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూణ్నెళ్లలోపే 35 వేల ప్రభుత్వ ఉద్యోగాలను యువతకు ఇచ్చినట్లు తెలిపారు. 25 ఏళ్లలోపు డిప్లొమా అభ్యర్థుల కోసం రైట్ టు అప్రెంటిస్ చట్టం తెచ్చి నెలకు రూ.8,500 చొప్పున ఏడాదికి లక్ష రూపాయలు ఇస్తామని తెలిపారు.

ఐటీ ట్రైబ్యునల్‌లో నిరాశ

తమ బ్యాంకు ఖాతాలపై ఐటీ శాఖ చర్యలు తీసుకోకుండా స్టే విధించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన వినతిని శుక్రవారం ఇన్‌కమ్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ తిరస్కరించింది. దీనిపై హైకోర్టులో అప్పీలు చేయడానికి వీలుగా పది రోజుల గడువు ఇవ్వాలన్న విజ్ఞప్తిని కూడా నిరాకరించింది. 2018-19 అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించిన రిటర్నులను సకాలంలో సమర్పించలేదన్న కారణంతో తొలుత రూ.103 కోట్ల క్లెయిమ్ చెల్లించాలని ఆదాయపు పన్ను విభాగం కాంగ్రెస్‌ను ఆదేశించింది. తరువాత దాన్ని రూ.105 కోట్లకు సవరించింది. రూ.30కోట్ల వడ్డీతో కలిపి రూ.135 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 16న ఆ పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసింది. దీనిపై ట్రైబ్యునల్‌ను ఆశ్రయించగా ఖాతాల స్తంభనలో కొంత వినహాయింపు ఇచ్చింది. అయినా ఐటీ శాఖ తమ ఖాతాల నుంచి రూ.65 కోట్లను విత్‌డ్రా చేసుకుందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించింది.

బీజేపీ హఠావో.. బేటీ బచావో..

మోదీ ప్రభుత్వ హయాంలో శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం 20% తగ్గిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన ఎక్స్(ట్విటర్)లో 'బీజేపీ హఠావో.. బేటీ బచావో' అని పిలుపునిచ్చారు. మహిళారెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ మీద వచ్చిన ఆరోపణలపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని మహిళలు ప్రశ్నిస్తున్నారని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

చైనా సరిహద్దులకు భారీగా బలగాలు



» ఎల్ఏసీ వెంబడి 10వేల మంది మోహరింపు

న్యూఢిల్లీ, మార్చి 8: పొరుగు దేశాలను రెచ్చగొట్టడం, అవి ప్రతీకార చర్యలకు పాల్పడితే బెదిరింపులకు దిగడం చైనాకు అలవాటుగా మారింది. గత నాలుగేళ్లుగా వాస్తవ నియంత్రణ రేఖ(ఎల్ఏసీ) వద్ద డ్రాగన్ దేశం భారీగా దళాలను మోహరించింది. ఇప్పుడు భారత్ కూడా బలగాలను పెంచుతుండటం దానికి కంటగింపుగా మారింది. భారత్ చర్యలు సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించడంలో ఏమాత్రం తోడ్పడవని చైనా విదేశాంగ శాఖ తాజాగా వ్యాఖ్యలు చేసింది. కాగా, సరిహద్దులను పటిష్టం చేసేందుకు భారత్ వేలాది మంది సైనికులను మోహరించింది. గతంలో పశ్చిమ సరిహద్దులో మోహరించిన 10వేల మంది సైనికులతో కూడిన ఒక యూనిట్‌ను చైనాతో సరిహద్దులో కొంత భాగానికి కాపలాగా నియమించినట్లు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. వివాదాస్పద చైనా సరిహద్దు కోసం తొలుత నియమించిన 9వేల మంది సైనికుల బృందం ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసిన పోరాట కమాండ్ పరిధిలోకి రానుంది. ఈ ఏకీకృత దళం ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల నుంచి చైనాను విభజించే 532 కిలోమీటర్ల పొడవైన సరిహద్దును కాపాడుతుంది.

రష్యాకు మానవ అక్రమ రవాణా

గుట్టును రట్టు చేశామన్న సీబీఐ

న్యూఢిల్లీ, మార్చి 8: అధిక వేతనాలు ఆశ చూపి భారత యువకులను రష్యాకు తరలించి ఉక్రెయిన్‌పై యుద్ధంలో పాల్గొనేలా చేసిన మానవ అక్రమ రవాణా ముఠా గుట్టును రట్టు చేశామని సీబీఐ ప్రకటించింది. దళారుల మాటలు నమ్మి రష్యా సైన్యంలో సహాయకుని ఉద్యోగాల్లో చేరిన ఇద్దరు భారతీయులు ఉక్రెయిన్‌తో జరుగుతున్న పోరులో ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. ఢిల్లీ, ముంబై, చెన్నై సహా దేశంలోని 13 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. కొన్ని ప్రైవేట్ వీసా కన్సల్టింగ్ ఏజెన్సీలు, దళారులపై మార్చి 6న కేసు నమోదు చేసింది. పలువురు నిందితులను అదుపులోకి తీసుకుంది. దళారుల మాటల నమ్మి 35 మందికి పైగా భారతీయులు రష్యా వెళ్లారని సీబీఐ తెలిపింది. ఢిల్లీకి చెందిన ఓ కన్సల్టెన్సీ స్టూడెంట్ వీసాలతో 180 మంది భారతీయులను ఇటీవల రష్యా పంపింది. ఈ అంశంపై కూడా సీబీఐ దర్యాప్తు చేస్తోంది.

విమానం టైరు ఊడి నేలపై

» అయినా సురక్షితంగా విమానం ల్యాండింగ్

» అమెరికాలో ఘటన.. ఎయిర్‌పోర్టులో కార్లు ధ్వంసం

వాషింగ్టన్, మార్చి 8: విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపట్లోనే ఓ టైరు ఊడి నేలపై పడింది. టైరు తాకిడికి విమానాశ్రయం పార్కింగ్‌లో నిలిపి ఉంచిన పలు కార్లు ధ్వంసమయ్యాయి. విమానాన్ని మరో ఎయిర్‌పోర్టుకు మళ్లించి సురక్షితంగా దింపటంతో దాంట్లోని 249 మంది ప్రయాణికులు బతుకుజీవుడా అనుకుంటూ బయటపడ్డారు. ఈ ఘటన గురువారం అమెరికాలో జరిగింది. శాన్‌ఫ్రాన్సిస్కో అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 777 విమానం జపాన్‌కు బయల్దేరింది. గాలిలోకి ఎగిరిన కొన్ని సెకన్లలోనే విమానం టైర్లలో ఒకటి ఊడిపోయింది. ఎయిర్‌పోర్టు సిబ్బంది వాహనాలను నిలిపి ఉంచే ప్రదేశంలో ఆ టైరు పడటంతో పలు కార్లు ధ్వంసమయ్యాయి. విషయం తెలిసిన అధికారులు విమానాన్ని లాస్‌ఏంజెల్స్‌కు మళ్లించారు. అక్కడ విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ఈ ఘటనపై యునైటెడ్ ఎయిర్‌లైన్స్ స్పందిస్తూ.. విమానానికి ఇరువైపులా ఆరు జతల టైర్లు ఉన్నాయని, ఒకటి ఊడినా తక్షణ ప్రమాదం ఏమీ లేదని తెలిపింది. కాగా, ఈ ఏడాది జనవరిలో అమెరికాలోని పోర్ట్‌ల్యాండ్‌లో టేకాఫ్ అయిన 'బోయింగ్ 737 మాక్స్ 9' విమానం నుంచి ఓ తలుపు సైజు ప్యానెల్ ఊడి పడిపోయింది.


ఊడిపడిన విమానం టైరు

ఫిబ్రవరి మండింది!

గత నెలలో రికార్డు ఉష్ణోగ్రతలు



విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పసిఫిక్ మహా సముద్రంలో గతేడాది ప్రారంభమైన ఎల్‌నినో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో గరిష్ఠ స్థాయికి చేరింది. దీనిని కొందరు వాతావరణ నిపుణులు సూపర్ ఎల్‌నినోగా పేర్కొంటున్నారు. ఎల్‌నినో కారణంగానే 2023 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది. ఎల్‌నినో కొనసాగుతున్నందున ఈ ఏడాది జనవరితోపాటు ఫిబ్రవరిలో కూడా ప్రపంచవ్యాప్తంగా రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 1991-2020 మధ్య నమోదైన ఉష్ణోగ్రతల సగటును పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది ఫిబ్రవరిలో 0.81 డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదైంది. గతంలో 2016 ఫిబ్రవరిలో సగటు కంటే 0.12 డిగ్రీలు ఎక్కువగా నమోదు కాగా, ఈ ఏడాది ఆ రికార్డును అధిగమించిందని స్కైమెట్ పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా గతేడాది మొదలైన వేడి వాతావరణం 2024లో కూడా కొనసాగుతూనే ఉంది. దీంతో ఫిబ్రవరిలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదైనట్టు యూరప్‌లోని కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ తెలిపింది. గతంలో 2015 చివరిలో పసిఫిక్ సముద్రంలో సూపర్ ఎల్‌నినో ఏర్పడడంతో 2016 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది. గతేడాది ప్రారంభంలో పసిఫిక్ మహా సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు అత్యంత వేడిగా మారినందున 2023ను సూపర్ ఎల్‌నినో సంవత్సరంగా నిపుణులు పేర్కొంటున్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో గతేడాది జూలైలో తొలుత అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అప్పటి నుంచి ఫిబ్రవరి వరకు వరుసగా తొమ్మిదో నెలలో రికార్డు ఉష్ణోగ్రతలు నమోదుకావడం కూడా రికార్డని వాతావరణ శాఖ రిటైర్డు అధికారి ఒకరు పేర్కొన్నారు. వాతావరణం వేడెక్కడానికి ఎల్‌నినోతోపాటు మానవ ప్రేరితమైన కారణాలు కూడా ఉన్నాయని వివరించారు.

నైజీరియాలో 287 మంది విద్యార్థుల కిడ్నాప్

అబూజా, మార్చి 8: నైజీరియాలో మిలిటెంట్లు గురువారం 297 మంది పాఠశాల విద్యార్థులను సామూహికంగా కిడ్నాప్ చేశారు. తల్లిదండ్రుల నుంచి భారీగా సొమ్ము గుంజడానికే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. కదున రాష్ట్రంలోని కురిగ టౌన్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తుపాకులతో బెదిరించి తమ వెంట తీసుకెళ్లారు. ఉదయం పాఠశాల ప్రారంభమయిన కొద్దిసేపటికే ఈ సంఘటన జరిగింది. ఇందుకు తమదే బాధ్యత అంటూ ఏ ముఠా కూడా ఇంతవరకు ప్రకటన విడుదల చేయలేదు. వారం రోజుల క్రితమే బోర్నో రాష్ట్రంలోని చిబోక్ టౌన్‌లో 200 మంది విద్యార్థినిలను ఇస్లామిక్ తీవ్రవాదులు కిడ్నాప్ చేశారు. అది మరువక ముందే మళ్లీ సామూహిక కిడ్నాప్ జరగడం గమనార్హం. మహిళలను, పిల్లలను కిడ్నాప్ చేయడం 2014 నుంచి నైజీరియాలో పెద్ద సమస్యగా మారింది. ముఖ్యంగా వాయువ్య, మధ్య రాష్ట్రాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఇక్కడ డజన్ల కొద్దీ ఉన్న సాయుధ ముఠాలు గ్రామాలపై పడి కిడ్నాప్‌లు చేస్తుంటాయి. దారిన వెళ్లే ప్రయాణికులను కూడా విడిచిపెట్టవు. భారీగా సొమ్ము ముట్టచెప్పితే తప్ప వారిని విడుదల చేయవు. దేశంలో శాంతి భద్రతలు ప్రమాదకరంగా ఉన్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగులపై నోరు జారితే ఊరుకోం

» మీ ఇళ్ల ఎదుటే ఆందోళనలు చేపడతాం

» హరీశ్‌పై టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి ధ్వజం



మాట్లాడుతున్న టీజీవో అధ్యక్షుడు శ్రీనివాసరావు

హైదరాబాద్/ఖమ్మం కలెక్టరేట్, మార్చి 8: 'ఉద్యోగుల ఉద్యమాల పునాది పైనే మీరు పదేళ్లపాటు అధికారాన్ని చెలాయించారు. అధికారంలోకి వచ్చాక పదేళ్ల పాటు ఉద్యోగుల సంఘాలను నిర్వీర్యం చేశారు. ఉద్యోగులకు రావాల్సిన వేతనాలను కూడా 10-15వ తేదీల దాకా ఇవ్వకుండా ఆత్మహత్యలకు కారణమయ్యారు. అలాంటి మీరు అధికారం పోగానే ఉద్యోగులపైనా.. వారి వేతనాలపై నోరు పారేసుకోవడం మంచిది కాదు.. మరో మారు ఉద్యోగులపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం. మీ ఇళ్ల ఎదుటే ఆందోళనలు చేస్తాం' అని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. 'రైతుబంధు సాయాన్ని ఆపేసిన ప్రభుత్వం.. ఏసీ రూంలో ఉండే ఉద్యోగులకు మాత్రం వేతనాలు చెల్లిస్తోంది" అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఖమ్మంలో శుక్రవారం ఏలూరి విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులు కానీ, ఉద్యోగ సంఘాలు కానీ రైతులకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లించడాన్ని తట్టుకోలేక రైతులు, ఉద్యోగుల మధ్య చిచ్చు పెట్టేలా హరీశ్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ పాలనలో పీఆర్సీ, జీపీఎఫ్, మెడికల్ బిల్లులను చెల్లించకుండా ఉద్యోగులను ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. కాగా, తెలంగాణ ఏర్పాటులో ఉద్యోగుల పాత్ర కూడా ఉందని, ఈ విషయాన్ని మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, తెలంగాణ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షౌకత్ అలీ తదితరులు అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం ఉద్యోగుల డీఏలు, పీఆర్సీ బకాయిలు, మెడికల్ బిల్లులు ఇవ్వలేదని గుర్తు చేశారు.

నాపై దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నా

» ఉద్యోగులకు 1న జీతాలు ఇవ్వడాన్ని నేను వ్యతిరేకించలేదు: హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు 1న జీతాలు ఇవ్వడాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు కొందరు దుష్ప్రచారం చేయడం బాధాకరమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ మంత్రి హరీశ్‌రావు 'ఎక్స్'లో పేర్కొన్నారు. తన ప్రసంగాన్ని తప్పు అర్థం వచ్చేలా ప్రచురించిన మీడియా సంస్థకు రిజాయిండర్ పంపించి, వార్తను సరిచేయించానని పేర్కొన్నారు. అయినప్పటికీ, కొందరు కావాలని ఉద్యోగులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తామన్న ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని తాను పదే పదే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ వస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా ఉద్యోగుల పక్షాన గొంతెత్తిన తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఉద్యోగులు అర్థం చేసుకోవాలని కోరారు.

నేడు సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్, మార్చి 8: నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాల్వ కింద ఉన్న గ్రామాల్లో తాగునీటి అవసరాల నిమిత్తం శనివారం నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎడమ కాల్వ పరిధిలో ఉన్న నల్లగొండ జిల్లాలోని అన్ని గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని తెలంగాణ నీటి పారుదలశాఖ అధికారులు కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కు లేఖ రాయగా మూడు టీఎంసీల నీటి విడుదలకు అనుమతి ఇచ్చినట్లు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. రోజుకు మూడు వేల క్యూసెక్కుల చొప్పున 10 రోజుల్లో మూడు టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు. కాగా, శుక్రవారం సాయంత్రానికి నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 514.60 అడుగులుగా ఉంది. ఎగువనుంచి ఎలాంటి నీటి రాక లేదు.

'రజాకార్' ఏ మతానికీ చెందినది కాదు

» సినిమా నిర్మాత, బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోని 100 కోట్ల మందికి నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ అరాచకాలు ఇంకా తెలియవని రజాకార్ చిత్ర నిర్మాత, బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి అన్నారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో రక్తపుటేర్లు పారించిన నిజాం దుర్మార్గాలను రజాకార్ చిత్ర ద్వారా చూపించనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నారాయణరెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వచ్చే శుక్రవారం విడుదలయ్యే రజాకార్ చిత్రాన్ని అడ్డుకోవడానికి కొంతమంది హైకోర్టుకు వెళ్లారని తెలిపారు. తాను చరిత్రను చిత్రంగా చూపించాలనే ఈ సినిమా తీశానని, నిజాం వారసులయితేనే సినిమాను అడ్డుకోవాలని అన్నారు. రజాకార్ సినిమా ఏ మతానికి, ఏ వర్గానికి చెందినది కాదని నారాయణరెడ్డి చెప్పారు.


ఎస్సైపై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నల్లగొండ లీగల్ సెల్ బృందం

విచారణ పేరిట పిలిచి కొట్టారు

» నార్కట్‌పల్లి ఎస్సైపై ఎస్పీ, మానవ హక్కుల కమిషన్‌కు బీఆర్ఎస్ నాయకుడి ఫిర్యాదు

» విచారించానే తప్ప కొట్టలేదు: ఎస్సై


ఎస్సై అంతిరెడ్డి

నార్కట్‌పల్లి (నల్లగొండ), మార్చి 8: విచారణ పేరిట పోలీస్‌స్టేషన్‌కు పిలిచి అసభ్యంగా మాట్లాడడంతోపాటు బెల్టుతో కొట్టారని నార్కట్‌పల్లి ఎస్సైపై బీఆర్ఎస్ నాయకుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేతల రాజకీయ ప్రేరణతో తనను కొట్టారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా లీగల్ సెల్ నాయకులతో కలిసి మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. దీనికి సంబంధించిన వివరాలను బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు, బాధితుడు మాదగోని రమేష్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాదగోని రమేష్.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలతోపాటు ఎల్లారెడ్డిగూడెంలో కొబ్బరికాయల వేలం డబ్బుల చెల్లింపుల వివాదంపై తన అభిప్రాయాన్ని వాట్సప్ స్టేటస్‌లో పెట్టుకున్నారు. ఈ స్టేటస్‌లపై కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రేగట్టె సతీష్ ఈ నెల 6న నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అదే రోజు సాయంత్రం విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై అంతిరెడ్డి తన పట్ల అసభ్యకరంగా మాట్లాడడంతోపాటు బెల్టుతో కొట్టారని రమేష్ చెప్పారు. కేటీఆర్‌నూ ఎస్సై దూషించారని, కాంగ్రెస్ చెప్పినట్లే ఇప్పుడు వినాలంటూ బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని కేటీఆర్‌కు కూడా తెలియజేయడంతో ఆయన జిల్లా ఎస్పీతో మాట్లాడినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ ఘటనపై ఎస్సైని వివరణ కోరగా.. రమేష్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు స్టేషన్‌కు పిలిపించి విచారించానే తప్ప కొట్టలేదన్నారు. ఈ ఘటనపై ఎస్పీ చందనాదీప్తిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పరస్పర ఫిర్యాదులు, జరిగిన ఘటనలపై విచారిస్తామన్నారు.

యూరప్‌లో ప్యారట్ ఫీవర్‌తో ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, మార్చి 8 : ఐరోపా ఖండంలో అనూహ్యంగా వ్యాపిస్తున్న ప్యారట్ ఫీవర్ కలకలం రేపుతోంది. ఈ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ బారిన పడి ఈ ఏడాది ఇప్పటి వరకు ఐదుగురు చనిపోయారని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. యూరప్‌లో గత ఏడాదే ఈ తరహా కేసులను గుర్తించారు.

డబ్బులివ్వాలంటూ నా భర్తను ఆ జర్నలిస్టులు వేధించారు

» పోలీసులకు నీరటి రవి భార్య ఫిర్యాదు

» ముగ్గురు విలేకరులపై కేసు నమోదు

చేవెళ్ల, మార్చి 8: గొలుసుకట్టు స్కీమ్‌లో డబ్బులు కట్టించి మోసపోయిన నీరటి రవి అనే వ్యక్తి.. తన ముగ్గురు పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకున్న కేసు కొత్త మలుపు తిరిగింది. స్కీమ్‌లో భాగంగా కట్టిన డబ్బులకు లాభాలు రాకపోవడంతో బాధితులు, తన భర్త మీద ఒత్తిడి చేశారని.. ఇది తెలిసి ఓ ఐదుగురు జర్నలిస్టులు రూ.20 లక్షల మేర డబ్బులివ్వాలంటూ వేధించారని మృతుడు రవి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. జర్నలిస్టుల నుంచి ఒత్తిడి తట్టుకోలేకే పిల్లలను చంపి, ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు మోకిల పోలీసులు ముగ్గురు జర్నలిస్టులపై కేసు నమోదు చేశారు. మోకిల సీఐ వీరబాబు వెల్లడించిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం టంగటూర్ గ్రామానికి చెందిన నీరటి రవి (32) గుంటూరు జిల్లాకు చెందిన జీఎస్ఎస్ ఫౌండేషన్ సర్క్యులేషన్ స్కీమ్‌లో డబ్బులు పెడితే అధిక లాభాలొస్తాయని చెప్పి గ్రామస్థులతో పాటు మండలంలోని చాలామందితో డబ్బులు పెట్టించాడు. ఇలా సేకరించిన డబ్బులు మొత్తం ఫౌండేషన్ సభ్యుడు తిరుపతిరావుకు ఇచ్చాడు. ఈ క్రమంలో వ్యాపారం బాగా నడుస్తుండటంతో 8 నెలల క్రితం గ్రామానికి చెందిన నాగాళ్ల శేఖర్, సుధాకర్ వద్ద 39 గుంటల భూమిని రవి కొని, అక్కడ ముగ్గురి పిల్లల(ఎస్ఎంయు) పేరు మీద ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నాడు. మూడు నెలల నుంచి జీఎస్ఎస్ ఫౌండేషన్ నుంచి డబ్బులు రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు డబ్బులివ్వాలని రవిపై ఒత్తిడి చేశారు. ఇది తెలిసి.. శంకర్‌పల్లి మండలంలోని ఐదుగురు జర్నలిస్టులు తమకు రూ.20 లక్షలు ఇవ్వాలంటూ రవిని బెదిరించారు. తాను రూ. పది లక్షలు ఇస్తానని రవి ఒప్పుకొని ముందుగా రూ. రెండున్నర లక్షలు జర్నలిస్టులకు ఇచ్చాడు. ఐదుగురు జర్నలిస్టుల్లో ముగ్గురి పేర్లను మృతుడి భార్య ఫిర్యాదులో పేర్కొంది. బకాయిలు చెల్లించాల్సిన వారితో పాటు జర్నలిస్టుల ఒత్తిళ్లతో తన భర్త తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపింది. ఈ మేరకు ముగ్గురు జర్నలిస్టులపై కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

ఇసుకే బంగారమాయేనా?

రోజురోజుకు పెరుగుతున్న ధరలు.. ఇసుకపై కొత్త పాలసీ కోసం తవ్వకాలపై ప్రభుత్వం అంక్షలు

» కొన్ని చోట్ల సర్కారు పేరు చెప్పి ఎమ్మెల్యేలు, మంత్రుల ఆంక్షలు

» ఇదే అదనుగా కృత్రిమ కొరత సృష్టించి.. ధరలు పెంచుతున్న అక్రమార్కులు


భూపాలపల్లి జిల్లాలో ఇసుక రీచ్‌లు (ఫైల్)

వరంగల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఇసుక ధరలకు రెక్కలొస్తున్నాయి. కొత్త ప్రభుత్వం పాత ఇసుక పాలసీకి చెక్ పెట్టి, కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చేందుకు కసరత్తు చేపట్టిన క్రమంలో చాలా ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లలో విక్రయాలు స్తంభించాయి. ఇదే అదనుగా ఇసుకాసురులు కృత్రిమ కొరత సృష్టిస్తూ భారీగా ధరలు పెంచి అమ్ముతున్నారు. గత ప్రభుత్వం ఇసుక ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు వీలుగా తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎండీసీ) ద్వారా ఇసుక విక్రయాలను నిర్వహించింది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన సొసైటీల ద్వారా గోదావరి నుంచి ఇసుకను వెలికితీసి అమ్మకాలు జరిపించగా, గిరిజనేతర ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లకు టెండర్లు నిర్వహించింది. కాళేశ్వరం ప్రాజెక్టు ఏరియాలోనే అత్యధికంగా ఇసుక రీచ్‌లను గుర్తించి తవ్వకాలు చేపట్టింది. ప్రస్తుతం భూపాలపల్లి జిల్లాలో 11 ఇసుక రీచ్‌లు ఉండగా, పెద్దపల్లి జిల్లాలో 12, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 4, ములుగు జిల్లాలో 7, మంచిర్యాల జిల్లాలో 3, నల్గొండ, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్, గద్వాల్, మహబూబాబాద్ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున ఇసుక రీచ్‌లు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఇసుక పాలసీని పూర్తిగా మార్చాలనే లక్ష్యంతో కొత్త పాలసీని తీసుకొచ్చే వరకు కొన్ని ఇసుక రీచ్‌లపై పరిమితంగా అంక్షలు విధించింది. ప్రభుత్వం పేరు చెప్పి కొన్ని చోట్ల కొంతమంది ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా ఇసుక అమ్మకాలపై తమ వ్యక్తిగతస్థాయిలో అంక్షలు విధిస్తున్నారు. ఇదే అదనుగా ఇసుకాసురులు సిండికేట్‌గా మారారు. ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించి ధరలను భారీగా పెంచి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు, అధికారులు కూడా ఏ జిల్లాలోనూ పూర్తి స్థాయిలో ఇసుక బుకింగ్‌లు ఇవ్వడం లేదు. భూపాలపల్లిలో 11 ఇసుక రీచ్‌లు ఉంటే నాలుగు చోట్ల, పెద్దపల్లిలో 12 ఇసుక రీచ్‌లు ఉంటే 6 చోట్ల, ములుగులో 7 రీచ్‌లు ఉంటే మూడు చోట్ల మాత్రమే టీఎస్ఎండీసీ అధికారులు బుకింగ్‌లు చేస్తున్నారు. వీటి నుంచి ప్రతి రోజు సుమారు 25 వేల మెట్రిక్ టన్నుల నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల వరకు ఇసుకను తరలిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో బుకింగ్

గోదావరి ఇసుక కోసం టీఎస్ఎండీసీ వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. టన్ను ఇసుకకు ఆన్‌లైన్‌లో 5 శాతం జీఎస్టీతో కలిపి రూ.392 చెల్లించాలి. ఈ మాత్రం చెల్లించి కొనుగోలు చేసి మార్కెట్లో మాత్రం అడ్డగోలు రేట్లకు విక్రయిస్తున్నారు. వరంగల్‌లో టన్ను దొడ్డు ఇసుకకు రూ.900-1100, హైదరాబాద్‌లోని ఉప్పల్, ఎల్‌బీ నగర్ ఏరియాల్లో రూ.1500-1800 వరకు, సిటీ లోపలి ఏరియాల్లో అయితే రూ.2100-2300 వరకు వసూలు చేస్తున్నారు. సన్నరకం ఇసుక అయితే టన్నుకు రూ.500 వరకు అదనంగా తీసుకుంటున్నారు. 12 టైర్ల లారీలో 28 టన్నుల ఇసుక లోడు చేసి తీసుకెళ్తారు. దీనికి టీఎస్ఎండీసీకి రూ.10,976 చెల్లిస్తారు. కాళేశ్వరం నుంచి హైదరాబాద్‌కు ఈ లోడును తరలించాలంటే డీజిల్, డ్రైవర్, క్లీనర్ తదితర ఖర్చులకు మరో రూ.19 వేలు అవుతుంది. మొత్తంగా రూ.30 వేలకు ఇసుక లారీ హైదరాబాద్‌కు చేరుతుందని ఓ లారీ డ్రైవర్ తెలిపారు. అయితే ఆ లోడును రూ.70 వేల వరకు విక్రయిస్తున్నారు. అంటే ఒక ఇసుక లారీపై రూ.40వేల వరకు లాభం ఉంటోంది. అదనపు బకెట్ పేరుతో మరో నాలుగైదు టన్నుల ఇసుకను కూడా అదనంగా లారీల్లో తీసుకొచ్చి అమ్ముతున్నారు. ఈ విధంగా అధిక ధరలకు ఇసుక విక్రయాలు చేస్తున్నా పట్టించుకునే అధికారులు లేకపోవడంతో ఇసుకాసురుల ఇష్టారాజ్యంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీగా పెరిగిన ఇసుక ధరలతో సామాన్యుడు ఇల్లు కట్టుకునే పరిస్థితి ఉండటం లేదు. వేసవి కాలం కావటంతో నిర్మాణ పనులు కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇలాగే ఇసుక ధరలు ఉంటే అన్ని రకాల నిర్మాణాలపైనా ప్రభావం పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని రీచ్‌లలో ఇసుక లభ్యతను అందుబాటులోకి తేవాలని, అధిక ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. వరంగల్, రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్‌లలో విడిగా కొనసాగుతున్న ఇసుక విక్రయ పాయింట్లపై దాడులు చేసి ధరలను అదుపులోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్సారెస్పీలో గల్లంతై.. ముగ్గురి మృతి

» 'శివరాత్రి' స్నానానికి దిగి మునక


అజ్మిత్ సాయికిరణ్



అజ్మీరా సాయినాథ్, బానవత్ లోకేశ్ (ఫైల్)

ముప్కాల్, మార్చి 8: మహా శివరాత్రి పండుగ పర్వదినాన నిజామాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ముప్కాల్ మండలంలోని శ్రీరాం సాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) జలాశయంలో స్నానానికి దిగిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల వివరాల మేరకు.. జిల్లాలోని జక్రాన్‌పల్లి మండలంలోని గన్యాతండాకు చెందిన అజ్మీరా సాయినాథ్ (16), బానవత్ లోకేశ్ (16), అజ్మిత్ సాయికిరణ్ అలియాస్ మున్నా (17), వంశీ, గోపాల్, అభి వారి కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం గోదావరిలో స్నానం చేసి శివయ్యను దర్శించుకునేందుకు వచ్చారు. కుటుంబ సభ్యులు పుష్కరఘాట్ల వద్ద స్నానాలు చేస్తుండగా.. కారులో వచ్చిన ఆరుగురు మాత్రం ఎస్సారెస్పీ లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద గల జలాశయంలోకి దిగారు. నీటిలో సిమెంట్ దిమ్మెలు కనిపించడంతో సాయినాథ్, లోకేశ్, సాయికిరణ్ ఒకరి చేతులు ఒకరు పట్టుకొని లోపలికి వెళ్లారు. మిగతా ముగ్గురు వారిని అనుసరిస్తూ వెనుకాలే వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండటంతో ముందు వెళ్లిన ముగ్గురు ఈత రాక నీటిలో గల్లంతయ్యారు. మిగతా ముగ్గురు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి వారి మృతదేహాలు బయటకు తీశారు. వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సాయికిరణ్, సాయినాథ్ డిచ్‌పల్లిలోని ఎస్ఆర్ కాలేజీలో ఇంటర్ చదువుతుండగా, లోకేశ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ఘటనా స్థలాన్ని ఏసీపీ బస్వారెడ్డి పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఆయన తెలిపారు.

రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గురువారం 300 మిలియన్ యూనిట్ల మైలు రాయిని దాటేసింది. ఇప్పటిదాకా గత పదేళ్లలో రోజువారీ గరిష్ఠ వినియోగం 298 మిలియన్ యూనిట్లు. గురువారం ఒక్క దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలోనే 195.19 మిలియన్ యూనిట్ల వినియోగం రికార్డయింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 70.71 మిలియన్ యూనిట్లుగా రికార్డయింది. ఇక డిమాండ్ గురువారం ఉదయం 10 గంటల సమయంలో 15,353 మెగావాట్లుగా నమోదయింది. ఈ డిమాండ్‌ని తీర్చడంలో 76.158 మిలియన్ యూనిట్లతో జెన్‌కో, 23.697 మిలియన్ యూనిట్లతో సింగరేణి, 164.065 మిలియన్ యూనిట్లు కేంద్ర విద్యుత్ సంస్థలతో పాటు కొనుగోళ్ల రూపంలో, 39.872 మిలియన్ యూనిట్లతో సంప్రదాయేతర ఇంధన వనరుల పాత్ర ఉంది.

గిరిజనుల్లో అక్షరాస్యత పెంచేందుకు కృషి: కిషన్ రెడ్డి

» జాకారం వైటీసీలో తాత్కాలిక గిరిజన వర్సిటీ క్యాంపస్ ప్రారంభం


జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం తాత్కాలిక క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ములుగు, మార్చి 8: గిరిజనుల్లో అక్షరాస్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతిష్ఠాత్మక సమ్మక్క, సారలమ్మ జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం కోసం ములుగు మండలం జాకారంలోని వైటీసీలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన క్యాంపస్‌ను రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో గిరిజన అక్షరాస్యత 49 శాతం మాత్రమేనని అన్నారు. వంద శాతం గిరిజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఈ యూనివర్సిటీ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భూసేకరణ, బదలాయింపు ప్రక్రియలో జాప్యం కారణంగా వర్సిటీ ఏర్పాటు ఆలస్యమైందన్నారు. 335 ఎకరాల్లో 50 ఎకరాలకు అటవీ శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉందని, అనుకున్న విధంగా డీపీఆర్, టెండర్ ప్రక్రియ పూర్తయితే త్వరలోనే ప్రధాని మోదీ భూమి పూజ చేస్తారని తెలిపారు. వర్సిటీ నిర్మాణం కోసం కేంద్రప్రభుత్వం రూ.889 కోట్లను కేటాయించిందని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. 2024-25 విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, తొలుత బీఏ ఇంగ్లీష్, బీఏ సోషల్ సైన్స్ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. గిరిజనులకు 33 శాతం సూపర్ న్యూమరరీ సీట్లను కేటాయించడం జరిగిందన్నారు. ఈ విశ్వవిద్యాలయం నిర్వహణ బాధ్యతను కొంతకాలం హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ తీసుకుంటుందని కిషన్‌రెడ్డి చెప్పారు. అనంతరం రామప్ప దేవాలయాన్ని సందర్శించిన మంత్రి కిషన్‌రెడ్డి రుద్రేశ్వరునికి పూజలు చేశారు. రూ.62 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు.

గిరిజన విద్యార్థులకు 40.5 శాతం రిజర్వేషన్: వర్సిటీ ఓఎస్డీ వంశీకృష్ణారెడ్డి

ట్రైబల్ వర్సిటీలో గిరిజన విద్యార్థులకు యూజీసీ నిబంధనల ప్రకారం 7.5 శాతం రిజర్వేషన్‌తో పాటు 33 శాతం సూపర్ న్యూమరరీ సీట్లను కేటాయించామని వర్సిటీ ఓఎస్డీ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. నాలుగేళ్ల కాలపరిమితి కలిగిన ప్రతి కోర్సులోనూ 32 సీట్లు ఉంటాయని, వీటిలో 8 చొప్పున గిరిజనులకు సూపర్ న్యూమరరీ కింద కేటాయించామని అన్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుందని తెలిపారు. ఈనెల 26లోగా అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలలో మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, కలెక్టర్ త్రిపాఠి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ మహేందర్, హెచ్‌సీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ తుకారాం తదితరులు పాల్గొన్నారు.



వేయి స్తంభాల గుడికి సంపూర్ణ రూపం!

కల్యాణ మండపం పునర్నిర్మాణం అద్భుత ఘట్టం.. రుద్రేశ్వరుడికి అంకితమిస్తున్నాం

» కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హనుమకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వేయి స్తంభాల గుడి కల్యాణ మండపం పునరుద్ధరణ ఓ అద్భుత ఘట్టమని.. కల్యాణ మండపం పునర్నిర్మాణంతో గుడికి సంపూర్ణ రూపం వచ్చిందని కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, ఓర్పునేర్పుతో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని మహాశివరాత్రి పర్వదినాన ప్రారంభించినందున.. దీనిని ఆ పరమశివుడికే అంకితమిస్తున్నామని చెప్పారు. హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాలగుడి ఆవరణలో రూ.15 కోట్ల వ్యయంతో పునర్నిర్మించిన కాకతీయుల నాటి కల్యాణ మండపాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అంతకు ముందు గుడి ఆవరణలో యాగశాలలో శాంతిపూజలో మహాచండీ యాగం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. రుద్రేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక చిన్న కల్యాణ మండపాన్ని తిరిగి నిర్మించడానికి పంతొమ్మిదేళ్లు పట్టిందని, ఆ కాలంలో అనేక దేవాలయాలు, కోటలు, అనేక ఇతర కట్టడాలను కట్టడానికి ఇంకెన్ని సంవత్సరాలు పట్టి ఉండొచ్చునని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఆ జాబితాలో ఇక్కడి నందీశ్వరుడు కూడా..

ప్రాచీన కట్టడాలను, కళాఖండాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. హిందువులను తమ మతంలోకి మార్చుకోవడానికి 1320లో అప్పటి ముస్లిం పాలకులు ఒక ఎజెండాగా తీసుకొని ప్రణాళిక ప్రకారం దేవాలయాలను విచక్షణారహితంగా ధ్వంసం చేశారని, ఆ జాబితాలో వేయిస్తంభాలగుడిలో ప్రస్తుతం పునరుద్ధరించిన నందీశ్వరుడు కూడా ఉన్నాడని చెప్పారు. మండపం పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన స్థపతి శివకుమార్ శ్రీనివాసన్‌తో పాటు పునర్నిర్మాణానికి కృషి చేసిన రిటైర్ ప్రొఫెసర్ పాండు రంగారావు, కేంద్ర పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారుల సేవలను కొనియాడారు. శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవడం వల్లనే కల్యాణ మండపం పనులు త్వరగా పూర్తయ్యాయన్నారు. రామప్పలాగానే హనుమకొండ వేయిస్తంభాల గుడిని కూడా యునెస్కో పరిధిలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్రమంత్రిని అభ్యర్థించారు. కాగా, రామప్ప దేవాలయాన్ని సందర్శించిన మంత్రి కిషన్‌రెడ్డి రుద్రేశ్వరునికి పూజలు చేశారు. రూ.62 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దారితప్పిన న్యాయమూర్తి!

పశ్చిమబెంగాల్‌లో ఒక సిట్టింగ్ జడ్జ్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్త చర్చ అయింది. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా రాజీనామా చేసిన అభిజిత్ గంగోపాధ్యాయ ఆ వెంటనే భారతీయ జనతాపార్టీలో చేరిపోవడంతో, ఆయన ఇంతకాలమూ ముప్పుతిప్పలు పెట్టిన మమతాబెనర్జీ పార్టీ ఇప్పుడు ఎదురుదాడి ఆరంభించింది. రాజీనామా చేస్తాను, రాజకీయాల్లో చేరతాను అని ఆయన ఓ మాటన్నప్పుడే ఆ పార్టీ ఏమిటో టీఎంసీ నాయకులు ముందే చెప్పేశారు. రాజకీయాల్లో చేరి ప్రజలకు సేవచేయాలనుకుంటున్న ఆ మాజీ న్యాయమూర్తికి ఆగస్టువరకూ పదవీకాలం ఉన్నప్పటికీ, అప్పటికి లోక్‌సభ ఎన్నికలు ముగిసిపోతాయి కనుక ఇలా త్వరపడివుంటారు. న్యాయమూర్తిగా సమాజానికి చేస్తున్న సేవ ఆయనకు అంత సంతృప్తికలిగించలేదేమో!

న్యాయమూర్తిగా తాను పక్షపాతాలు, రాగద్వేషాలకు అతీతంగానే తీర్పులు ఇచ్చానని చెప్పుకున్నప్పటికీ, ఆ స్థానంలో ఉండగా ఆయనమీద చేయలేని విమర్శలను ఇప్పుడు టీఎంసీ యథేచ్ఛగా చేస్తున్నది. రాష్ట్రంలోని వేలాదిమంది నిరుద్యోగుల పొట్టగొట్టిన తమరిని ఎక్కడనుంచి పోటీచేసినా ఓడించడమే నా లక్ష్యం అంటూ తృణమూల్ అధినేత మమతాబెనర్జీ ఆయనకు ఓ సవాల్ విసిరారు. బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ప్రధానంగా ఆయన ఇచ్చిన ఆదేశాలు వేలాదిమంది యువత భవిష్యత్తును ప్రభావితం చేసిన మాట నిజం. ఆయన ఆదేశాల మేరకు అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదవుతూ, మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ళమీద దాడులు జరుగుతూ అధికారపక్షం తీవ్రంగా అప్రదిష్ట పాలైంది, మూడోసారి అధికారంలోకి రావడం మమతాబెనర్జీకి గగనతరమైపోయింది. ఈ వ్యవహారంలో కనీసం పద్నాలుగు కేసులను సీబీఐ విచారణకు ఆదేశించి అవినీతి వ్యతిరేక యోధుడిగా సామాన్యుల్లో ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారు ఆయన. పశ్చిమబెంగాల్‌ను సమూలంగా ప్రక్షాళించాలన్న తపనవల్ల కాబోలు, తీర్పులు చెప్పడానికే ఆయన పరిమితం కాలేదు. కేసులకు సంబంధించి విలేకరులతో మాట్లాడుతూ, చానెళ్ళకు ఇంటర్వ్యూలు ఇస్తూ తృణమూల్ నాయకులమీద విమర్శలు చేసేవారు. మమతాబెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ విపరీతంగా ఆస్తులు కూడబెడుతున్నారని ఓ ఇంటర్వ్యూలో అన్నందుకు, కోర్టు రూముల్లో ఉండాల్సిన సిట్టింగ్ జడ్జికి చానెళ్ళతో ఏమి పని అంటూ సుప్రీంకోర్టు ఆగ్రహించి, ఆ కేసును మరొకరికి అప్పగించినా తృణమూల్ నేతలమీద ఆయన వీరంగం తగ్గలేదు. ఈ రాష్ట్రంలో ఏ చిన్నపనికావాలన్నా లంచం ఇవ్వాల్సిందేనా? అంటూ అమాయకంగా, ధర్మాగ్రహంతో ఆయన వేసే ప్రశ్న ప్రతిపక్షాలకు ఆయుధంగా ఉపకరించేది, అధికారపక్షాన్ని ఆత్మరక్షణలో పడవేసేది.

రాజకీయపార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నావంటూ తోటి న్యాయమూర్తిని మొన్న జనవరిలో తప్పుబట్టిన అభిజిత్ గంగోపాధ్యాయ ఇప్పుడు తానే ఓ రాజకీయపార్టీలో చేరిపోయారు. పాపపంకిలమైపోయిన రాష్ట్రాన్ని తృణమూల్‌నుంచి విముక్తిచేయాలని సంకల్పించారు. న్యాయమూర్తులు రాజీనామా చేసి రాజకీయపార్టీలో చేరడం గతంలోనూ లేకపోలేదు. కానీ, న్యాయమూర్తిగా నిన్నటివరకూ ఎంతో క్రియాశీలతను ప్రదర్శించిన ఓ వ్యక్తి మర్నాడే హఠాత్తుగా రాజకీయనాయకుడి అవతారం ఎత్తడం చాలామందిని విస్మయంలో పడవేసింది. రాజకీయాల్లోకి రావాలన్న కోరిక అంతబలంగా ఉన్నప్పుడు కొద్దికాలం ఓపికపట్టినా బాగుండేది. అసెంబ్లీ ఎన్నికల్లో మమతను దించేస్తానంటున్న ఆయనకు ఆ సహనం లేనట్టుంది. ఇంతకాలమూ ఆయన నిజంగానే న్యాయంపక్షాన నిలబడినా, ఆ తీర్పులకు ఇకపై ప్రజల్లో విలువ ఉంటుందా? ఒక న్యాయమూర్తిగా అధికారపక్ష నేతలమీద, రాష్ట్రంలో అవినీతిమీదా ఆయన చేసిన వ్యాఖ్యలకు ఇకపైనా అంతే ప్రాధాన్యం ఉంటుందా? ఈ చర్యతో ఆయన తన గతకాలపు గౌరవాన్ని, విశ్వసనీయతను కూడా ప్రశ్నించేందుకు వీలుకల్పించారు. ఆయన ఇచ్చిన అన్ని తీర్పులనూ పునఃస్సమీక్షించాలని అధికారపక్షం అందుకే ధైర్యంగా అడగగలుగుతోంది. న్యాయమూర్తుల నైతిక నియమావళిని ఉల్లంఘించారా లేదా అన్నది అటుంచితే, తృణమూల్ నాయకుడు అభిషేక్ బెనర్జీ సుప్రీంకోర్టులో చేసిన వాదనలకు ఇప్పుడు బలమైన పునాది ఏర్పడినట్టయింది. తనపై రాజకీయ దురుద్దేశాలతో వ్యాఖ్యలు చేసిన ఈ న్యాయమూర్తి మీద నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలన్న అభిషేక్ అభ్యర్థనను గతనెలలో తిప్పికొట్టిన సుప్రీంకోర్టుకు ఇప్పుడు ఏమి అనిపించివుంటుందో?

భారత ప్రజాస్వామ్య ఉత్సవం

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరికొద్ది రోజుల్లో 18వ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్నది. దేశవ్యాప్తంగా గౌరవనీయ ప్రధానమంత్రి పర్యటనలకు సౌకర్యంగా ఉండేలా నిర్ణయించారని గతంలో ఎన్నికల షెడ్యూల్‌ను విమర్శించడం జరిగింది. మరి 18వ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ హేతుబద్ధంగా ఉంటుందా, ఉండదా అనేది త్వరలోనే తెలుస్తుంది.

ఎన్నికల నిర్వహణలో చాలా లోపాలు ఉన్నాయి. మొదటిది– పోలింగ్ దశల సంఖ్య. ఎన్నికల నిర్వహణ మూడు కంటే ఎక్కువ దశలలో నిర్వహించకూడదు. ఒక రాష్ట్రంలోని సమస్త నియోజకవర్గాలలో పోలింగ్‌ను ఒకే రోజున నిర్వహించాలి. పెద్ద రాష్ట్రాలలో పోలింగ్‌ను రెండు రోజులలో పూర్తి చేయాలి. 2019లో పోలింగ్ తేదీలు ఏప్రిల్ 11 నుంచి మే 19 దాకా 39 రోజుల పాటు వ్యాపించి ఉన్నాయి. బిహార్ (40 సీట్లు), ఉత్తరప్రదేశ్ (80 సీట్లు), పశ్చిమ బెంగాల్ (42 సీట్లు) రాష్ట్రాలలో పోలింగ్‌ను 7 దశలలో నిర్వహించారు. ఇంచుమించు బిహార్, బెంగాల్‌లలో ఉన్నన్ని సీట్లు ఉన్నప్పటికీ తమిళనాడు, పుదుచ్చేరి (39+1)లో పోలింగ్‌ను ఒక రోజే నిర్వహించారు. కేవలం 29 నియోజకవర్గాలు ఉన్న మధ్యప్రదేశ్‌లో పోలింగ్‌ను నాలుగు విడతలుగా నిర్వహించారు. తమిళనాడులో కంటే ఉత్తరప్రదేశ్‌లో సీట్లు చాలా ఎక్కువగా ఉన్నాయి. మరి ఆ పెద్ద రాష్ట్రంలో పోలింగ్ 7 వేర్వేరు తేదీలలో జరిగింది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

పోలింగ్ నిర్వహణ ఇలా ఎందుకు ఉన్నది? భద్రతాపరమైన అంశాలను అధికారులు ఎత్తి చూపుతున్నారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించేందుకు తగు సమయం అవసరమని ఈసీఐ అధికారులు అంటున్నారు. అయితే ఇది సహేతుకమైన కారణంగా కనిపించడం లేదు. ఎన్నికల తేదీలను ప్రకటించిన తరువాత ఒక రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలోను పోలీసులు, సిఎపిఎఫ్‌ను మోహరిస్తారు. పోలింగ్ రోజున మొదటి దశ నియోజకవర్గాలలో పోలింగ్ జరుగుతుండగా ఇతర నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారం కొనసాగుతూ ఉంటుంది. శాంతి భద్రతల పరిరక్షణకు ఆ నియోజకవర్గాలలో పోలీసులు, సిఎపిఎఫ్ సిబ్బందిని మోహరిస్తారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ తర్వాతి రోజు పోలీసుల పహరా ఉండదు. అంతేకాకుండా బీజేపీ ప్రకారం బిహార్, ఉత్తరప్రదేశ్‌లలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వమున్నది; శాంతిభద్రతల పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. అయినప్పుడు ఆ రెండు రాష్ట్రాలలో హింసాకాండ, చోటుచేసుకోగలదనే భయమెందుకు? నాయకులు, పార్టీ కార్యకర్తలు, రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేందుకు వీలుగానే పోలింగ్‌ను పలు దశల్లో నిర్వహించడం జరుగుతుందనే అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది. అయినప్పటికీ బహుళ దశ పోలింగ్ వల్ల పలు ప్రతికూల పర్యవసానాలు ఉన్నాయి. పోలింగ్ తేదీలు భిన్నంగా ఉంటే 'నిశ్శబ్ద సమయాలు' సైతం భిన్నంగా ఉంటాయి. నియోజకవర్గం–ఎలో నిశ్శబ్ద దినాలు, పోలింగ్ రోజున నాయకులు పొరుగు నియోజకవర్గం–బిలో ప్రచారంలో పాల్గొంటాడు. ఆ నేత ప్రసంగాల సందేశం టీవీ, రేడియో, వార్తాపత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా నియోజకవర్గం–ఎ ఓటర్లకు చేరుతుంది. మరో ముఖ్య విషయం బహుళ– దశ పోలింగ్‌లో పోలింగ్ అనంతరం సంభావ్య ఫలితాలపై అంచనాలు రెండో దశ, తదనంతర దశల పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలలో ఓటింగ్ తీరుతెన్నులను ప్రభావితం చేసే అవకాశమున్నది.



పోరాట స్ఫూర్తితో కూడిన, నానా సందడితో ఉల్లాసకరమైన, ఉత్సాహపూరితమైన ఎన్నికల వాతావరణాన్ని పునరుద్ధరించేందుకు ఈసీఐ వివిధ చర్యల ద్వారా ప్రయత్నించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఒక పండుగ జరుపుకోవాల్సిన అవసరమున్నది. ఎన్నికలు కాక ఆ పండుగ మరేమవుతుంది?

రాష్ట్రాలలో ఈసీఐకి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్య ఎన్నికల అధికారులు (సీఈఓ) ఎన్నికల నియమ నిబంధనలను అమలుపరచడంలో నిష్పాక్షికంగా వ్యవహరించడంలేదు. రాష్ట్ర స్థాయి ఎన్నికల అధికారులు చూపుతున్న వివక్షపై ఈసీఐ దృష్టి పెట్టవలసిన అవసరమున్నది. ఉదాహరణకు 2019 సార్వత్రిక ఎన్నికలలో తమిళనాడులోని పంచాయత్‌లు, మునిసిపాలిటీలలో పోస్టర్లు, ఫ్లెక్స్ బోర్డ్‌లు, బ్యానర్లు, జెండాలను ప్రదర్శించడాన్ని సీఈఓ నిషేధించారు. ప్రతి అభ్యర్థి కేవలం ఒకే ఒక్కసారి మాత్రమే రోడ్ షోలు నిర్వహించేందుకు మాత్రమే అనుమతించారు. ప్రచారకర్తలు ఏ ప్రదేశాలలో ఓటర్లనుద్దేశించి ప్రసంగించాలో కూడా నిర్ణయించారు. అభ్యర్థి వెంట మూడు వాహనాలు మాత్రమే ఉండాలని నిర్దేశించారు. ఒక బహిరంగ సభ లేదా ర్యాలీని నిర్వహించనున్నప్పుడు ఆ సభ లేదా ర్యాలీకి ముందు రోజు, తరువాత రోజు మాత్రమే స్థానిక ప్రాంతంలో జెండాల ప్రదర్శనను సీఈఓ అనుమతించారు. ఈ ఆంక్షలను కఠినంగా అమలుపరిచారు. ఇతర రాష్ట్రాల పట్టణాలు, నగరాలలో ఎన్నికల కోలాహలం ఉధృతంగా ఉండగా ఇక్కడ ఈ ఆంక్షలు ఏమిటని తమిళనాడు ప్రజలు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ వివక్షకు స్వస్తి చెప్పాలిసిన అవసరమున్నది. దేశవ్యాప్తంగా ఒకే విధమైన నియమనిబంధనలు అమలయ్యేలా భారత ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలి.

బహిరంగ ప్రచార కార్యక్రమాలపై విధిస్తున్న ఈ అనుచిత ఆంక్షల వల్ల ఎన్నికల మౌలిక స్వభావానికి తీవ్ర విఘాతం వాటిల్లుతోంది. ఎన్నికలు ప్రజాస్వామ్య ఉత్సవాలు కావా? ఈ పండుగలను జరుపుకోవడంలో ప్రజలపై కఠిన ఆంక్షలు విధించడమంటే ప్రజాస్వామ్య స్ఫూర్తిని హరించివేయడం మినహా మరేమీ కాదు. గత సార్వత్రిక ఎన్నికలలో తమిళనాడులో ప్రచార పర్వంలో అధిక భాగం అంత్యక్రియల వాతావరణం నెలకొని వుందనడంలో అతిశయోక్తి లేదు. ఆ ఆంక్షలు ఎన్నికలను నైరాశ్యంలో ముంచెత్తాయి. పార్టీ కార్యకర్తలు మౌనంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసుకోవడం జరిగింది.

ఎన్నికలలో అత్యంత ముఖ్యమైన విషయాన్ని చివరగా ప్రస్తావించదలుచుకున్నాను. డబ్బు, ఎన్నికలలో అది నిర్వహించే పాత్రే ఆ అంశమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అప్రతిష్ఠాకర ఎన్నికల బాండ్ల పుణ్యమా అని భారతీయ జనతా పార్టీకి ఎన్నికలకు అవసరమైన నిధులను అపారంగా సమకూర్చుకున్నది. ఈ లోక్‌సభ ఎన్నికలలో ఆ ధనరాశులను ఆ పార్టీ తప్పక వినియోగించుకుంటుంది. గౌరవనీయ ప్రధానమంత్రి ప్రసంగించే ఒక ర్యాలీ నిర్వహణకు కోట్ల రూపాయల వ్యయమవుతుంది. సభా వేదికపై ప్రధానమంత్రితో పాటు అభ్యర్థులు ఉంటారు. అయితే ఆ ర్యాలీ నిర్వహణా వ్యయాన్ని ప్రతి అభ్యర్థీ ఏదో ఒక మేరకు భరిస్తున్నట్టుగా ఎన్నికల సంఘం పరిగణించడం లేదు. ఇది సరైన వైఖరి అని నేను భావిస్తున్నాను. అయితే తమిళనాడులో గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సభా వేదికపై ప్రధాన నాయకుడితో పాటు అభ్యర్థులు ఆ సభా నిర్వహణ వ్యయంలో సమానస్థాయిలో గానీ లేదా ఏదో ఒక స్థాయిలో గానీ భరించినట్టుగా ఎన్నికల సంఘం పరిగణించింది. ఆ వ్యయాన్ని ఆ అభ్యర్థి మొత్తం ఎన్నికల వ్యయంలో భాగంగా లెక్క కట్టింది. ఇదొక విధమైన వివక్ష. ఈసీఐ ఈ వివక్షకు స్వస్తి చెప్పాలి.

ఎన్నికల ప్రచారాలు సందడి లేకుండా, అజ్ఞాతంగా జరగడం వల్లే అసహ్యకరమైన ఓటుకు నోటు ఉదంతాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పవచ్చు. అయితే ఓటర్లు తాము ఎవరికైతే ఓటు వేయదలుచుకున్నారో వారికే ఓటు వేస్తున్నారు. అయితే పార్టీలు, అభ్యర్థులు ఓట్ల కోసం నోట్లను పంపిణీ చేస్తుండడం వల్ల ఎన్నికల వ్యయం విపరీతంగా పెరిగిపోతోంది. అభ్యర్థులు, వారి పార్టీలు బహిరంగంగా మరింత ధనాన్ని ఖర్చు పెట్టేందుకు అనుమతించాలి. ఎన్నికల ప్రచారం బహిరంగంగా, సందడితో జరిగే పక్షంలో ఓటుకు నోటు అవినీతి కాలక్రమేణా సంపూర్ణంగా సమసిపోగలదు. పోరాట స్ఫూర్తితో కూడిన, నానా సందడితో ఉల్లాసకరమైన, ఉత్సాహపూరితమైన ఎన్నికల వాతావరణాన్ని పునరుద్ధరించేందుకు ఈసీఐ వివిధ చర్యల ద్వారా ప్రయత్నించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఒక పండుగ జరుపుకోవాల్సిన అవసరమున్నది. ఎన్నికలు కాక ఆ పండుగ మరేమవుతుంది?

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)


కుబేర కల్యాణానికి కాదేదీ అనర్హం!

ఈ నెల 1న 'ది హిందూ' ఆన్‌లైన్ ఎడిషన్‌లో విలేఖరి జాగృతి చంద్ర రాసిన వార్త ఒకటి ఉంది. దాని శీర్షిక: 'అనంత్ అంబానీ ప్రీ వెడ్డింగ్ వేడుకల సందర్భంగా జామ్‌నగర్ విమానాశ్రయానికి తాత్కాలికంగా అంతర్జాతీయ హోదా'. జామ్‌నగర్‌లో సైనిక దళాలు నిర్వహిస్తున్న ఆ చిన్న విమానాశ్రయాన్ని ఫిబ్రవరి 25, 2022 నుంచి మార్చి 5 దాకా పది రోజుల పాటు 'అంతర్జాతీయ విమానాశ్రయం'గా ప్రకటించడం ఎలా జరిగిందో ఆ వార్త విపులీకరించింది. బిల్‌గేట్స్, మార్క్ జుకెర్‌బర్గ్, ఇవాంకా ట్రంప్, ఇంకా పలువురు మాజీ ప్రధానమంత్రులు మొదలైన ప్రముఖులు ముకేశ్ అంబానీ, నీతా అంబానీల కనిష్ఠ పుత్రుడు అనంత్ వివాహ ముందస్తు వేడుకలకు హాజరయ్యారు. అంబానీ కుటుంబం వారికి స్వాగతం చెప్పేందుకు వీలుగా జామ్‌నగర్ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించారని ఆ వార్త పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, ఆర్థిక, హోం మంత్రిత్వ శాఖలు తమ ఆధ్వర్యంలోని వనరులను వినియోగించి ఆ ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్, ఇమ్మిగ్రేషన్, క్వారంటైన్ (సిఐక్యూ) సదుపాయాన్ని కల్పించాయి (ది హిందూ.కామ్).

ఈ వార్తను చదివిన తరువాత దానిపై సామాజిక మాధ్యమాలలో వ్యాఖ్యలను కూడా చూశాను. అంబానీలకు సానుకూలంగా తన విచక్షణాధికారాలను వినియోగించిన పాలకుల మద్దతుదారులు ప్రభుత్వ చర్యను పూర్తిగా సమర్థించారు. 2011లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పాకిస్థానీ సందర్శకుల సౌకర్యార్థం చండీగఢ్ విమానాశ్రయానికి తాత్కాలికంగా అంతర్జాతీయ హోదా కల్పించలేదా అని ప్రశ్నించారు (చండీగఢ్‌లో ప్రపంచ కప్ క్రికెట్ టోర్నమెంట్ సెమీ ఫైనల్ మ్యాచ్ జరుగుతున్న సందర్భమది, ఒక ప్రైవేట్ వివాహ వేడుక కాదు). అంబానీలు లక్షలాది భారతీయులకు జీవనాధారాలను కల్పించారు గనక వారి కుటుంబ వేడుకకు విచ్చేస్తున్న వీఐపీలకు సముచిత గౌరవం, భద్రత కల్పించాల్సిన అవసరముందని కూడా ఈ సమర్థకులు వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ చర్యను విమర్శించిన వారిలో ఒకరు ఇలా వ్యాఖ్యానించారు: 'అంబానీలు, అదానీలకు భారత్‌లో జీవితం స్వర్గతుల్యంగా ఉన్నది. అయితే నా జోటి మిగతా వారందరికీ మాత్రం అది నరకప్రాయమే'. మరో విమర్శకుడు ఇలా పేర్కొన్నాడు: 'మహా కుబేరులతో మన దేశం ఇప్పుడు ఒక కొత్త రష్యాలా ఉన్నది'. మరొక విమర్శకుడు సరదాగా ఇలా వ్యాఖ్యానించారు: 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అన్న మహా సూక్తిని ఇలా తిరిగిరాయవలసి ఉంది: 'నేను, నా సంపన్న స్నేహితులు, వారి మిత్రులు అంతా ఒకే కుటుంబం'. ఈ వ్యాఖ్యలో నిజం ఎంతో ఉన్నది మరి.

ముకేశ్ అంబానీ కుమారుడి ప్రీ వెడ్డింగ్ వేడుకలపై సామాజిక మాధ్యమాలలో ఒక వ్యాఖ్యను నిశితంగా పరిశీలిద్దాం. అదిలా పేర్కొంది: సకల దేశాల నుంచి ప్రముఖులను ఆహ్వానించడం ద్వారా అపార సంపద్వంతుడైన యువకుడు తన ప్రైవేట్ జూను ప్రపంచానికి చూపదలుచుకున్నాడు. అతడి లక్ష్యానికి తోడ్పడేందుకే జామ్‌నగర్ విమానాశ్రయ హోదాను పెంచారు'. జామ్‌నగర్‌లో, ఒక ఏనుగు ముందు నవ్వులు చిందిస్తూ ఉన్న ఇవాంకా ట్రంప్ ఛాయా చిత్రాలు ఆ వ్యాఖ్యకు విశ్వసనీయతను కల్పించాయి. ప్రస్తావిత ప్రైవేట్ జూను 'రాధా కృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్' నిర్వహిస్తోంది. పేరు చూస్తే అదొక మతాభినివేశ ధార్మిక సంస్థ అనిపిస్తుంది. అయితే ఆ పేరు ఒక మేలి ముసుగు మాత్రమే. సైనిక దళాలు నిర్వహించే ఒక విమానాశ్రయానికి 'అంతర్జాతీయ హోదా' కల్పించడానికి మించిన లజ్జాకర విషయాన్ని ఆ ట్రస్ట్ నామధేయం కప్పిపుచ్చుతోంది. వన్యప్రాణుల సంరక్షణ చట్టం–2021కి చేసిన ఒక సవరణ ఆ ట్రస్ట్ ఏర్పాటుకు, దాని కార్యకలాపాలకు వెసులుబాటు కల్పించింది. ప్రైవేట్ జూల నేర్పాటు చేసేందుకు ఏనుగు లాంటి మనుగడ ముప్పులో ఉన్న వన్య ప్రాణులను పట్టుకుని ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు, విక్రయించేందుకు ఆ చట్ట సవరణ అనుమతిస్తోంది. సవరణకు పూర్వం ఉన్న చట్టం వన్య ప్రాణుల సంబంధిత వ్యాపార లావాదేవీలు నిర్వహించడంపై ఆంక్షలు విధించింది. అయితే సవరణ అనంతరం పట్టుకున్న సజీవ వన్య ప్రాణులకు ఆ ఆంక్షల నుంచి మినహాయించింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఏనుగును ఒక వ్యాపార సరుకుగా పరిగణించేందుకు చట్ట సవరణ అనుమతించింది. ఈ సవరణ ఒక అసంగత విషయం. దీనిని పార్లమెంటే సరిదిద్దాల్సి వుంది.



srini

> అంబానీలు, అదానీలతో మోదీ సర్కార్ సాన్నిహిత్యాన్ని ప్రతిపక్ష రాజకీయవేత్తలు తరచు విమర్శిస్తుంటారు. జామ్‌నగర్ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా, వన్యప్రాణుల సంరక్షణ చట్టానికి సవరణ విషయాన్ని వారు ఉపేక్షిస్తున్నారు. అంబానీలు తమ వ్యాపార ప్రయోజనాలకు అనుగుణంగా రాజ్యవ్యవస్థ వ్యవహరించేలా ప్రభుత్వాధినేతలను ప్రభావితం చేయగలుగుతున్నారని ఆ రెండు విషయాలు స్పష్టం చేశాయి. వ్యాపార విషయాలలోను, కుటుంబ వ్యవహారాలలోను అదానీలు, అంబానీలు 'మోదీ సర్కార్‌కి గ్యారంటీ'ని సంపూర్ణంగా పొందుతున్నారు.

అధికారంలో ఉన్నవారు తమ రాజకీయ ప్రయోజనాలకు తోడ్పడుతున్న సంపన్నులను సంతోషపెట్టేందుకే ఆ అసంగత సవరణను రద్దు చేయలేదు. దీని పర్యవసానాలు ఏమిటో ఇప్పుడు మనం చూస్తున్నాం. జూన్ 2022లో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌'లో వెలువడిన ఒక వార్త ప్రకారం దొంగ సర్టిఫికెట్లతో వన్యప్రాణులను అక్రమంగా రవాణా చేస్తున్నట్టు ఎనిమిది కేసులు ఒక్కనెలలోనే రికార్డయ్యాయి. ఏనుగులను అరుణాల్‌ప్రదేశ్ అడవుల నుంచి జామ్‌నగర్‌లోని అంబానీ ప్రైవేట్ జూకు తరలిస్తున్నారని కూడా ఆ వార్త పేర్కొంది.

ఆ ఎనిమిది కేసులు ఒక ఆరంభం మాత్రమే. 'రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్'వారు కాపాడి, ఆశ్రయం కల్పించిన ఏనుగులు ఇప్పుడు 200కి పైగా ఉన్నాయని గత నెలలో అనంత్ అంబానీ గొప్పగా చెప్పుకున్నారు. ఈ ఏనుగులలో అత్యధికం ఈశాన్య రాష్ట్రాల నుంచి జామ్‌నగర్‌కు రవాణా చేయడం జరిగిందని 'నార్త్ ఈస్ట్ నౌ' అనే వెబ్‌సైట్ పేర్కొంది. ఆ ఏనుగులను చట్ట విరుద్ధంగా పట్టుకుని, తరువాత దళారుల తోడ్పాటులో కొనుగోలు చేయడం జరిగింది.

'నార్త్ ఈస్ట్ నౌ'లో వెలువడిన మరొక వార్త జంతు హక్కుల పరిరక్షణ సంఘం రాసిన ఒక లేఖను ఉటంకించింది. 'గున్న ఏనుగులను వాటి సహజ నైసర్గిక పరిసరాల నుంచి 3400 కిలోమీటర్ల దూరంలో ఉన్న జామ్‌నగర్‌కు ట్రక్కులలో రవాణా చేయడం పట్ల ఆ జంతు హక్కుల ఉద్యమకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ సహజావాసాల నుంచి బలవంతంగా దూరం కాబడిన వన్య ప్రాణులకు పునరావాసం కల్పించే చర్యలను తాను స్వాగతిస్తున్నానని, అయితే ఈశాన్య రాష్ట్రాల నుంచి అంబానీ ప్రైవేట్ జూకు వందలాది ఏనుగులను తరలించే కార్యకలాపాలు జంతువుల అక్రమ రవాణా సంఘాలు మళ్లీ క్రియాశీలమయ్యేందుకు ప్రేరణ అవుతున్నాయని నా మిత్రుడైన ఒక జంతు హక్కుల కార్యకర్త అన్నాడు.

ఒకప్పుడు అడవులలో పట్టుకున్న ఏనుగులను దేవాలయాలకు అప్పగించేవారు. ఇప్పుడు వాటిని జామ్‌నగర్‌లోని ప్రైవేట్ జూకు తరలిస్తున్నారు. అంబానీ జూను ఒక వ్యక్తిగత 'తపాలా బిళ్లల సేకరణ' లాంటిదేనని ప్రముఖ పర్యావరణవేత్త రవి చెల్లం వ్యాఖ్యానించారు. వన్య ప్రాణుల సంరక్షణకు అంబానీల హాబీ ఏ విధంగాను తోడ్పడదని ఆయన నిష్కర్షగా అన్నారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

వన్యప్రాణి శాస్త్రవేత్తలు, సంరక్షణవాదులు మూడు ప్రశ్నలను లేవనెత్తుతున్నారు వీటికి అంబానీలకు సహకరిస్తున్న ప్రభుత్వ నాయకులు, అధికారులు, ప్రభుత్వేతర వ్యక్తులు ఆ ప్రశ్నలకు సమాధానమిచ్చి తీరాలి. అవి : (1) అడవులలో తిరుగాడేందుకు ఇష్టపడే ఏనుగులను వందల సంఖ్యలో వాటి సహజావాసానికి విరుద్ధమైన పారిశ్రామిక ప్రాంతానికి తరలించడమెందుకు? (2) ఇందుకు వెసులుబాటు కల్పించేందుకు సమాంతర క్రమబద్ధీకరణ వ్యవస్థను ఎందుకు సృష్టించారు? (3) సహజపరిసరాలలోనే అటువంటి సంరక్షణ సదుపాయలను సృష్టించేందుకై రాష్ట్ర అటవీ శాఖ అధికారులతో కలిసి ఎందుకు కృషి చేయకూడదు? ఇవి చాలా ముఖ్యమైన ప్రశ్నలు. అయితే అంబానీలు కానీ, వారి సన్నిహిత రాజకీయ నాయకులు కానీ సమాధానమివ్వడానికి శ్రద్ధ చూపుతారని నేను భావించడం లేదు.

నా చిన్నతనంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 'టాటా/బిర్లా సర్కార్' అని వామపక్షాలు పరిహసించేవి. అయితే తమ పలుకుబడి, ప్రాభవం సమున్నతంగా ఉన్న కాలంలో కూడా జేఆర్‌డి టాటా గానీ, ఘన్ శ్యామదాస్ బిర్లా గానీ స్వీయ కుటుంబ సభ్యుల వివాహ వేడుకలకు గానీ, ప్రీ వెడ్డింగ్ వేడుకలకు గానీ తమ ఫ్యాక్టరీలకు సమీపంలో ఉన్న విమానాశ్రయాలకు అంతర్జాతీయ హోదా కల్పించాలని జవహర్‌లాల్ నెహ్రూనుగానీ, ఇందిరాగాంధీనిగానీ ఎన్నడూ కోరలేదు.

అయితే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ వాదించినట్టు పారిశ్రామికవేత్తలు అందరికీ సమానావకాశాలు కల్పించడానికి బదులు భారత రాజ్యవ్యవస్థ ఇటీవలి సంవత్సరాల్లో '2 ఎ తరహా' 'కళంకిత పెట్టుబడిదారీ విధానాన్ని' ప్రమోట్ చేసింది. అదానీలు, అంబానీలు ప్రభుత్వ విధానాల కారణంగానే స్వల్ప కాలంలోనే లక్షల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను సమకూర్చుకోగలిగారు. నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, ఇంధన రంగం, పెట్రో కెమికల్స్, టెలి కమ్యూనికేషన్స్ తదితర రంగాలలో గుత్తాధిపత్యం సాధించుకోవడాకి ఆ రెండు పారిశ్రామిక సంస్థలకు ప్రభుత్వ విధానాలు విశేషంగా తోడ్పాటునిచ్చాయనడంలో సందేహం లేదు. అంబానీలు, అదానీలతో మోదీ సర్కార్ సాన్నిహిత్యాన్ని ప్రతిపక్ష రాజకీయవేత్తలు తరచు విమర్శిస్తుంటారు. అయితే జామ్‌నగర్ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా, వన్యప్రాణుల సంరక్షణ చట్టానికి సవరణ విషయాన్ని వారు ఉపేక్షిస్తున్నారు. అంబానీలు తమ వ్యాపార ప్రయోజనాలకు అనుగుణంగా రాజ్యవ్యవస్థ వ్యవహరించేలా ప్రభుత్వాధినేతలను ప్రభావితం చేయగలుగుతున్నారని ఆ రెండు విషయాలు స్పష్టం చేశాయి. ఇప్పుడు బాగా ప్రచారంలో ఉన్న ఒక నుడికారం ప్రకారం వ్యాపార విషయాలలోను, కుటుంబ వ్యవహారాలలోను అదానీలు, అంబానీలు 'మోదీ సర్కార్‌కి గ్యారంటీ'ని సంపూర్ణంగా పొందుతున్నారు సుమా!

(వ్యాసకర్త చరిత్రకారుడు)

యాభై గ్రీష్మాల పౌర హక్కుల సంఘం

ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘానికి, ప్రస్తుత పౌర హక్కుల సంఘానికి ఇప్పుడు యాభై సంవత్సరాలు నిండుతున్నాయి. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ పౌర హక్కుల సంఘం ఆవిర్భావం అనే పరిణామం 1960వ దశకం చివరి కాలంలోనూ, 1970లలోనూ ముందుకొచ్చిన వివిధ ఉద్యమాలతో, ప్రత్యేకించి రైతాంగ ఉద్యమాలు, ఆదివాసీ ఉద్యమాలతో సన్నిహితంగా ముడిపడి వున్న పరిణామం. ఆ ఉద్యమాలపై కొనసాగిన రాజ్యహింసతో ముడిపడిన పరిణామం. 1975 జూన్‌లో దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ పాలనని ప్రకటించిన తర్వాత సంఘం ముఖ్యులు అనేకమంది నిర్బంధానికి గురయ్యారు. ఎమర్జెన్సీ పాలన ముగిశాక, పౌర హక్కుల సంఘాన్ని పునరుద్ధరించే ప్రయత్నాలు మొదలయ్యాయి. 1979లో వరంగల్ నగరంలో రాష్ట్ర మహాసభలని నిర్వహించడంతో ఈ ప్రయత్నాలు నిర్మాణ రూపం తీసుకున్నాయి. ఈ మహాసభలలో కన్నబిరాన్‌ని అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. కన్నబిరాన్ అధ్యక్షునిగా ఎన్నికవడం, సంస్థ చరిత్రలో కీలక పరిణామమని నేను అనుకుంటాను. వరంగల్ మహాసభలకు ముందు, ఎమర్జెన్సీ ఎత్తివేసిన వెనువెంటనే పౌర హక్కుల సమస్యలపైన పెద్ద ఎత్తున కదలిక ముందుకొచ్చింది. రాజకీయ ఖైదీల విడుదల చేయాలి, ఎమర్జెన్సీలో కొనసాగిన అక్రమ నిర్బంధాలు, చిత్రహింసలపై విచారణ జరిపించాలనే డిమాండ్లతో ఆందోళనలు సాగాయి. ఆంధ్రప్రదేశ్‌లో మార్క్సిస్టు– లెనినిస్టు పార్టీల కార్యకర్తలని బూటకపు ఎదురు కాల్పుల పేరిట కాల్చి చంపడంపై న్యాయ విచారణ డిమాండ్ కీలకంగా ముందుకొచ్చింది. కార్యకర్తలని చట్టవ్యతిరేకంగా హతమార్చిన ఘటనలపై తార్కుండే కమిటీ ఒక నివేదికను ప్రచురించింది. ఎమర్జెన్సీ పాలన కాలంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్ హత్యలపై ఓపీడీఆర్ సంస్థ ఒక వివరమైన నివేదికను ప్రచురించింది. రాష్ట్రంలో కొనసాగిన చట్టవ్యతిరేక ప్రభుత్వ హత్యలపై విచారణకు భార్గవ కమిషన్ ఏర్పాటైంది. ఆ కమిషన్ విచారణ మధ్యలోనే నిలిచిపోయింది. 1979లో జరిగిన ఏపీసీఎల్‌సీ రెండవ మహాసభలకు ఈ సంఘటనలు ఒక ముఖ్యమైన పూర్వరంగంగా ఉన్నాయి. మెరుగైన జీవితం కోసం 'ప్రజలు పోరాడే హక్కును' గుర్తించడం ఆ మహాసభలలో ఆమోదించిన ప్రణాళికలో ఒక ముఖ్య అంశం. ఆ హక్కును ప్రభుత్వం లేదా సంపన్న వర్గాలు కాలరాస్తున్నప్పుడు పౌర హక్కుల సంఘం పాత్ర ప్రాధాన్యతని సంతరించుకుంటుంది. పోరాడే హక్కును పౌరహక్కుల సంఘం బలపరుస్తుంది, దానిని ప్రచారం చేస్తుంది.

ఎమర్జెన్సీ అనంతర కాలం, ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ఉద్యమాలు ముందుకు వచ్చిన కాలం. ప్రత్యేకించి తెలంగాణలో రైతాంగ ఉద్యమం పెల్లుబికిన కాలం. ఈ రైతాంగ ఉద్యమం ప్రభుత్వ నిర్బంధానికి లక్ష్యంగా మారింది. 1980ల నాటికి సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాలను, ఇంకా వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలలో అనేక ప్రాంతాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించారు. దానితో వివిధ రూపాలలో ప్రజలపై తీవ్ర నిర్బంధం అమలు జరిగింది. అరెస్టులు, అక్రమ నిర్బంధాలు, చిత్రహింసలు నిత్య కృత్యాలుగా మారాయి. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం వీటిపై ఆందోళనలు చేపట్టింది. మార్చి 1977 తర్వాత ఒక మూడు సంవత్సరాల స్వల్ప కాలం పాటు బూటకపు ఎదురు కాల్పుల హత్యలకి విరామం పాటించినా, 1980ల మధ్య కాలం నుండి ఈ హత్యలు మళ్లీ ఊపందుకున్నాయి. బొజ్జా తారకం, 'పోలీసులు అరెస్టు చేస్తే' అనే చిన్న కరపత్రం రాయడానికి నేపథ్యం ఇదే. ఆ తర్వాత ఇదే పేరుతో తారకం ఒక పుస్తకాన్ని రాశారు. ఆ పుస్తకానికి విస్తృతమైన ఆదరణ లభించింది. బెల్చీ, పిప్రా, పరస్‌బిగా, భాగల్పూర్ ఘటనలపైన తారకం రాసిన కరపత్రాలు విస్తృతంగా ప్రచారమయ్యాయి. 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో ఆదివాసులపైన జరిగిన దారుణ హత్యాకాండ అత్యంత హేయమైన ప్రభుత్వ చర్యలలో ఒకటి. దీనిపై ఏపీసీఎల్‌సీ విస్తృత ప్రచారాన్ని నిర్వహించింది. ఎమర్జెన్సీ అనంతర కాలంలో తిరిగి మొదలైన ఎన్‌కౌంటర్ హత్యలు మరింత బాహాటమైన హత్యలుగా మారిపోయి, విస్తృతమయ్యాయి. ఎమర్జెన్సీ రోజులలో మాదిరిగా అవి అడవులలో జరగలేదు. అవి పల్లెలకీ, పట్టణాలకీ విస్తరించాయి. హైదరాబాద్ నగరంలో కూడా ఆ హత్యలు జరగడం మొదలైంది. మధుసూదన్ రాజ్ హత్య దానికొక ఉదాహరణ. రవీందర్ రెడ్డి, పర్వయ్య అనే ఇద్దరు కార్యకర్తలను మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చిన తర్వాత, దారుణంగా కాల్చి చంపిన సంఘటన నాకు గుర్తుకొస్తున్నది. వాళ్ళు పోలీసుల చేతిలో ఆయుధాలని గుంజుకోబోయారనీ, పోలీసులు ఆత్మరక్షణార్థం వాళ్ళని కాల్చి చంపాల్సి వచ్చిందనీ కట్టుకథని అల్లారు. ఈ సంఘటనపై కన్నబిరాన్, బాలగోపాల్, నేను సభ్యులుగా ఒక నిజ నిర్ధారణ కమిటీని పౌర హక్కుల సంఘం ఏర్పాటు చేసింది. ఆ నిజ నిర్ధారణ కమిటీ నివేదికని తయారు చేసే బాధ్యతను బాలగోపాల్ స్వీకరించారు. ఆ నివేదికని తాను ఖచ్చితంగా, సమగ్రంగా రూపొందించారు. దీనితో, ఆ తర్వాత కాలంలో రిపోర్టులని రాసే బాధ్యత ఎక్కువగా తనపైనే పడింది. హక్కుల ఉద్యమ విస్తృతిలో బాలగోపాల్ కృషి గురించి ఎంత చెప్పినా అది తక్కువే అవుతుంది.



> వివిధ రూపాలలో ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసే దాడులు ముమ్మరమౌతున్న రాజకీయ నేపథ్యంలో పౌర హక్కుల సంఘం తన 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నది. హిందుత్వ మతవాద శక్తులు మెజారిటేరియన్ ఫాసిస్టు పాలనని నెలకొల్పడానికి పూనుకుంటున్న సమయంలో సీఎల్‌సీ లాంటి పౌర హక్కుల సంఘాలు కీలకమైన పాత్రని నిర్వహించాల్సి ఉంటుంది. ప్రజల ప్రాథమిక హక్కులని దృఢంగా బలపరిచి, వాటిని విస్తృతంగా ప్రచారం చేయాలి.

గ్రామీణ పేదలపైన, ఆదివాసుల పైన రాజ్యహింస పెరిగిపోతూవున్న నేపథ్యంలో, రాజ్యమే ప్రధానంగా హక్కులని ఉల్లంఘిస్తున్న విషయాన్ని వెలుగులోకి తేవడమే పౌర హక్కుల సంఘం కృషిలో ప్రధానమైంది. ఇతరేతర శక్తులు, వ్యక్తుల ఆధ్వర్యంలో ఉల్లంఘనలని, హక్కులని హరిస్తున్న సంఘటనలని అది పట్టించుకోలేదని దీనర్థం కాదు. అయితే, ఒక సమగ్రమైన అవగాహన, దృక్పథం మాత్రం తర్వాత కాలంలో చర్చలు, ఆచరణలోనే రూపొందింది. కారంచేడు సంఘటనని ఒక మలుపుగా చెప్పుకోవచ్చు. ఎనభైలలో కుల అణచివేతకు వ్యతిరేకంగా, పితృస్వామ్య ఆధిపత్యానికి వ్యతిరేకంగా ముందుకు వచ్చిన సామాజిక ఉద్యమాల ప్రశ్నలు, రాజ్య హింస, ఇతర రూపాలలో ప్రయివేటు హింస, ఆధిపత్య రూపాలని గుర్తించడం, పర్యవసానంగా సంస్థలో జరిగిన చర్చలు, ఈ నేపథ్యంలోనే హక్కుల ఉద్యమాల పాత్ర, పరిధి గురించిన అవగాహన విస్తృతమైంది.

వివిధ రూపాలలో ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసే దాడులు ముమ్మరమౌతున్న రాజకీయ నేపథ్యంలో పౌర హక్కుల సంఘం తన యాభైయవ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నది. హిందుత్వ మతవాద శక్తులు మెజారిటేరియన్ ఫాసిస్టు పాలనని నెలకొల్పడానికి పూనుకుంటున్న సమయంలో సీఎల్‌సీ లాంటి పౌర హక్కుల సంఘాలు కీలకమైన పాత్రని నిర్వహించాల్సి ఉంటుంది. ప్రజల ప్రాథమిక హక్కులని దృఢంగా బలపరిచి, వాటిని విస్తృతంగా ప్రచారం చేయాలి. అదే సమయంలో మనం సాధించిన అనుభవాలని అవలోకించుకొని, హక్కుల ఉద్యమాన్ని అభివృద్ధి చేసే విధంగా సమీక్షించుకోవాలి. పాఠాలను నేర్చుకోవాలి.

• బి.ప్రదీప్, ఐఎఫ్‌టియు

(1979–83 మధ్య ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి)

వేయిస్తంభాల ఆలయానికి కొత్త శోభ


కాకతీయుల నిర్మాణాల్లో అత్యంత ప్రముఖమైనది హన్మకొండలోని వేయి స్తంభాల ఆలయం. కళ్యాణ మంటపం, ప్రధానాలయాన్ని కలిపి మొత్తం వేయి స్తంభాలతో నిర్మించిన కారణంగా ఈ ఆలయం ఆ పేరిట ప్రసిద్ధిచెందింది. శిధిల స్థితిలో ఉన్న కళ్యాణ మండపం పునర్నిర్మాణ పనులు 2005 జూలై 13న ప్రారంభమయ్యాయి. 18 నెలల్లో దీనిని పూర్తి చేయాలని అప్పుడు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, దాదాపు రెండు దశాబ్దాలపాటు ఆ పనులు కొనసాగి, ఎట్టకేలకు పునర్నిర్మాణం పూర్తయి, శుక్రవారం ప్రారంభోత్సవంతో మళ్లీ పర్యాటకులకు అందుబాటులోకి వచ్చింది.

కళ్యాణ మండపం పునర్నిర్మాణానికి అప్పటి కేంద్రప్రభుత్వం భారతీయ పురాతత్వ సంస్థ (ఏఎస్ఐ)కి రూ.3.80 కోట్లు మంజూరు చేసింది. పనులు మొదలై, శిలలను తొలగించినప్పుడు పునాది మొత్తం నీటితో ఉండి, ఇసుకపైనే ఈ భారీ శిలను నిలిపినట్టు ప్రత్యక్షంగా తెలుసుకోగలిగారు.



పాత కళ్యాణ మంటపం శిలలను ఒక్కొక్కటిగా తొలగించి, ఒక్కో శిలకు ఒక్కొక్క నెంబర్ ఇచ్చారు. 163 రాతి పిల్లర్లు (దూలాలు) ఉండగా వీటిలో నాలుగు అతి పెద్దవి. 8 మీటర్ల వెడల్పు ఉన్న ఈ పిల్లర్లు ధ్వంసం కావడంతో అమ్మవారిపేట సమీపంలోని క్వారీ వద్ద ఆ భారీ శూలాలను రూపొందించారు. తర్వాత రెండున్నరేళ్ల పాటు పనులు సాగలేదు. తిరిగి 2010లో మళ్లీ పనులు మొదలయ్యాయి, 2011లో నిర్మాణ వ్యయం అంచనాను రూ. 7.50 కోట్లకు పెంచారు. తమిళనాడుకు చెందిన స్థపతి శివకుమార్ ఆధ్వర్యంలో 50 మంది బృందం ఈ పనుల్లో పాల్గొన్నారు. మీటరు మందంతో దంగు సున్నం, గ్రాన్యువల్ ఫైల్స్‌తో కూడిన లేయర్‌ను నిర్మించారు. దీనిపై ఏడు వరుసలు రాతి నిర్మాణంతో ప్రదక్షిణ పథం నిర్మించారు. అనంతరం నాలుగు వరసలు ఉండే కక్షాసనం నిర్మించారు. ఆపై రాతిగోడ నిర్మాణం పూర్తి చేశారు. నిర్మాణంలో ఉన్న శిలలను పట్టి ఉంచేలా ముఖ్యమైన శిలలకు స్టెయిన్‌లెస్ స్టీల్ పట్టీలను అమర్చారు. గతంలో కాకతీయులు కరిగించిన ఇనుమును పోసిన పోతల్లోనే ఈ స్టెయిన్‌లెస్ స్టీలు పట్టీలు అమర్చారు. 2015 ఆగస్టు నాటికి పైకప్పు మినహా మంటపం పునరుద్ధరణ పనులన్నీ పూర్తయ్యాయి. మరోసారి నిధుల కొరత ఏర్పడటంతో కొన్ని సంవత్సరాలు పనులు నిలిచిపోయాయి. స్థానిక ప్రజల ఉద్యమాలు, నిరసనలతో వాటిని తిరిగి ప్రారంభించి ఇటీవలే ఈ కళ్యాణ మండపం పనులను పూర్తిచేశారు. దీని పునర్నిర్మాణ వ్యయం రూ. 13.10 కోట్లకు చేరింది. 1163 సంవత్సరంలో కాకతీయ చక్రవర్తి రుద్రదేవుడు నిర్మించిన ఈ వేయి స్తంభాల ఆలయం తిరిగి 860 సంవత్సరాల అనంతరం పూర్తి స్థాయిలో పర్యాటకులకు అందుబాటులోకి వచ్చింది. ఈ ఆలయ మరమ్మత్తులకు అప్పటి 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కూడా ఒక లక్ష రూపాయలు అందచేశారట. నీటి పాయపై, ఇసుక పునాది మీద భారీ శిల్పాలతో కళ్యాణ మండపం నెలకొల్పిన తీరు కాకతీయుల చాతుర్యానికి అద్దం పడుతుంది. అద్భుత శిల్ప కళకు వేయి స్తంభాల దేవాలయం ప్రతీతి.

– కన్నెకంటి వెంకటరమణ
జాయింట్ డైరెక్టర్ సమాచార, పౌర సంబంధాల శాఖ, హైదరాబాద్



కల్యాణమండపం పునర్నిర్మాణం అద్భుత ఘట్టం

- శివరాత్రి రోజు ఆ పరమశివుడికి అంకితం, ప్రజలకు పునరంకితం
- ప్రాచీన కట్టడాల పరిరక్షణ అందరి బాధ్యత
- కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రి కిషన్‌రెడ్డి
- కన్నుల పండువగా కల్యాణ మండపం ప్రారంభం



వివరాలు 7లో..





కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వర ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు



వేయిస్తంభాల ఆలయంలో కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

హరోం హర!

ఘనంగా శివరాత్రి వేడుకలు.. శివనామ స్మరణతో మారుమోగిన ఆలయాలు





నంది చెవిలో వేడుకుంటున్న భక్తులు

మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం కన్నుల పండువగా జరిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ శివనామ స్మరణతో మారుమోగాయి. హర హర మహాదేవ శంభోశంకర్.. అంటూ భక్తులు తెల్లవారుజామున 4 గంటల నుంచే ఆలయాలకు తరలివెళ్లడం కనిపించింది. వెల్లువలా తరలివచ్చిన భక్తులతో శివాలయాలన్నీ కిక్కిరిసిపోయాయి. తండోపతండాలుగా తరలిరావడంతో ప్రతీ ఆలయం వద్ద భక్తులు బారులుతీరి నిల్చొని ఉండడం కనిపించింది. మండుతున్న ఎండను సైతం లెక్క చేయక భక్తులు ఆలయాలకు పోటెత్తారు. నగరంలోని దారులన్నీ శివాలయాలపైపే నడిచాయి. అర్ధరాత్రి పన్నెండు గంటల నుంచి లింగోద్భవ పూజల్లో పాల్గొని భక్తులు తన్మయత్వం చెందారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరమశివుడిని దర్శించుకొని తరించారు. మహాశివరాత్రి పర్వదినం వేళ వేలాదిగా తరలివచ్చిన భక్తులతో వేయిస్తంభాల ఆలయంతో పాటు పద్మాక్షి ఆలయం, మెట్టు రామలింగేశ్వరాలయం తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)

మళ్లీ బలరాముడే..

- మానుకోట లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్
- మహబూబాబాద్ నుంచి నాలుగోసారి బరిలో..
- ప్రకటించిన ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్



మహబూబాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాంనాయక్ పేరు ఖరారైంది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ.వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 7వ తేదీన సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశమై 8 రాష్ట్రాల నుంచి ఎంపీ అభ్యర్థులను ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 17 ఎంపీ స్థానాలు ఉండగా, తొలి జాబితాలో నలుగురు అభ్యర్థులను ఖరారు చేసింది. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ నేత సోనియాగాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ నాయకత్వంలో పార్టీ కేంద్రఎన్నికల కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

నాలుగోసారి..

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ములుగు జిల్లాలోని మారుమూల మదనపల్లె గ్రామానికి చెందిన నిరుపేద దంపతులు పోరిక లక్ష్మీబాయి-లచ్చునాయక్‌లకు నాలుగో సంతానంగా 6 జూన్ 1964న జన్మించిన బలరాంనాయక్ 2009లో రాజకీయంగా ఆరంగేట్రం చేశారు. అప్పట్లో జాతీయస్థాయిలో జరిగిన పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనతో ఆవిర్భవించిన మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడ్ పార్లమెంటరీ స్థానం నుంచి తొలిసారి కాంగ్రెస్ తరుపున పోటీచేసి సమీప మహాకూటమి సీపీఐ అభ్యర్థి కుంజా శ్రీనివాస్‌రావుపై 68,957 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదే క్రమంలో పార్లమెంట్ లేబర్ కమిటీలో సభ్యుడిగా, బొగ్గు, విమానయానశాఖ, రైల్వేశాఖ కన్వెన్షన్ కమిటీ సభ్యుడిగా కొనసాగారు. ఆపై జరిగిన యూపీఏ మంత్రివర్గ విస్తరణలో సామాజికవర్గ సమీకరణలు కలిసి రాగా, కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయ మంత్రి పదవి లభించింది. 2014, 2019లలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ నుంచి పోరిక బలరాంనాయక్ పోటీచేసి ఓటమిపాలయ్యారు. అంతకు ముందు 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహబూబాబాద్ నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ తరుపున పోటీచేసి ఓటమి చవిచూశారు. తిరిగి రానున్న 2024 పార్లమెంట్ ఎన్నికల్లో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు నేరుగా టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన వారి సంఖ్య 50 వరకు ఉండగా అధిష్ఠానం తిరిగి పోరిక బలరాంనాయక్‌కే టికెట్ ఖరారు చేసింది.

పోరిక బలరాంనాయక్ ప్రొఫైల్ :

పేరు	: పోరిక బలరాంనాయక్
పార్టీ	: కాంగ్రెస్
పదవి	: కేంద్ర మాజీ మంత్రి
విద్యార్హత	: ఎంఏ
పుట్టిన తేదీ	: 06-06-1964
భార్య	: తిరుపతమ్మ
పిల్లలు	: సాయిశంకర్, సాయికిరణ్
తల్లిదండ్రులు	: పోరిక లచ్చునాయక్-లక్ష్మీబాయి
స్వగ్రామం	: మదనపల్లి (ములుగు మండలం)
పరిచయం	: బలరాంనాయక్ హైదరాబాద్ ఏపీఎస్పీ పోలీస్ ఉద్యోగంలో పని చేశారు. ఆ తర్వాత సెక్రటేరియట్ టెలికామ్ ఉద్యోగిగా చేరారు. మరోపక్క ఆలిండియా బంజారా సేవక్ సమాజ్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో ఆవిర్భవించిన మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ నుంచి పోటీచేసి గెలిచి కేంద్ర సహాయమంత్రి పదవిని అధిష్ఠించారు. 2014, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ తరుపున పోటీ చేసి పరాజయం పాలయ్యారు. మరోమారు అక్కడి నుంచే ఎంపీగా పోటీచేసి, ఓటమిని చవిచూశారు.



కమలం గూటికి సీతారాంనాయక్

వివరాలు 6లో..

- ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- మహబూబాబాద్ బీజేపీ టికెట్‌పై మాజీ ఎంపీకి హామీ
- బీఆర్ఎస్‌లో గౌరవం లేదు, బీజేపీలో చేరికపై త్వరలో ప్రకటిస్తా: సీతారాం



ఓరుగల్లు హస్తం ఎవరికో?

తొలిజాబితాలో వరంగల్ ఎంపీ అభ్యర్థిని ప్రకటించని కాంగ్రెస్

- బలమైన అభ్యర్థి కోసం కాంగ్రెస్ అన్వేషణ
- బీఆర్ఎస్, బీజేపీలు సైతం ప్రకటించని వైనం

వరంగల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌లో వరంగల్ లోక్‌సభ టికెట్‌పై ఉత్కంఠ వీడటం లేదు. శుక్రవారం కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణ నుంచి పోటీచేసే నలుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ ఎంపీ స్థానం నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ పేరును ప్రకటించగా, వరంగల్ స్థానం మాత్రం పెండింగ్‌లో పెట్టింది. కాగా, కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్, బీజేపీలు కూడా తమ అభ్యర్థులను ప్రకటించకపోవటంతో వరంగల్ టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ అన్ని పార్టీల కేడర్‌లో నెలకొంది.

బలమైన అభ్యర్థి కోసం..

వరంగల్ కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం 42 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ 42మంది దరఖాస్తులను స్క్రూటినీ చేసింది. వీరిలో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినా శనిగపురం ఇందిర, 2019 ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన దొమ్మాటి సాంబయ్యలతో పాటు నమిండ్ల శ్రీనివాస్ పేర్లతో అధిష్ఠానానికి స్క్రీనింగ్ కమిటీ నివేదిక ఇచ్చింది. స్క్రీనింగ్ కమిటీ ఇచ్చిన ముగ్గురు జాబితాపై సునిల్ కనుగోలుతో పాటు మరో రెండు సర్వే ఏజెన్సీలతో సర్వే చేయించారు. ప్రస్తుతం ఈ ముగ్గురికంటే ఇంకా బలమైన అభ్యర్థి అయితే బాగుంటుందనే అభిప్రాయాలు ఏఐసీసీ నుంచి వచ్చినట్లుగా సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు స్థానాల్లో ఆరు కాంగ్రెస్ గెలిచినప్పటికీ ఇక్కడ బీఆర్ఎస్, బీజేపీలు కూడా బలంగా ఉన్నట్లు కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తించింది. వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో బీజేపీకి ఓట్లు బాగానే వచ్చాయని కాంగ్రెస్‌కు రిపోర్టులు వెళ్లాయి. దీంతో వరంగల్ స్థానంలో బలమైన అభ్యర్థిని బరిలోకి దించకపోతే ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చినట్లవుతుందని కాంగ్రెస్ డిల్లీ పెద్దలు అంచనా

మిగతా 8వ పేజీలో

ఎంజీఎం అభివృద్ధికి చర్యలు

- అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ మెడికల్, మార్చి 8: ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంజీఎం ఆస్పత్రిలో వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండా సురేఖ.. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి నూతనంగా నియామకమైన నర్సులకు క్యాపింగ్, బ్యాడ్జీలను ధరింపజేశారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మాతృమూర్తుల తర్వాత అంతటి గొప్పస్థానం వైద్య సిబ్బందికి దక్కుతుందని, పేషెంట్ల బాగోగులు చూసేది నర్సులేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటగా ఉద్యోగ నియామక పత్రాలు స్టాఫ్‌నర్సులకు అందజేశామని, మిగతా ఉద్యోగులకు అందజేత ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో నాలుగో తరగతి ఉద్యోగులు రోగులకు అందించే సేవలు మరువలేనివని, ప్రభుత్వం వారి సేవలను తప్పక గుర్తిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ తీరువల్ల చాలామంది ఉద్యోగులు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని తన దృష్టికి వచ్చిందని మంత్రి సురేఖ చెప్పారు. ఈ సమస్యలను వైద్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను చూపుతున్నామన్నారు. ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే సమీక్షిస్తామని తెలిపారు. రోగులకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు మంత్రి చెప్పారు.

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వైద్యరంగంలో రోగులకు సేవలందిస్తూ వృత్తికి గౌరవాన్ని తెస్తున్న నర్సుల సేవలు ప్రశంసనీయమన్నారు. మహిళలు చదువు, ఉద్యోగం, రాజకీయం, సామాజిక రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ నర్సులతో కలిసి కేక్ కట్‌చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ఆర్ఎంఓలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మురళీ, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కార్తీక్, జనరల్ సెక్రటరీ, ఉపాధ్యక్షురాలు సల్మా, పి.సజని, సుప్రియ, ఉపాధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, ప్రసాద్, డాక్టర్ కె.అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజుతో బీఆర్ఎస్ కార్పొరేటర్ల భేటీ

కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం

వివరాలు 7లో..

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- కాలేజీ భవనంపైనుంచి దూకి అఘాయిత్యం
- పరీక్షలు సరిగా రాయలేకనే అని సూసైడ్ నోట్



సాహిత్య (ఫైల్)

వరంగల్ క్రైం, మార్చి 9: హనుమకొండ జిల్లా భీమారం గ్రామంలోని ఓ ప్రైవేటు కళాశాల భవనంపై నుంచి దూకి వలుగుల సాహిత్య(16) అనే ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. మహాశివరాత్రి వేళలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామానికి చెందిన వలుగుల ప్రభాకర్-కవిత దంపతుల కూతురు సాహిత్య భీమారంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఇటీవల మొదటి సంవత్సరం పరీక్షలు రాస్తున్న సాహిత్య శుక్రవారం ఉదయం కళాశాల భవనం పక్కన శవమై కనిపించింది. గురువారం అర్ధరాత్రి కళాశాల భవనంపైకి ఎక్కి అక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకుందని పేర్కొంటూ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆపై విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

అయితే డాక్టర్ అవుదామని ఎన్నో ఆశలతో బీపీసీలో చేరానని, కానీ పరీక్షలు సరిగా రాయలేకపోతున్నానని, అందుకే చనిపోతున్నాని పేర్కొంటూ తన స్నేహితురాలికి రాసిన లేఖ రూములో లభించి నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఉదయం సమాచారం అందుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. యాజమాన్యమే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, యాజమాన్యాన్ని శిక్షించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాల ఎదుట ఆందోళన కొనసాగగా, హనుమకొండ ఏసీపీ దేవెందర్‌రెడ్డి, కేయూ సీఐ చేరాలు, ఎస్ఐలు రాజ్‌కుమార్, సురేష్‌లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ విషయాన్ని ధ్రువీకరించిన ఎస్ఐ రాజ్‌కుమార్.. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఆరు గ్యారంటీలతో బీఆర్ఎస్, బీజేపీల్లో వణుకు

- ఎల్లుండి 5లక్షల ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, మార్చి 8: శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఒకదాని వెంట మరొకటి అమలు చేస్తుంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లో వణుకు మొదలైందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భీమదేవరపల్లి మండలంలోని వంగర, ముత్తారం గ్రామాల్లోని శివాలయాల్లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వంగరలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ. 500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఇప్పటికే రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. ఈ నెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కూడా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మరో రెండు పథకాలను కూడా అమలు చేస్తామన్నారు. ఇలా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులపై అవగాహన లేకపోవడం, సాగునీటి ప్రాజెక్టులను సక్రమంగా అమలు చేయకపోవడం వల్లే



వంగరలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్రంలో కరువు పరిస్థితి ఏర్పడిందని పొన్నం పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు కాకముందే బీఆర్ఎస్ నాయకులు అసహనానికి గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలనను చూసి ప్రతిపక్షాలు ఆశ్చర్య పోతున్నాయన్నారు. ఈ నెల 11న 5లక్షల ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుడుతారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిస్తే తప్పేంటన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, తదితర పథకాల కోసం ప్రధానమంత్రిని నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను కలిసి అభివృద్ధి పనుల గురించి వివరించామని పేర్కొన్నారు. నిధుల గురించి అడిగామని, రాష్ట్ర అభివృద్ధికి నిధులు ఇవ్వకపోతే ప్రజాక్షేత్రంలో నిలదీస్తామన్నారు.

బీజేపీపై రాష్ట్రంలో ఓ తీరు.. డిల్లీలో మరో తీరుగా కేసీఆర్, కేటీఆర్‌లు వ్యవహరిస్తారిస్తున్నారని మంత్రి ప్రభాకర్ ఎద్దేవా చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఒకే సిద్ధాంతంతో పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఉత్తర దక్షిణ ధ్రువాలని, అవి ఎప్పుడు కలువవని పేర్కొన్నారు. బండి సంజయ్ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉండి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయాడని, అప్పుడు ఎందుకు రాజకీయ సన్యాసం స్వీకరించలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మంజులారెడ్డి, మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, నాయకులు పాల్గొన్నారు.

కమలం గూటికి సీతారాంనాయక్

ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

మహబూబాబాద్ ఎంపీ టికెట్‌పై మాజీ ఎంపీకి హామీ



సీతారాంనాయక్‌తో భేటి అయిన కిషన్‌రెడ్డి

వరంగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్‌ఎస్‌కు మరో భారీ షాక్ తగిలేలా ఉంది. ఆ పార్టీ సీనియర్ నేత, మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ బీజేపీలో చేరనున్నారు. శుక్రవారం వరంగల్ పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ.కిషన్‌రెడ్డి స్వయంగా సీతారాంనాయక్ ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. తెలంగాణ ఉద్యమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి సీతారాంనాయక్ కీలక పాత్ర పోషించారు. దీంతో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్.. సీతారాంనాయక్ సేవలు గుర్తించి 2014లో మహబూబాబాద్ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించిన సీతారాంనాయక్ ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిపై పార్లమెంట్‌లో తరుచుగా గళమెత్తారు. అయితే 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రొఫెసర్ సీతారాంనాయక్‌కు కేసీఆర్ బీఆర్‌ఎస్ టికెట్ నిరాకరించారు. దీంతో అప్పట్లోనే అసంతృప్తిగా ఉన్న సీతారాంనాయక్‌కు రాజ్యసభ, ఎమ్మెల్సీతో పాటు నామినేటెడ్ పోస్టులను ఆశగా చూపించారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని సీతారాంనాయక్ అధిష్ఠానాన్ని కోరారు. అయినప్పటికీ ప్రొఫెసర్‌కు నిరాశే మిగిలింది. దీంతో కనీసం ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో మరోసారి మహబూబాబాద్ నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు కీలక నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే మహబూబాబాద్ నుంచి మరోసారి సిటింగ్ ఎంపీ మాలోతు కవితకే బీఆర్‌ఎస్ కేటాయించింది. దీంతో తీవ్ర నిరాశలో ఉన్న సీతారాంనాయక్ బీజేపీలో చేరనున్నట్లు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది.

పార్టీలోకి అహ్వానించిన కిషన్‌రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రెండు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్నారు. వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. శుక్రవారం ములుగులో గిరిజన యూనివర్సిటీలో తాత్కాలిక తరగతుల నిర్వహణకు ప్రారంభం చేసిన కిషన్‌రెడ్డి.. నేరుగా హనుమకొండలోని మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్ ఇంటికి వెళ్లి కలిశారు. సీతారాంనాయక్‌ను శాలువాతో సన్మానించి, బీజేపీలోకి రావాల్సిందిగా కిషన్‌రెడ్డి ఆహ్వానించారు. ఎస్టీల హక్కుల కోసం, గిరిజన యూనివర్సిటీ కోసం ఎంపీగా సీతారాంనాయక్ ఎంతో కృషి చేశారని, అందుకే శాలువాతో సన్మానించి, పార్టీలోకి అహ్వానించినట్లుగా కిషన్‌రెడ్డి తెలిపారు.

గౌరవం లేని చోట ఎందుకు ఉండాలి

తనకు బీఆర్‌ఎస్‌లో అనేక అవమానాలు జరిగాయని, కనీస గౌరవం కూడా లేదని మాజీ ఎంపీ సీతారాంనాయక్ పేర్కొన్నారు. గౌరవం లేని చోట ఎందుకు ఉండాలని, గౌరవించిన వాళ్ల దగ్గరికే ఎందుకు వెళ్లకూడదని ప్రశ్నించారు. ఐదేళ్లుగా ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌కు పార్టీ బాధ్యతలు అడిగినా ఇవ్వలేదు.. సొంత ఖర్చులు పెట్టుకొని పార్టీ కాపాడుకుంటే కనీసం టికెట్ ఇవ్వకుండా అవమాన పర్చారని వాపోయారు. కుటుంబసభ్యులు, కార్యకర్తలతో చర్చించిన తరువాత బీజేపీలో చేరే విషయంపై కార్యాచరణ ప్రకటిస్తానని సీతారాంనాయక్ తెలిపారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ

ముగిసిన జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 8: ఆల్ ఇండి యా టెన్నిస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థా యి పురుషుల ఓపెన్ టెన్నిస్ పోటీలు శుక్ర వారం ముగిశాయి. ముగింపు వేడుకలకు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై హోరాహోరీగా జరిగిన టెన్నిస్ పోటీల్లో విజేతగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆఫీసర్ క్లబ్ వివిధ క్రీడలకు నిలయంగా మారిందని, మిగతా క్రీడాపోటీలకు దీటు గా ఓపెన్ టెన్నిస్ పోటీలను నిర్వహించినందుకు ఆఫీసర్స్ క్లబ్ సభ్యులను అభినందించారు. విశిష్ట అతిథి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడు తూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. గెలిచిన వారు పొంగకుండా ఓడిన వారు నిరాశ చెందకుండా పోటీతత్వంలో సాధన చేస్తే అనుకూల లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు మట్లాడుతూ.. ఆరు రోజులుగా ఆఫీసర్స్ క్లబ్ వేదికగా నిర్వహించిన ఓపెన్ టూ ఆల్ పురుషుల టెన్నిస్ టోర్నమెంట్‌లో 10 రా ష్ట్రాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. సింగిల్స్, డబు ల్స్ విభాగాల్లో నిర్వహించిన ఈ టోర్నీలో ఏజ్ కేటగిరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు సుమారు రూ.1లక్ష నగదు పారితోషికంతో పాటు బహుమతులను, సర్టిఫికెట్లను ప్రదానం చే యనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి మురుగన్, రాష్ట్ర ఈసీ మెంబర్ బాబురెడ్డి, ఆర్గనైజింగ్ ప్రతినిధులు కన్నారెడ్డి, డాక్టర్ ప్రవీణ్, మనోహ ర్‌రెడ్డి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● సింగిల్స్ విన్నర్స్: తరుణ్ కర్ర ప్రథమ స్థానం, ప్రత్యూష్ మహంతి ద్వితీయ స్థానంలో నిలిచారు.

● మెన్స్ డబుల్స్‌లో..: వినిత్ ముత్యాల, సాత్విక్ మురళి ప్రథమ స్థానం, కేఎస్ కవీన్ కార్తీక్, ప్రగతీష్ శివశంకర్‌లు ద్వితీయ స్థానంలో నిలిచారు.

నేడు వర్సిటీకి పనిదినం

కేయూ క్యాంపస్, మార్చి 8: కాకతీయ యూనివర్సిటీ, ఇతర అనుబంధ కళాశాలలన్నీ మార్చి 9న శనివారం యథావిధిగా పనిచేస్తాయని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 23న సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా సెలవు ప్రకటించిన సందర్భంగా మార్చి 9న రెండో శనివారం పనిదినంగా ప్రకటించినట్లు వెల్లడించారు. వర్సిటీ పరిధిలోని కళాశాలలు, డిపార్టుమెంట్‌లకు, కార్యాలయాలు పనిచేస్తాయని వెల్లడించారు.

కల్యాణ మండపం పునర్నిర్మాణం అద్భుత ఘట్టం

శివరాత్రి రోజు ఆ పరమశివుడికి అంకితం, ప్రజలకు పునరంకితం

కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కల్యాణ మండంలో పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హనుమకొండ, మార్చి8 (ఆంధ్రజ్యోతి): వేయి స్తంభాలగుడి కల్యాణమండపం పునరుద్ధరణ ఓ అద్భుత ఘట్టం అని కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. రూ.15కోట్ల వ్యయంతో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని కిషన్‌రెడ్డి శుక్రవారం వేద మంత్రాల మధ్య ప్రారంభించారు.

ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి, ఎంతో ఓర్పుతో, నైపుణ్యంతో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని మహాశివరాత్రి పర్వదినాన ప్రారంభించినందున్న దీనిని ఆ పరమశివుడికి అంకితమిస్తున్నానని అన్నారు. యావత్ ప్రజలకు పునరంకితం చేస్తున్నానని ప్రకటించారు. కాకతీయుల కాలం స్వర్ణయుగంగా ఆయన అభివర్ణించారు. ఒక చిన్న కల్యాణ మండపాన్ని విప్పి తిరిగి నిర్మించడానికి పంతొమ్మిదేళ్ల పట్టిందని, ఆ కాలంలో అనేక దేవాలయాలు, కోటలు, అనేక ఇతర కట్టడాలను కట్టడానికి ఇంకెన్ని యేళ్ల పట్టి ఉండొచ్చోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇలాంటి కట్టడాలను దర్శించి, అనుభూతి పొందినప్పుడు వాటి ప్రాముఖ్యత ఏమిటో తెలుస్తుందని కిషన్‌రెడ్డి అన్నారు. అందు వల్ల ప్రాచీన కట్టడాలను, కళాఖండాలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాకతీయ రాజు రుద్రదేవుడు వేయిస్తంభాల గుడి కట్టడానికి 72 ఏళ్ల పట్టిందని, ఇలాంటి అనేక దేవాలయాలను నిర్మించడంలో అనుసరించిన ఇంజనీరింగ్ విధానం అద్భుతమని కొనియాడారు. హిందువులను తమ మతంలోకి మార్చుకోవడానికి 1320లో అప్పటి ముస్లిం పాలకులు ఒక ఎజెండాగా తీసుకొని ప్రణాళిక ప్రకారం లక్షలాది దేవాలయాలను విచక్షణారహితంగా ధ్వంసం చేశారని, అలా ధ్వంసమైన వాటిలో పునరుద్ధరించిన వేయిస్తంభాలగుడిలో ప్రస్తుతం పునరుద్ధరించిన నందీశ్వరుడు కూడా ఉన్నాడన్నారు. కల్యాణ మండపం పునర్నిర్మాణంతో వేయిస్తంభాల గుడికి సంపూర్ణ రూపం వచ్చిందని కేంద్ర మంత్రి అన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత కల్యాణ మండపం పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తికావడంపై దృష్టి పెట్టానని, ఆ మహాశివుడి ఆశీస్సులతో పూర్తి చేయగలిగామని అన్నారు. కాకతీయుల సాండ్‌బాక్స్ టెక్నాలజీనే ఉపయోగించి మరో వెయ్యేళ్లు నిలిచి ఉండేలా మండపాన్ని పునర్నించారన్నారు. మండపం పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన స్థపతి శివకుమార్ శ్రీనివాసన్‌ను కేంద్ర మంత్రి అభినందించారు. నిట్ రిటైర్ ప్రొఫెసర్ పాండురంగారావు కృషి వెలకట్టలేనిదన్నారు. కేంద్రపురావస్తుశాఖ (ఏఎస్ఐ) అధికారులు, సిబ్బంది మండపం పూర్తికి విశేష కృషి చేశారని కొనియాడారు.

కేంద్ర పురావస్తు శాఖ ప్రాచీన కట్టడాలను పరిరక్షించడంలో విశిష్టమైన పాత్రను పోషిస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల్లో అనేక కట్టడాలు ఏఎస్ఐ పరిధిలోకి రాగా, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల తెలంగాణలో కేవలం ఏడు ప్రాచీన కట్టడాలు మాత్రమే ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఏఎస్ఐ పరిధిలోకి తీసుకురావలసిన ప్రాచీన కట్టడాలు ఇంకా అనేకం ఉన్నాయని అన్నారు. వీటన్నిటికీ ఏఎస్ఐ ఆధీనంలోకి తేవడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే కేంద్రపురావస్తు చట్టం చాలా కఠినంగా ఉంటుందని, ప్రాచీన కట్టడాలకు ఏ చిన్నమరమ్మతులు చేయాలన్నా, మార్పులు చేర్పులు జరపాలన్నా పలు అంక్షలు అడ్డువస్తాయన్నారు. పాండవుల గుట్టను ఏఎస్ఐ కిందకు తీసుకురావడానికి ప్రయత్నించగా అటవీశాఖ అభ్యంతరం తెలిపిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఉన్న ప్రాచీన కట్టడాల నిర్వహణకు నిధుల కొరత కొంత అడ్డంకిగా ఉందన్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం అభివృద్ధికి చాలినన్ని నిధులను ఇస్తామన్నారు.

శాసన మండలి వైస్ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్న అనేక అపురూప కట్టడాలను ఏఎస్ఐ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. రామప్పలాగానే హనుమకొండ వేయిస్తంభాల గుడిని కూడా యునెస్కో పరిధిలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవలసిందిగా కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. ఖిలా వరంగల్‌లోలాగానే వేయిస్తంభాల గుడిలో సౌండ్‌అండ్ లైట్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు కాకతీయుల రాజధానిగా విలసిల్లిన ఓరుగల్లు.. కళలకు, కళాఖండాలకు కానాచి అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ నగరం అభివృద్ధి పరంగా ఎంతో వెనుకబడిందన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, స్మార్ట్ సిటీ పథకం కింద నిధులు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రాలను సమర్పించారు. కాగా, కల్యాణ మండపం పునర్నిర్మాణంపై కేంద్ర పురావస్తుశాఖ రూపొందించిన ఐదునిముషాల నిడివిని డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించారు.

సత్కారం

కల్యాణ మండపం పునర్నిర్మాణంలో పనిచేసిన స్థపతి శివకుమార్, ఆయనతోపాటు పని చేసిన తమిళనాడుకు చెందిన శిల్పులకు శాలువాలు కప్పి పూలుచల్లి సత్కరించారు. మండపాన్ని పూర్వరూపానికి తీసుకురావడంలో భాగస్వాములైన నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండు రంగారావు, కేంద్ర పురావస్తుశాఖ ఉన్నతాధికారులు, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ తదితరులకు శాలువాలు కప్పి జ్ఞాపికలను అందచేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ ఉన్నతాధికారులతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యేలు ఎం.ధర్మారావు, వన్నాల శ్రీరాములు మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

శాంతిపూజ

మండపం ప్రారంభానికి ముందు కేంద్ర మంత్రి వేయిస్తంభాలగుడి ఆవరణలోని యాగశాలలో శాంతిపూజలో మహాచండీ యాగం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న కేంద్ర మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కిషన్‌రెడ్డి వేయిస్తంభాలగుడిలో రుద్రేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. పూజలు జరిపారు.



కల్యాణ మండంలోకి వస్తున్న కిషన్‌రెడ్డి



వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో సమావేశమైన కార్పొరేటర్లు

ఎమ్మెల్యే నాగరాజుతో బీఆర్ఎస్ కార్పొరేటర్ల భేటీ

కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం

వరంగల్ క్రైం, మార్చి 8: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ కార్పొరేటర్లు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో భేటీ అయ్యారు. శుక్రవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసానికి ఆరుగురు కార్పొరేటర్లు వెళ్లి ఆయనను శాలువాతో సత్కరించారు. ఆరుగురిలో ఒకరిద్దరు మినహా మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం సాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆరుగురు కార్పొరేటర్లు ఎమ్మెల్యేను కలవుడం గమనార్హం. కాగా, మహిళా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశామని కార్పొరేటర్లు చెబుతున్నప్పటికీ కాంగ్రెస్‌లోకి జంప్ కావడం వాస్తవమని సమాచారం. ఇప్పటికే వీరికి ఎమ్మెల్యే నాగరాజు పలుమార్లు ఫోన్ చేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించినట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల ముందే కాంగ్రెస్‌లో చేరాలని పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఇటీవల రహస్య సమావేశం నిర్వహించుకున్నట్లు సమాచారం. పార్టీ మారాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగానే మహిళా దినోత్సవం పేరిట ఎమ్మెల్యే నాగరాజును కలిసినట్లు సమాచారం. తనను కలిసిన కార్పొరేటర్లను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. కాగా ఆరుగురు కార్పొరేటర్లు ఎమ్మెల్యేను కలువడం బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు సరికాదు

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక నేత ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే

వడ్డెపల్లి, మార్చి 8: భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం సరికాదని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. మావోయిస్టుల లింకు కేసులో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్. సాయిబాబాతోపాటు మరో ఐదుగురిని బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించి వారిని విడుదల చేసింది. సాయిబాబా విడుదలను పురస్కరించుకొని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో హర్షాన్ని ప్రకటిస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా కాత్యాయని విద్మహే మాట్లాడుతూ.. 90 శాతం అంగవైకల్యం ఉన్న సాయిబాబా మరొకరి సహాయం లేనిదే తనపని తాను చేసుకోవడం కూడా అసాధ్యమని అన్నారు. అలాంటి వ్యక్తిని పదేళ్లపాటు జైల్లో నెట్టి కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామిక విలువలను ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పౌరస్పందన వేదిక అధ్యక్షుడు కరేటి శంకర్‌రావు యాదవ్, ప్రజా సంఘాల నాయకులు మెట్టు రవీందర్, అనిశెట్టి రజిత,రామలక్ష్మి, బి. రమాదేవి, ఎం.డి. బాసిత్, వెంగళ్‌రెడ్డి, బిల్లా మహేందర్, బోనగిరి రాములు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

కేయూ దూరవిద్యలో ప్రవేశాలు

డిగ్రీ, పీజీ కోర్సుల్లో దరఖాస్తులకు ఆహ్వానం ● 26 వరకు ఆల్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెల్లడి




ప్రవేశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రమేశ్, డైరెక్టర్ రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్, మార్చి 8: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు కేయూ పరిపాలన భవనంలోని కవిటీ హాల్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు వివరాలను వెల్లడించారు.

డిగ్రీ మూడేళ్ల కోర్సుల్లో బీఏ హెచ్‌పీపీ, ఎస్‌పీపీ, బీకామ్ జనరల్, కంప్యూటర్, బీబీఏ, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎల్ఐఎస్సీ కోర్సులున్నాయని తెలిపారు. అలాగే ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్‌సైన్స్, ఎకనామిక్స్, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, హ్యూమన్‌రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ సైకాలజీ, ఎన్విరాల్‌మెంట్ సైన్స్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఎంఎల్ఐఎస్సీ కోర్సులున్నాయని తెలిపారు. డిప్లొమా కోర్సుల్లో బిజినెస్ మేనేజ్‌మెంట్ రిటైల్ మార్కెటింగ్, ట్యాలీ, కంప్యూటర్ అప్లికేషన్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మిమిక్రీ, వోకల్ మ్యూజిక్, ఇన్స్ట్రుమెంటేషన్ మ్యూజిక్, సాఫ్ట్‌స్కిల్స్ మీడియా ఫొటోగ్రఫీ కోర్సులున్నాయని వివరించారు. కోర్సుల్లో ప్రవేశాలకు మార్చి 26 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్లు పొందవచ్చునని పేర్కొన్నారు. రూ.300 అపరాధరుసుంతో మార్చి 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. ఫీజు, కోర్సు వివరాలు, ప్రవేశార్హతలు వర్సిటీ వెబ్ సైట్ హెచ్‌టీటీపీ://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేయూ.ఏసీ.ఇన్/లో అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.

కేయూ దూరవిద్యకేంద్రం తెలంగాణలో పెద్ద డ్యూయల్ మోడ్ వర్సిటీ అని వీసీ రమేశ్ చెప్పారు. గ్రామీణ, పట్టణ, ఉద్యోగార్థులు, పార్టుటైమ్ ఉద్యోగాలు చేసేవారికీ బాగా ఉపయోగపడుతోందని తెలిపారు. ప్రత్యేక్ష కాంట్రాక్టు తరగతులు, ఆన్‌లైన్, రేడియో తరగతులతోపాటు వివిధ మాధ్యమాలతో బోధన ఉంటుందని వెల్లడించారు. యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బోర్డు, ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థలతోపాటు వర్సిటీ చట్టం మేరకు తరగతుల నిర్వహణతో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిత్వవికాస తరగతులు, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ స్కిల్స్ నేర్పిస్తామని వెల్లడించారు. ప్రవేశాల పొందిన విద్యార్థులకు ఎప్పటికప్పుడూ వెబ్‌సైట్, సెల్‌ఫోన్‌లో సంక్షిప్త సమాచారం అందుతోందని వెల్లడించారు. బ్రోచర్ విడుదల చేసినవారిలో కేయూ సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, డీవో ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీవి విద్యా వ్యతిరేక విధానాలు



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ స్టాలిన్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 8: భారతీయ జనతా పార్టీ విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్ స్టాలిన్ మాట్లాడారు. విద్య కాషాయికరణ, ప్రైవేటీకరణ, కేంద్రీకరణ కోసమే జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెడుతోందని ఆరోపించారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా నూతన జాతీయ విద్యా విధానం ఉందన్నారు. ఎన్ఈపీని ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, బడుగు, బలహీన, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో బీజేపీ విఫలమైందన్నారు. ఎన్ఈపీ రద్దు కోసం ఏఐఎస్ఎఫ్ దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణతోపాటు ఉద్యమాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మారుమోగిన శివనామస్మరణ



వేయిస్తంభాల ఆలయం వెలుపల బారులుతీరిన భక్తులు

హనుమకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాలగుడిని వేలాది మంది సందర్శించారు. స్వామి వారికి మహారుద్రాభిషేకాలు జరిపారు. ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని తెల్లవారుజామున 3.30 గంటలకు సుప్రభాతం, 4 గంటల నుంచి స్వామివారికి సామూహిక రుద్రాభిషేకాలు, నిత్యవిధి, హవనం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఎండలోనూ భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి వేచి ఉన్నారు. వేయిస్తంభాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రుద్రేశ్వర కల్యాణం


వేయిస్తంభాల గుడిలో సాయంత్రం 6.59 గంటలకు ధనిష్ఠ నక్షత్రయుక్త సింహలగ్న సుముహూర్తాన శ్రీ రుద్రేశ్వరీ రుద్రేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆగమ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గణపతి పూజ, ఉత్సవమూర్తుల ఎదురుకోలు, బాషికధారణ, జిలకర బెల్లం, యజ్ఞోపవీత ధారణ,, మహా సంకల్పంలాంటి వైదిక కార్యక్రమాలను నిర్వహించి కల్యాణోత్సవం తలంబ్రాల పర్వం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ కల్యాణ తంతును పర్యవేక్షించారు. ఈవో వెంకటయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రముఖ ఆధాత్మిక వేత్తల పురాణ ప్రవచనంతో భక్త జనులు పులకించిపోయారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆశీనులను చేసిన శ్రీరుద్రేశ్వరీ, రుద్రేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఎంతో అందంగా అలంకరించారు. వేయిస్తంభాల ఆలయంలో జాగరణ చేసే భక్తుల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పలు ఇతర ఆలయాల్లో..

వరంగల్ కోటలోని స్వయంభూ శంభులింగేశ్వరాలయం, వరంగల్ మట్టేవాడలోని భోగేశ్వరాలయం, భద్రకాళిగుడిలోని భద్రేశ్వర స్వామి ఆలయం, హనుమకొండలోని సిద్దేశ్వరాలయం, మడికొండలోని మెట్టురామలింగేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉజ్జయినీ మహాకాళ్వేర శివలింగ దర్శనం, 12 అడుగుల మహాశివలింగాన్ని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని శ్రీగట్టుమల్లికార్జున స్వామి ఆలయం, ములుగు జిల్లా పాలంపేటలోని చారిత్రక రామప్ప దేవాలయం, ఆత్మకూరులోని పంచకూట ఆలయం, వరంగల్ ఉర్సు జాగీరులోని పణిగల రామప్ప గుడి, ఐనవోలులోని ప్రాచీన మల్లికార్జునస్వామి ఆలయం, వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, కరీమాబాద్‌లోని విశ్వేశ్వరాలయం, కాశిబుగ్గలో ని విశ్వేశ్వరాలయం, జనగామ జిల్లా కుందారం గ్రామంలోని కుందేశ్వరాలయం, మహబూబాబాద్ జిల్లా కురవిలోని వీరభద్రస్వామి ఆలయం, నీరుకుళ్లలోని చెన్నకేశవ ఆలయం సహా పలు శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. వరంగల్ రామన్నపేటలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆల యం, వరంగల్‌లోని దుర్గేశ్వర స్వామి ఆలయం, ఆత్మకూరు మండలం కటాక్షపురంలోని త్రికూటాలయం దామెర మండల కేంద్రంలోని దామేశ్వరాలయంతో సహ పలు ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు నేత్ర పర్వంగా జరిగాయి.

మంత్రుల పూజలు

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వేయిస్తంభాలగుడి, భద్రకాళి గుడిని, రామప్ప ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ నగరంలోని పలు దేవాలయాలను సందర్శించి శివపూజలు చేశారు. వరంగల్ శివనగర్‌లోని రామాలయం ఖిలావరంగల్‌లోని స్వయం భూ దేవాలయం తదితర ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. భీమదేవరపల్లి మండలం వంగర, ముత్తారం శివాలయాల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా వేయిస్తంభాలగుడిని సందర్శించి పూజలు నిర్వహించారు.



ఒగ్గు పూజారులు వేసిన పెద్దపట్నం వద్ద బండారి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు, పాల్గొన్న డీసీపీ, ఏసీపీ, ఈవోలు

శిగాలూగిన మల్లన్న క్షేత్రం

ఐనవోలు, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఐనవోలు మల్లికార్జునస్వామి శైవక్షేత్రంలో పరమశివుడి సేవలో భక్తులు పరవశించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో దేవస్థానం ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం స్వామి వారి మేలుకొలుపు సుప్రభాత ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అభిషేకాలు కొనసాగాయి. భక్తులు మొక్కులు చెల్లించి స్వామివారిని దర్శించుకున్నారు.

స్వామి వారికి సింహవాహనసేవ


బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు ఉదయం 8 గంటలకు సింహవాహనసేవలో(స్వామి వారిని) మాడవీధుల గుండా ఊరేగించారు. యాగశాలలో రుద్రహోమాలు అష్టోత్తర 108 కలశాల్లో నదీసముద్రజలాలు, సుగంధ ద్రవ్యాలు, అభిషేక ద్రవ్యాలు ఉంచి నాలుగు కాలముల్లో పూజించారు. ఈ కలశాలతో లింగోద్భవకాలంలో మహాభిషేకం నిర్వహించారు. రాత్రి వేళ నందివాహన సేవను నిర్వహించారు. ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

పెద్దపట్నంపై భక్తుల శివతాండవం

మల్లన్న స్వామికి అత్యంత ప్రీతికరమైన పెద్దపట్నంను ఒగ్గు పూజారులు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల చూర్ణాలు(పిండి) ముగ్గులతో కాకతీయులు నిర్మించిన నృత్య మండపంలో పట్నం (మండపం)ను 12 అడుగుల వెడల్పు, పొడవుతో అందంగా వేశారు. మధ్యలో స్వామి అమ్మవార్లను పూజించి అవాహనం చేసి ఒగ్గు కథ ద్వారా కల్యాణ గాథను పఠించారు. తదుపరి భక్తి పారవశ్యంతో పట్నంపై మైమరిచి శివతాండవం నృత్యం చేశారు. వందల సంఖ్యలో పెద్దపట్నంపై నృత్యాలు చేయడం కనువిందుగా నిలిచింది. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై అనిల్‌కుమార్ నేతృత్వంలో సుమారు 150 మంది పోలీసులు నృత్య మండపం వద్ద తొక్కిసలాట జరుకుండా కట్టడి చేశారు. భక్తులు నృత్యాలు చేయడానికి చూడటానికి మండపం వద్ద పోటీ పడి నెట్టుకున్నారు.

కమనియం మల్లన్న స్వామి కల్యాణం

ఐనవోలు మల్లికార్జునస్వామి కల్యాణం కనులపండుగగా కనువిందు చేసింది. భ్రమరాంబమల్లికార్జునస్వామి వారిని నంది వాహనంపై నాలుగు వీధుల్లో కనువిందు చేసి కల్యాణ మండపానికి తీసుకవచ్చారు. వేద మంత్రోచ్చరణ నడుమ శైవాగమ శాస్త్రోక్తంగా యాగ్నికులు శ్రీనివాస్‌కుశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, పురోహిత్ ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితుడు పురుషోత్తంశర్మ, విక్రమ్ జోషి, యాగ్నికులు శ్రీకాంత్‌శర్మ అర్చక బృందం కల్యాణం జరిపారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తీసుకవచ్చారు. పట్టువస్త్రాలు, ఉత్సవ విగ్రహాలతో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికు చేరుకున్నాక సుమారు 2గంటల పాటు కల్యాణం నిర్వహించారు. భక్తులు శివనామస్మరణతో అసాంతం తన్మయతంతో తనివితీరాస్వామిని సేవించి భక్తిని చాటుకున్నారు. కల్యాణంలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కూతురు దివ్యరాజ్, కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ బొల్లేపల్లి మధుగౌడ్, మోహన్‌గౌడ్, మార్నేని వెంకటేశ్వర్‌రావు, రాయపురం సాంబయ్య, అనుముల రవీందర్, పల్లకొండ రమేష్, గిరుక రాజు, రాజిరెడ్డి, ఐనవోలు గ్రామ పురప్రముఖులతోపాటు ఆయా ప్రాంతాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు కల్యాణ తంతులో పాల్గొన్నారు.



తాళి చూపిస్తున్న దృశ్యం





వినయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్రిష్ణాకర్

వరంగల్ ఎంపీ టికెట్ ఇప్పించండి

హనుమకొండ కలెక్టరేట్: మార్చి 8 : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించేందుకు కృషి చేయాలని కాజీపేట సోమిడికి చెందిన కుమ్మరి క్రిష్ణాకర్ మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యకు బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నానని, పార్టీ ఉద్యమంచేస్తున్న సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు చేశానన్నారు. అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి టికెట్ ఇప్పించేందుకు సహకరిస్తానని వినయభాస్కర్ హామీ ఇచ్చారు.

సుబేదారి సీఐ బాధ్యతల స్వీకరణ



వరంగల్ క్రైం, మార్చి 8 : సుబేదారి పోలీస్‌స్టేషన్ సీఐగా పి.సత్యనారాయణరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సిద్ధిపేట ఎస్బీలో ఉన్న సత్యనారాయణరెడ్డి బదిలీపై సుబేదారికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి స్టేషన్ ఎస్ఐలు రవికిరణ్, సుమన్, సాంబయ్య, మహేందర్‌రెడ్డి, గాలిబ్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

ఆదుకోవాలని మంత్రికి వినతి

వరంగల్ మెడికల్, మార్చి 8 : తన భర్త నుంచి రక్షించాలని ఓ మహిళ మంత్రి సురేఖను వేడుకున్నారు. కమలాపూర్‌కు చెందిన రేణుక అనే మహిళ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి ఎంజీఎంకు వచ్చిన మంత్రి కొండా సురేఖ ఎదుట బోరున విలపిస్తూ గోడు చెప్పింది. తన భర్త చిత్రహింసలు పెడుతున్నాడని, అతడి నుంచి రక్షించాలని కోరారు. స్పందించిన మంత్రి వెంటనే సీపీ అంబర్ కిశోర్ ఝాకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలిపి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

చోటీ మజీద్‌ను ప్రారంభించిన నాయిని



వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని తదితరులు

హనుమకొండ సిటీ, మార్చి 8: హనుమకొండ 51వ డివిజన్‌లోని చోటీ మజీద్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. శుక్రవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, ఎమ్మెల్సీ, సియాసత్ పత్రిక ఎడిటర్ అమిర్ అలీ ఖాన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఇటీవలే మజీద్ పునర్ నిర్మాణం జరిగింది. ప్రారంభించిన రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజా మొహినుద్దీన్, ముఫ్తీ ఓమర్ అబిదీన్, హాఫిజ్‌పీర్ ఖలీక్ అహ్మద్ సబీర్, అజం అలీ, మౌలానా హరూన్ రషీద్, జలాలుద్దిన్ అక్బర్, అబుబాకర్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సురేఖకు వినతిపత్రం అందిస్తున్న లింగయ్య యాదవ్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 8 : జిల్లా వ్యాప్తంగా గొర్రెలు, మేకల పెంపకం దారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ నివాసం వద్ద సంఘం సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగయ్య యాదవ్ మాట్లాడారు. గొల్ల కురుమలకు ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. లబ్ధిదారుల అకౌంట్‌లోకి రూ.2లక్షల నగదు బదిలీ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో సంఘం ఏర్పాటు చేసుకునేందుకు స్థలంతో పాటు భవనం ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని కోరారు. జిల్లాలో ఉన్న గొల్లకురుమలకు మొదటి విడతలో కొందరికి గొర్రెలు పంపిణీ చేయగా, రెండో విడతలో రాకుండా పోయాయని అన్నారు. మిగిలిన వారిని గుర్తించి గొర్రెల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గొర్రెల పెంపకం దారులు మృతిచెందితే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోదుడు దొడ్డి కొమురయ్య విగ్రహం హనుమకొండలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు బంక సరళయాదవ్, భరత్‌కుమార్, కృష్ణమూర్తి, శ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా మహాశివరాత్రి

▸▸ భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

▸▸ మార్మోగిన శివనామస్మరణ

వడ్డెపల్లి, మార్చి 8: హనుమకొండలోని వివిధ డివిజన్లలో మహా శివరాత్రి పర్వదిన వేడుకలు శుక్రవారం నేత్ర పర్వంగా జరిగాయి. భక్తుల తాకిడితో ఆలయాలు కిటకిటలాడాయి. శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని మహాలక్ష్మి దేవాలయంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, 57వ డివిజన్‌లోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొంగు రాజు యాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్‌యాదవ్, పైన్ విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో, 58వ డివిజన్ ఎన్జీవోస్‌కాలనీలోని నాగరాజేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి పర్వదినం వేడుకలు ఘనంగా జరిగాయి.

హనుమకొండ వడ్డెపల్లిలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధానార్చకుడు మణికొండ ప్రవీణ్‌శర్మ, ఆలయ చైర్మన్ బోదాసు దామోదర్, వడ్డెపల్లిలోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ ప్రధానార్చకుడు మణికొండ వామన్‌కుమార్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ కటకం ప్రసాద్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాల్లోని మూల విరాట్‌లకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల తాకిడితో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తుల భజన కీర్తనలతో ఆలయాల ప్రాంగణాలు శివ నామస్మరణతో మార్మోగాయి. రాత్రి భక్తులు జాగారం నిర్వహించి పరమశివుడిని కొలిచారు. ఆలయాల అర్చకులు భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

• ఐనవోలు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం మండలంలోని శైవ క్షేత్రాలు హర హర మహాదేవ శంభో శంకర నినాదాలతో మారుమోగాయి. ఉదయం సుప్రభాత సేవల తదుపరి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్చనలు, అభిషేకాలు కొనసాగాయి. మహిళలు మంగళస్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకొని పూజలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో దర్శించుకున్నారు. జాగారాల్లో భాగంగా భక్తులు ఉపవాసాలు ఉండి కీర్తనలు, భజనలు చేస్తూ భక్తిని చాటారు. కొండపర్తి, పంథిని, కక్కిరాలపల్లి, నందనం, పున్నేలు, సింగారం, ముల్కలగూడెం, గర్మిళ్ళపల్లి, వెంకటాపూర్, వనమాల కనపర్తి, నర్సింహుల గూడెం, పెరుమాండ్లగూడెం, ఉడుతగూడెం, లింగమోరిగూడెం, రాంనగర్ గ్రామాల్లోని ఆలయాలు శివరాత్రి సందడి ఆధ్యాత్మిక ప్రశాంతతను నెలకొల్పింది.

• మడికొండ: మడికొండలోని మెట్టుగుట్టపై గల చారిత్రక మెట్టురామలింగేశ్వరస్వామి క్షేత్రంలో శుక్రవారం మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయఅర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపెల్లి సత్యనారాయణశర్మ ఉదయం 3గంటలకు స్వామి వారి మేలుకొలుపు, సుప్రభాత సేవ, ప్రాతఃకాల మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గవ్యాంత పూజలు, మంటపార్చనలు, నవ కలశార్చన, ఏకాదశ రుద్ర పారాయణం, రుద్రహోమం, నిత్యోపాసన, నిత్యబలి హరణ జరిపారు. పూజల్లో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, మహేందర్‌జీ స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఈసందర్భంగా మెట్టుగుట్ట ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. దేవస్థాన ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో ధర్మకర్తలు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

• కాజీపేట: కాజీపేట బాపూజీనగర్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఉచిత పండ్లు, పులిహోర, మంచినీళ్ల బాటిళ్లు పంపిణీ చేశారు. కొమురవెల్లి కాంతయ్య, రవికుమార్ జ్ఞాపకార్థం కొమురవెల్లి రమేశ్ ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, స్థానిక నాయకులు సిరిల్ లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, వనస మధు, నికుంజన్, దొంగల కుమార్ యాదవ్, తిరుపతి శ్రీనివాస్‌తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు..

• వరంగల్ కల్చరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రకాళి అమ్మవారిని కేంద్ర టూరిజం శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరికి ఆలయ మర్యాద ప్రకారం అమ్మవారి శేష వస్త్రాలు, ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. జాగరణ భక్తుల సౌకర్యార్థం దేవాలయ ప్రాంగణంలో శాస్త్రీయ సంగీత నృత్య కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కాగా, భద్రకాళి అమ్మవారికి మహాశివరాత్రి పర్వదినం శుక్రవారం రోజున డాక్టర్ గీలగాని సురేష్, స్వాతి దంపతులు 50 గ్రాముల 870 మిల్లీగ్రాములు గల బంగారు కాసుల పేరు ఆభరణాన్ని ఆలయ ఈవో శేషు భారతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, ప్రధానార్చకులు భద్రకాళి శేషు తదితరులు పాల్గొన్నారు.

• మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా హనుమకొండలోని వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తుల సౌకర్యార్థం నేపథ్యంలో క్యూలైన్ల ద్వారా భక్తులకు సేవలందించడానికి వరంగల్ ఏవీవీ ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి కొడిమ్యాల శ్రీనివాసరావు, ఏవీవీ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి శ్రీనివాస్, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి డాక్టర్ ఆజాంల నేతృత్వంలో 60 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలందించారు. వీరిని వరంగల్ డీసీపీ బారీ అభినందించారు. విద్యార్థి దశలోనే సమాజసేవ చేయడం అభినందనీయమని అన్నారు.

వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించిన సీపీ

వరంగల్ క్రైం : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం రుద్రేశ్వరాలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీపీ సూచించారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే కడియం

కాజీపేట : ధర్మసాగర్, వేలేరు మండలాల్లో మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని శ్రీ గట్టు మల్లికార్జున దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమానికి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఒగ్గుపూజారులు డప్పు వాయిద్యాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కడియం కల్యాణ కార్యక్రమంలో శివపార్వతులకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు జంగారాఘవరెడ్డి విచ్చేసి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీ సమ్మిరెడ్డి, జడ్పీటీసీ సరిత దేవస్థానం చైర్మన్ ప్రమోద్‌రెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



వేయిస్తంభాల గుడిలో పూజల అనంతరం సీపీ



అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుంటున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



మెట్టుగుట్టపై శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



వేలేరు మండలం మల్లికుదుర్లలో కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అలరించిన ఆధ్యాత్మిక సమ్మేళనం

▸▸ ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా శివరాత్రి వేడుకలు

వరంగల్ కల్చరల్, మార్చి 8: ఓరుగల్లు భక్తి కళావైభవాన్ని చాటి చెప్పేందుకు ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ హయగ్రీవచారి గ్రౌండ్‌లో శుక్రవారం సాయంత్రం ఆధ్యాత్మిక సమ్మేళన కార్యక్రమం ప్రారంభమైంది. శివరాత్రి జాగరణ ఉండే భక్తుల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆధ్యాత్మిక ప్రవచనాలు శివపార్వతుల కల్యాణ మహోత్సవం సినీ కళాకారులచే సంగీత విభావరి కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. గ్రౌండ్‌లో భారీ సెట్టింగ్ ఏర్పాటు చేసి ఈవెంట్ పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖులు, భక్తుల కోసం వివిధ కేటగిరిల్లో వసతి అందుబాటులో ఉంచారు. సాయంత్రం ప్రారంభమైన కార్యక్రమాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మూడేళ్లుగా ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సమ్మేళన కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి తెలిపారు. ఇవే కాకుండా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకతీయ పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు. 400 మంది వలంటీర్లు తమ సేవలందించారు. భక్తుల సౌకర్యార్థం మంచినీటి వసతి ఏర్పాటు చేశారు.



వలంటీర్లను అభినందిస్తున్న డీసీపీ బారీ



కాజీపేటలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఇందిరానగర్‌లో కేక్ కట్ చేస్తున్న బంక సరళ, గుజ్జుల వసంత

వడ్డెపల్లి, మార్చి 8: గ్రేటర్ వరంగల్ 59వ డివిజన్ ఇందిరానగర్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు, జిల్లా కాంగ్రెస్ నాయకురాలు తేళ్ల సుగుణ కిశోర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా మండలి ఆర్పీ అప్సర, మహిళలు బండ సునీత, మరికంటి విజయలక్ష్మి, రావుల రజిని, గుడి రోజారాణి, దొంగరి మాధవి, అంబటి పల్లవి, శ్రీలత, విష్ణుప్రియ, అనిత, వినోద, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

• ఐనవోలు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పీహెచ్‌సీ మహిళా వైద్య సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో తండ అశోక్, అమరవాది చేరాలు, గడ్డం మురళి, చింత ఏలియా పాల్గొన్నారు. సీహెచ్‌వో సునంద, ఏఎన్ఎం మారమ్మ, అనిత, ఆశ వర్కర్లు మంజుల, జ్యోతి, అనూష, పద్మ, కోమల, కవిత, అరుణలు సన్మానించబడ్డారు.

• కాజీపేట: కాజీపేట బాపూజీనగర్ సిద్దూ టెంట్‌హౌస్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నార్లగిరి రమేశ్ కేక్‌కట్ చేశారు. అనంతరం మహిళలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ అర్బన్ జిల్లా కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఐనవోలులో మహిళా వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న సంఘం నాయకులు



కాజీపేట బాపూజీనగర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఓరుగల్లు హస్తం ఎవరికో?

(5వ పేజీ తరువాయి)

వేస్తున్నట్లుగా సమాచారం.

కాగా, ఒక దశలో దొమ్మాటి సాంబయ్యకు టికెట్ ఖరారైందనే ప్రచారం జరిగింది. అనుహ్యంగా తొలిజాబితాలో వరంగల్ ఎంపీ స్థానం అభ్యర్థి పేరు లేకపోవటంతో అధిష్ఠానం అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టిసారించిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. అందులో భాగంగానే బీఆర్ఎస్‌కు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేతో కాంగ్రెస్‌లోని ఓ కీలకమైన నేత సంప్రదింపులు జరుపుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఆ మాజీ ఎమ్మెల్యే చేరికపై ఒకరిద్దరు ఎమ్మెల్యేలు అభ్యంతరాలు చెప్పుతున్నట్లుగా తెలిసింది. మరోవైపు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు కూడా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లుగా సమాచారం. అలాగే 2016 వరంగల్ పార్లమెంట్‌కు జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన సీనియర్ నేత సర్వే సత్యనారాయణ కూడా తనకు వరంగల్ సీటు కేటాయించాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా సమాచారం. అలాగే కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్ కూడా వరంగల్‌పై నజర్ వేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. వరంగల్ టికెట్‌పై అనుహ్యంగా తీవ్ర పోటీ పెరుగుతుండటంతో అధిష్ఠానం తొలిజాబితాలో ప్రకటించలేదని సమాచారం. మొత్తానికి వరంగల్ కాంగ్రెస్ టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ కేడర్‌లో నెలకొంది.

బీఆర్ఎస్, బీజేపీలోనూ..

వరంగల్ ఎంపీ స్థానంలో పోటీచేసే అభ్యర్థిని ఇప్పటి వరకు ప్రధానపార్టీలు ఏవీ కూడా ప్రకటించలేదు. ఇటీవలే తెలంగాణలో పోటీచేసే 9మంది పేర్లు ప్రకటించిన బీజేపీ.. వరంగల్ స్థానాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టింది. దీంతో బీజేపీలో వరంగల్ టికెట్ ఎవరికి అనే ఉత్కంఠ నెలకొంది. అలాగే బీఆర్ఎస్ సైతం మహబూబాబాద్ టికెట్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకే ఖరారు చేసింది. కానీ వరంగల్ స్థానం నుంచి ఎవరు పోటీచేస్తారనే విషయంపై స్పష్టత ఇవ్వటం లేదు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె వరంగల్ ఎంపీ టికెట్ అడుగుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే అధికారికంగా ఇంకా ఎవరినీ ప్రకటించకపోవడంతో క్యాడర్‌లో ఉత్కంఠ నెలకొంది.

పోలీసు కాలనీలో సమస్యల తిష్ట

▸▸ రోడ్లు, డ్రెయినేజీలు మృగ్యం ▸▸ తాగునీటికి తండ్లాట



పోలీసు కాలనీలో పేరుకుపోయిన చెత్తా చెదారం

వడ్డెపల్లి, మార్చి 8: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని పోలీసు కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. రోడ్లు, డ్రెయినేజీలు మచ్చుకైనా కానరావు. తాగునీటి సమస్య ప్రజలను నిత్యం వేధిస్తూనే ఉంది. పారిశుధ్య సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీసు కాలనీ ఆవిర్భవించి సుమారు రెండు దశాబ్దాలు కావస్తున్నా సమస్యలు తాండవిస్తూనే ఉన్నాయి. రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు. కాలనీలో మట్టి రోడ్లు గుంతలమయంగా మారడంతో నడక కూడా కష్టంగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. నివాస గృహాల నుంచి వెలువడే మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.

మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. నగర పాలక సంస్థ సరఫరా చేసే నీరు సైతం అందడం లేదని ప్రజలు అంటున్నారు. మినరల్ వాటర్‌పై ప్రజలు ఆధారపడుతున్నారు. ఆర్థికంగా ఉన్నవారు మినరల్ వాటర్ తెచ్చుకుంటుండగా పేదలు బోరు పంపుల నీటినే తాగుతున్నారు. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం ఎక్కువ మొత్తంగా ఉండడం వల్ల కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. నగర పాలక సంస్థ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిత్యం తాగునీటిని సరఫరా చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పోలీసు కాలనీలో పారిశుధ్యం సమస్య ప్రజలను వేధిస్తోంది. వారానికో సారి కూడా సక్రమంగా వీధులను శుభ్రం చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. కాలనీలో చెత్తా చెదారం పెరిగిపోయి పందులు, పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. పారిశుధ్య సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి..

సబావత్ సక్రం నాయక్, స్థానికుడు




కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి. పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి. తాగునీటిని నిత్యం సరఫరా చేయాలి. దోమల నివారణ మందును వారానికోసారి పిచికారీ చేయించాలి. ఖాళీ ప్లాట్లల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలి.

యోగా

నడుము నొప్పికి 'నో'

ఎక్కువ మందిని వేధించే సమస్య వెన్ను నొప్పి. ఎక్కువ సమయాల పాటు కూర్చుని పని చేసే వారిలో, వెన్ను, నడుములోని కండరాల మీద ఒత్తిడి పడడం మూలంగా ఈ సమస్య వేధిస్తూ ఉంటుంది. అయితే ఈ సమస్యను కొన్ని యోగాసనాలతో పరిష్కరించుకోవచ్చు. అవేంటంటే...



సుప్త మత్స్యేంద్రాసనం

శరీరాన్ని మెలితిప్పే ఈ ఆసనంలో, కటి, వెన్ను విప్పారి కండరాలు స్వాంతన పొందుతాయి. ఈ ఆసనం కోసం కాళ్లు చాపి నేల మీద కూర్చోవాలి. ఎడమ కాలిని మడిచి, కుడి కాలి మీదుగా అవతల వైపు నేల మీద ఆనించాలి. నడుము పైభాగాన్ని వెనక్కి తిప్పి, ఎడమ చేతిని వెనక వైపు నుంచి, కుడి చేతిని మోకాలి కింది నుంచి తిప్పి రెండు చేతులూ కలిపి పట్టుకోవాలి. ఈ భంగిమలో 30 సెకన్ల పాటు ఉండాలి.

భుజంగాసనం

వెన్ను, భుజాల్లోని నొప్పిని మటుమాయం చేసే ఆసనమిది. నేల మీద బోర్లా పడుకుని, ముంజేతులు చాపి, మోచేతులు నేల మీద ఆనించి ఉంచాలి. మోచేతుల మీద బరువు మోపుతూ నెమ్మదిగా ఛాతీని పైకి లేపి, ఈ భంగిమలో 30 సెకన్లు ఉండాలి.



ఉష్ట్రాసనం

మోకాళ్ల మీద కూర్చోవాలి. చేతులను నడుము వెనక ఉంచాలి. ఈ భంగిమలో మోచేతులు వెనక వైపుకు తిరిగి ఉండాలి. ఈ భంగిమలో వీలైనంత వెనక్కి వంగాలి. తలను ఆకాశం వైపు తిప్పాలి. ఈ ఆసనంతో నడుము, వెన్నులో బిగదీసిన కండరాలు సడలి, నొప్పులు తగ్గుతాయి.



మేకప్

స్వెట్ ప్రూఫ్

ఎండలు దంచేస్తున్నప్పుడు వేడి, చమట సహజం. ఇలాంటి వాతావరణంలో మందంగా మేకప్ వేసుకుంటే అందం కాస్తా అడుగంటిపోతుంది. కాబట్టి చమటతో చెదిరిపోని మేకప్ ఇలా వేసుకోవాలి.


- **మార్నింగ్ స్కిన్ కేర్:** వేసవిలో మేకప్ కోసం చర్మాన్ని ముందు నుంచీ సిద్ధం చేసుకోవడం కీలకం. అందుకోసం మార్నింగ్ స్కిన్ కేర్ రొటీన్‌ను అనుసరించాలి. సున్నితమైన క్లీన్సర్, హైడ్రేటింగ్ టోనర్, తర్వాత మాయిశ్చరైజర్, ఆ పైన 30 ప్లస్ ఎస్‌పిఎఫ్ కలిగిన సన్‌స్క్రీన్ అప్లై చేసి, ఇవన్నీ చర్మంలో ఇంకిపోయేవరకూ 30 నిమిషాల పాటు ఆగి ఆ తర్వాతే మేకప్ మొదలుపెట్టాలి.
- **స్వెట్ ప్రూఫింగ్:** తేలికగా ఉండే, పోర్ మినిమైజింగ్ ప్రైమర్‌ను ఈ కాలంలో వాడుకోవాలి. దీంతో ముఖ చర్మం నునుపుగా మారి మేకప్ సమంగా పరుచుకుంటుంది. అలాగే మేకప్ ఎక్కువ సమయం పాటు చెదిరిపోకుండా ప్రైమర్ నియంత్రిస్తుంది.
- **తక్కువ ఫౌండేషన్:** హెవీడ్యూటీ కన్‌సీలర్లు, ఫౌండేషన్లు ఈ కాలానికి పనికి రావు. ఇవి కరిగిపోయి, మేకప్‌ను పాడు చేస్తాయి. కాబట్టి తేలిక పాటి ఫౌండేషన్‌ను ఎంచుకుని, వీలైనంత తక్కువ పరిమాణంలో అప్లై చేసుకోవాలి. లాంగ్ వేరింగ్, స్వెట్ ప్రూఫ్ కలిగిన ఫౌండేషన్ వేసవికి అనువైనది. లేదంటే ఫౌండేషన్‌కు బదులుగా టింటెడ్ మాయిశ్చరైజర్ లేదా సిసి క్రీమ్ కూడా అప్లై చేసుకోవచ్చు.



- **పౌడర్ ఇలా:** చమటకు చెరిగిపోని మ్యాటి పౌడర్‌ను వాడుకోవాలి. వేసవి వేడికి చర్మం పాడవకుండా కాపాడే ఎస్‌పిఎఫ్ ఫార్టిఫైడ్ మ్యాటి ఫార్ములా పౌడర్‌ను ఎంచుకోవాలి.
- **వాటర్‌ప్రూఫ్:** ఐలైనర్, మస్కారాలు వాటర్‌ప్రూఫ్ ఎవి అయి ఉండాలి.
- **బ్లాటింగ్ పేపర్స్:** చమటతో మేకప్ చెదిరిపోకుండా ఉండడం కోసం బ్లాటింగ్ పేపర్స్ అందుబాటులో ఉంచుకోవాలి. సాధారణంగా పేపర్ టవల్, టిష్యూ, న్యాప్కిన్‌లతో ముఖం మీద పట్టే చమటను అద్దుకుంటూ ఉంటారు. కానీ వీటితో ఫౌండేషన్ చెదిరిపోయే ప్రమాదం ఎక్కువ.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం...
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/QItfI7Uలో చదవండి.

సూప్స్‌తో శుభవేళ



రెగ్యులర్ సూప్స్ కాకుండా విభిన్నమైన సూప్స్ చేసుకుంటే మజా ఉంటుంది. మష్రూమ్ వెజిటబుల్ సూప్, చికెన్ వెజిటబుల్ సూప్, గుమ్మడికాయ-పాలకూర సూప్, బ్రొకోలి బఠానీల సూప్‌లను ఇంట్లోనే సులువుగా చేసుకోవచ్చు ఇలా..

మష్రూమ్ వెజిటబుల్ సూప్

కావాల్సిన పదార్థాలు

ఆలివ్ నూనె- అర టేబుల్ స్పూన్, వెజిటబుల్ స్టాక్- అరటేబుల్ స్పూన్, బటన్ మష్రూమ్స్- 1 కప్పు, క్యారెట్స్- 2 (ముక్కలుగా తరగాలి), పెద్ద ఉల్లిపాయలు- 1 (సన్నగా తరగాలి), సెలరీ స్టాక్స్- 2 (ముక్కలుగా తరగాలి), జుకిని- 1 (ముక్కలుగా తరగాలి), వెల్లుల్లి రెబ్బలు- 4 (మెత్తగా చేసుకోవాలి), తాజా తులసి ఆకులు- 1 టేబుల్ స్పూన్, ఎండిన సోంపు మొక్కలు- 1 టీస్పూన్, కారం మిరియాలు- కొద్దిగా, తరిగిన కొలార్డ్- 1 గుత్తి, టమోటాలు-2 (ముక్కలుగా తరగాలి), క్యాన్డ్ వైట్ బీన్స్- 2 కప్పులు, ఉప్పు- రుచికి తగినంత, గ్రౌండ్ పెప్పర్- రుచికి తగినంత, బ్రొకొలి- కప్పు, కాలే ఆకులు- 2 టేబుల్ స్పూన్, బీన్స్- టేబుల్ స్పూన్

తయారీ విధానం

గిన్నెలో ఆలివ్ నూనె వేసి మీడియమ్ హీట్‌లో ఉంచుకోవాలి. ఇందులోకి మష్రూమ్స్, ఉల్లిపాయలు, క్యారెట్స్, సెలరీ, జుకిన్ వేయాలి. గరిటెతో కదుపుతూ కనీసం ఆరేడు నిముషాలు కుక్ చేయాలి. వెజిటేబుల్ ముక్కలు అడుగుకి అంటేప్పుడు ఇందులోకి తగినంత వెజిటబుల్ స్టాక్ వేయాలి. ఇందులోకి వెల్లుల్లి, తులసి ఆకులు, సోంపు మొక్కలు, మిరియాలు వేసి పది నిముషాల పాటు గరిటెతో కదుపుతూ కుక్ చేయాలి. కాలే ఆకులు వేసి కుక్ చేయాలి. ఆకులు మెత్తగా అయ్యాక టమోటాలు, వెజ్ స్టాక్, బీన్స్ కలిపి వేయాలి. ఇందులోకి కప్పు నీళ్లు పోసి కలపాలి. హీట్ మెల్లగా తగ్గించటం కోసం సిమ్‌లో ఉంచి కనీసం ఇరవై నిముషాల పాటు కుక్ చేయాలి. చివరగా ఉప్పు, పెప్పర్ చల్లుకుని క్రీమీ సూప్‌ను తాగటమే తరువాయి. ఎంతో రుచికరంగా ఉంటుంది.

గుమ్మడికాయ పాలకూర సూప్

కావాల్సిన పదార్థాలు

ఆలివ్ ఆయిల్- 1 టేబుల్ స్పూన్, ఉల్లిపాయ ముక్కలు- 2 కప్పులు, గోధుమ పిండి- 2 టీస్పూన్స్, సోడియమ్ తక్కువగా ఉండే వెజిటబుల్ స్టాక్- కొద్దిగా, గుమ్మడికాయ గుజ్జు- 4 కప్పులు, శుభ్రపరచిన లేత పాలకూర- 1 కట్ట, మెత్తగా నలిపిన వెల్లుల్లి పాయ పేస్ట్- అర టీస్పూన్, బ్లాక్ బీన్స్- అర టీస్పూన్, రాయితో దంచిన జీలకర్ర పొడి- అర టీస్పూన్, ఉప్పు- పావు టీస్పూన్, రాయితో దంచిన వెట్ పెప్పర్- పావు టీస్పూన్, జాజికాయపొడి- చిటికెడు

తయారీ విధానం

ప్యాన్‌లో ఆయిల్ నూనె వేసి ఇందులో ఉల్లిపాయ ముక్కలు మీడియం హీట్ వరకూ వేయించాలి. ఇందులో గోధుమ పిండి వేసి



కలపాలి. రెండు నిముషాల పాటు కలుపుతూ కుక్ చేయాలి. మిశ్రమం థిక్ అయ్యేంత వరకూ కలిపి.. ఆ తర్వాత వెజిటబుల్ స్టాక్, గుమ్మడికాయ గుజ్జు, పాలకూర, ఉల్లిపాయ ముక్కలు, జీలకర్ర, ఉప్పు, పెప్పర్ వేసి కలపాలి. ఆ తర్వాత మంటను సిమ్‌లోకి ఉంచి పదిహేను నిముషాల పాటు కుక్ చేయాలి. కుక్ అవుతున్నంత సేపు గరిటెతో కదుపుతూ ఉండాలి. ఇందులో ఉడకబెట్టిన బ్లాక్ బీన్స్ వేసి పదిహేను నిముషాల పాటు మిశ్రమాన్ని కుక్ చేయాలి. గరిటెతో కదుపుతూనే ఉడికించాలి. క్రీమీగా వచ్చేంత వరకూ కుక్ చేసిన తర్వాత సిమ్‌లో ఉంచి నిముషం పాటు కుక్ చేసి దించేసుకోవాలి. దీన్ని బ్రౌన్ రైస్‌లోకి కలుపుతూ తినొచ్చు.

బ్రొకొలి, బఠాణీల సూప్



కావాల్సిన పదార్థాలు

బ్రొకొలి ముక్కలు- 1 కప్పు, ఫ్రోజెన్ బఠాణీలు-1 కప్పు, స్వీట్ పొటాటో- 1 (చిన్నది అయితే సరిపోతుంది. దీని తొక్క తీసేసి క్యూబ్స్‌గా కట్ చేసుకోవాలి), ఎల్లో ఆనియన్- అర్ధ భాగం, వెల్లుల్లి రెబ్బలు- 2 (మెత్తగా చేత్తో నలపాలి), లో ఫ్యాట్ కొబ్బరి పాలు- కప్పు, సోడియం తక్కువగా ఉండే వెజిటబుల్ స్టాక్- 1 కప్పు

తయారీ విధానం

గుంత ప్యాన్‌లో నూనె వేసిన తర్వాత ఉల్లిపాయ ముక్కలను నాలుగైదు నిముషాల పాటు వేయించాలి. ఇందులోకి వెజిటబుల్స్ అన్నీ వేసి కలపాలి. ఇవన్నీ మెత్తగా అయ్యేంత వరకూ కుక్ చేయటానికి వీలుగా వెజిటబుల్ స్టాక్ వేయాలి. బాగా మెత్తగా అయిన తర్వాత ఇందులోకి కొబ్బరి పాలు వేసి సిమ్‌లో ఉంచి మూడు నిముషాల పాటు కలుపుతూ ఉండాలి. చివరగా వేడి వేడిగా సర్వ్ చేసుకుంటే భలే ఉంటుంది.

చికెన్ వెజిటబుల్ సూప్

కావాల్సిన పదార్థాలు

చికెన్ బ్రోత్-425 ఎమ్.ఎల్., స్కిన్‌లెస్ బోన్‌లెస్ చికెన్- 1 బ్రెస్ట్ హాఫ్స్, నీళ్లు- 5 కప్పులు, క్యారెట్స్- 3 (సన్నగా తరగాలి), ఉల్లిపాయ- 1 (ముక్కలుగా తరగాలి), స్టాక్స్ సెలరీ- 3 (సన్నగా తరగాలి), ఉప్పు- తగినంత, పెప్పర్- తగినంత

తయారీ విధానం

పెద్ద సాస్‌ప్యాన్‌ను బాగా హీట్ చేయాలి. ఇందులో



నాలుగు కప్పుల నీళ్లు పోయాలి. దీంతో పాటు చికెన్ బ్రోత్ వేసి కలపాలి. బాగా వేడి చేయాలి. ఇందులో క్యారెట్ ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, సెలరీ ముక్కలతో పాటు చికెన్ బ్రెస్ట్ వేసి కలపాలి. మెల్లగా మంటను తగ్గిస్తూ పోవాలి. సిమ్‌లో ఉంచాక పదిహేను నిముషాల పాటు కుక్ చేయాలి. కూరగాయలు సాఫ్ట్ అయ్యేంత వరకూ చూడాలి. ఇంకో బౌల్‌లో చికెన్ బ్రెస్ట్‌ను ఉడబెట్టి దీన్ని ఫోర్క్ సాయంతో చిన్న పీస్‌లుగా చేసుకోవాలి. కూరగాయలు మెత్తగా అవుతాయి. సిమ్‌లో మరో ఐదు నిముషాలు ఉంచిన తర్వాత చివర్లో ఉప్పు, పెప్పర్ చల్లుకుని కలిపిన తర్వాత దించేయాలి.

మావిచిగురు కూర

ఆమ్రాతకస్య నవతామ్రరుచః ప్రవాళాః
ఖండీకృతా లవణామిశ్రిత పిండితాష్టా!
బాహ్లీక ధూప నజాషో ఘృత దుగ్ధసిద్ధాః
సందీపయన్తి పవనస్య సుఖాయమేతే!

'మావిచిగురు తినగానే కోయిల పలికేనా... కోయిలగొంతు వినగానే మావి చిగురు తొడిగేనా'.. దేవులపల్లి కృష్ణశాస్త్రి పాట వినని తెలుగు వారుండరు. మామిడి లేత ఆకులు కోయిలకే కాదు మనకూ మనోల్లాసాన్నీ, ఆరోగ్యాన్నీ కలిగిస్తాయి. ఆ మావిచిగురుతో కమ్మని వంటకాల గురించి క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో వివరించాడు.

రాగి రంగులో ఉండే లేత మామిడాకుల్ని చక్కగా కడిగి, సన్నని ముక్కలుగా తరగాలి. తగినంత ఉప్పు వాటి మీద చల్లి, పైపైన దంచి, అందులో కొద్దిగా ఇంగువ వేసి బాగా పిసికి ముద్దగా చెయ్యాలి. ఒక బాండీలో రెండు మూడు చెంచాల నెయ్యి తీసుకుని తాలింపు గింజలు వేగించి,

కఫపిత్తహరో హృద్యో సుఖవైరస్యనాశినై!
వహ్నిసంజననో రుచ్యో చూతజో పుష్పపల్లవౌ!
మామిడి పూలు, చిగురు పెరుగుపచ్చడి కఫాన్ని, పైత్యాన్ని తగ్గిస్తుందన్నాడు క్షేమశర్మ. గుండెకి మేలు చేస్తుందన్నాడు. కడుపులో జఠరాగ్నిని ప్రజ్వరిల్లజేసి నోటికి రుచిని తెలియజేస్తుందని, అన్నహితవు కలిగిస్తుందనీ పేర్కొన్నాడు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో మామిడి పూలు, చిగురు మనకు బాగా దొరుకుతాయి.

అందులో ఈ ముద్దని వేసి బాగా కలియబెట్టాలి. కొద్ది కొద్దిగా పాలు పోస్తూ కలియబెడుతుంటే మృదువుగా మారి, కూర ముద్దగా దగ్గరకొస్తుంది. ఈ దశలో మీకు కావల్సిన సుగంధ ద్రవ్యాల్ని లేదా పరిమళ ద్రవ్యాల్ని కలిపి మరింత రుచికరంగా దీన్ని చేసుకోవచ్చు. ఇది వాత వ్యాధుల్ని తగ్గించటానికి, అజీర్తిని పోగొట్టడానికి ఉపయోగపడుతుంది. కారం కోసం మిరియాల పొడిని కలిపితే ఈ మావిచిగురు కూర కఫాన్ని తగ్గించి, గొంతు శ్రావ్యంగా అయ్యేలా చేస్తుంది.

పెరుగుపచ్చడి...

'ముకులః సహకార శాఖినః శత ఖండీ కృత సైంధవాన్వితః!



మామిడిని 'మాంగీఫెరా ఇండికా' అని పిలుస్తారు. దీని చిగురుకు షుగరు వ్యాధిపైనా, వైరస్ వ్యాధులపైనా పని చేసే గుణం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ఇది విషదోషాలను హరిస్తుంది. ట్యూమర్లను కరిగిస్తుంది. వాపుల్ని తగ్గిస్తుంది. కడుపులో నులిపురుగుల్ని పారద్రోలుతుంది. కొవ్వుని కరిగిస్తుంది. బీపీని తగ్గించే గుణం కూడా వీటికుందంటున్నారు. వాతాన్ని, పైత్యాన్ని హరిస్తుందంటే ఇన్ని బాధలూ తగ్గుతాయని అర్థం. వేరికోజ్ వీన్సుతో బాధపడేవారికి ఇది మంచి ఔషధం. అలసటని తగ్గించి శక్తినిస్తుంది. 'పూవుం దేనియం దడిసిన మావిచిగురు'.. అంటే మామిడి పూలలోని తేనెతో తడిసిన మావిచిగురు చాలా కమ్మగా ఉంటుందని కవులు కీర్తించారు.

దధిమథమరీచ సంస్కృతష్షి రజామరుచిం చినత్తి హి!

మామిడి పూలతోపాటు లేత ఆకుల్ని, సన్నని కొమ్మల్ని కూడా ఓ వంద ముక్కలుగా... అంటే చాలా చిన్నచిన్న ముక్కలుగా తరిగి ఓ పళ్లెంలో పోసి, దాని మీద తగినంత ఉప్పు చల్లి, బాగా పిసకాలి. పైన చెప్పినట్టే నేతి తాలింపులో వేసి కాసేపు మగ్గనివ్వాలి. మగ్గిన తరువాత కొద్దిగా పెరుగు, తగినంత మిరియాల పొడి కలిపి పొయ్యి మీంచి దించేయాలి. పెరుగు కలిపిన తరువాత ఎక్కువ వేడి తగలకుండా ఉంటే మంచిది. ఇలా తయారు చేసిన మామిడి చిగుళ్ల, పూల పెరుగుపచ్చడి చాలా కమ్మగా ఉంటుంది.

● గంగరాజు అరుణాదేవి

నాన్నకిచ్చిన మాట కోసం...

సాధారణ విద్యార్థి నుంచి అత్యున్నత స్థానాలకు చేరడం వరకూ... ఆద్యంబిందు గీతది స్ఫూర్తిమంతమైన ప్రయాణం. మధ్యలో ఆపేసిన చదువును ఇద్దరు పిల్లల తల్లయ్యాక... తండ్రి కోరిక మేరకు కొనసాగించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) బెంగళూరు శాఖకు తొలి మహిళా ఛైర్మన్ అయ్యారు. తాజాగా ఆ సంస్థ సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ పదవికి ఆరున్నర దశాబ్దాల తరువాత ఎన్నికైన మహిళగా చరిత్ర సృష్టించిన గీత 'నవ్య'తో ప్రత్యేకంగా సంభాషించారు...

"ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్ వరకూ నా చదువంతా ప్రభుత్వ విద్యా సంస్థలలోనే సాగింది. మా నాన్న మాధవరావ్ ఆద్యంబిందు మునిసిపల్ కమిషనర్‌గా పని చేసేవారు. మా అమ్మ అమ్మణ్ణి సర్వే శాఖలో ఉద్యోగి. మేము నలుగురు అక్కచెల్లెళ్లం, మా అందరికన్నా పెద్ద మా అన్నయ్య. నాన్న ఉద్యోగరీత్యా ఎక్కడ పని చేసినా... మా చదువు చిత్తూరులోనే సాగింది. నేను సాధారణ విద్యార్థిని. చదువు మీద అంతగా ధ్యాస ఉండేది కాదు. ఇలా గడుస్తున్న సమయంలో... నా చదువు తీరును ఇంటర్‌లో మా అధ్యాపకుడు ధనశేఖర్ గమనించారు. "రాజుగారి గుర్రం గాడిద అవుతోంది" అని మందలించారు. ఆ మాటలు నాకు సూటిగా తగిలాయి. అవి నాలో ఎంతో మార్పు తెచ్చాయి. కష్టపడి చదివాను. బీకామ్ పూర్తి చేశాను. ఆ తరువాత నేను ఛార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) చెయ్యాలని నాన్న పట్టుపట్టారు. దాంతో అనుభవం ఉన్న ఛార్టర్డ్ అకౌంటెంట్ దగ్గర చేరాను. కానీ కనీసం అయిదేళ్ళు చదవాల్సి ఉండడంతో.. మధ్యలోనే వదిలేస్తానని నా కుటుంబానికి తేల్చి చెప్పాను. కానీ మధ్యలో వెనకడుగు వద్దంటూ మా నాన్న ఒత్తిడి చేశారు. చివరకు పరీక్షలు రాయడానికి చెన్నై వెళ్ళాను. అక్కడే చంద్రకాంత్‌తో స్నేహం ఏర్పడి... ప్రేమగా మారింది. 1995లో మేము వివాహం చేసుకున్నాం. రెండేళ్ళకు కవలలు జన్మించారు. కానీ సీఏ పరీక్ష పూర్తి చేయలేకపోయాను.



తొలి మహిళగా...

ఇదిలా సాగుతూ ఉండగా... నాన్న అనారోగ్యానికి గురికావడంతో ఆపరేషన్ అవసరమయింది. "నువ్వు సీఏ పూర్తి చేస్తానని మాట ఇస్తేనే ఆపరేషన్ థియేటర్లోకి వెళ్తను" అంటూ నాతో ప్రమాణం చేయించుకున్నారు. ఆ మాటను పాటిస్తూ... నా భర్త సహకారంతో సిఏ పూర్తి చేశాను. 2008లో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' (ఐసీఏఐ) బెంగళూరు శాఖలో... ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా నా పేరు రిజిస్టర్ చేసుకున్నాను. అప్పటి నుంచి నా జీవితం ఎప్పటికప్పుడు కొత్త మలుపులు తిరుగుతోంది. 2010లో ఐసీఏఐ బెంగళూరు శాఖకు తొలి మహిళా కోశాధికారిగా ఎన్నికయ్యాను. అనంతరం మూడేళ్ళపాటు వైస్-ఛైర్ పర్సన్‌గా ఉన్నాను. ఆ తరువాత... 2017లో తొలి మహిళా ఛైర్మన్ అయ్యాను. ఆ శాఖ ఏర్పడ్డాక... 75 ఏళ్ళలో ఆ హోదాను ఒక మహిళ అందుకోవడం అదే మొదటిసారి. దేశవ్యాప్తంగా 173 ఐసీఏఐ శాఖలు... అయిదు రీజియన్లలో ఉన్నాయి. చెన్నై కేంద్రంగా సదరన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీజనల్ సెంటర్ 1947లో ప్రారంభమయింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరిలోని శాఖలు దీనికి అనుబంధంగా ఉంటాయి. ఈ పరిధిలో సుమారు 85 వేలమంది ఛార్టర్డ్ అకౌంటెంట్లు ఉన్నారు. వారిలో మహిళలు సుమారు 30 శాతం ఉంటారు. ఐసీఏఐ సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్‌కు తొలి మహిళా ఛైర్మన్‌గా... స్వాతంత్ర్య సమరయోధురాలు ఆర్.శివభోగం 1955 నుంచి మూడేళ్ళపాటు వ్యవహరించారు. 66 ఏళ్ళ తర్వాత ఎన్నికల ద్వారా అత్యధిక ఓట్లతో... రెండవ మహిళా ఛైర్మన్‌గా నేను ఎన్నికయ్యాను.

నకిలీలను కట్టడి చేశా...

ఐసీఏఐ దేశ ఆర్థిక ప్రగతికి మార్గదర్శకంగా పనిచేసే సంస్థ. దేశవ్యాప్తంగా వర్తకులు, వాణిజ్య సంస్థలు ఎదుర్కొనే జీఎస్‌టీ లాంటి కీలకమైన అంశాలపై మేము సలహాలు ఇస్తుంటాం. అధికారులకు, ట్రేడర్లకు మధ్య నెలకొనే ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే సీఏల కీలక బాధ్యత. ప్రస్తుతం సదరన్ రీజనల్ ఛైర్మన్ హోదాలో... ఈ ఆరు రాష్ట్రాల పరిధిలోనూ సీఏ కోర్సులు పూర్తి చేసిన వారిని ప్రాక్టీస్ దిశగా ప్రోత్సహించడంతో పాటు వాణిజ్య పరిశ్రమల సమాఖ్యలు, ట్రేడర్లకు ప్రాంతాల వారీగా ఎప్పటికప్పుడు మారుతున్న పన్నుల విధానాలపై అవగాహన కల్పించడం కీలకమని నేను భావిస్తున్నాను. అందుకోసం ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటున్నాను. నేను బెంగళూరు శాఖకు ఛైర్మన్‌గా ఉన్నప్పుడు... సీఏల పేరుతో ప్రాక్టీస్ చేసే నకిలీ వ్యక్తులను కట్టడి చేశాను. ఏడాదిపాటు బెంగళూరులో చేపట్టిన అవగాహన సదస్సులు దేశమంతటా ప్రచారానికి దోహదం చేశాయి. నా కుటుంబ విషయాలకు వస్తే... కవలలైన మా అమ్మాయిలు షమిత హళ్ళి, సహిత హళ్ళి కేవలం మూడేళ్ళలోనే సీఏ కోర్సు పూర్తి చేశారు. సహిత ఆస్ట్రేలియాలో ఎంఎన్‌సీ కంపెనీలో పని చేస్తోంది. షమిత బెంగళూరులోనే ఓ ప్రముఖ కంపెనీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తోంది. సమాజంలో ఆడపిల్లలు బాగా చదువుకోవాలి. సొంతంగా జీవనం సాగించే శక్తి కలిగి ఉండాలి. దానికి నా జీవితమే ఉదాహరణ అని నేను పాల్గొనే ప్రతి సభలోనూ చెబుతుంటాను. నా ద్వారా కొద్ది మందయినా స్ఫూర్తి పొందాలనేది నా ఆశయం."



● హిందూపురం రవి, బెంగళూరు

'ప్లానింగ్'లో పీజీ

దిక్సూచి



విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏవీ)- పీజీ ప్రోగ్రామ్‌లలో డైరెక్ట్ అడ్మిషన్స్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ విభాగాల్లో 12 రెగ్యులర్ సీట్లు; డిజైన్ విభాగంలో 13 రెగ్యులర్ సీట్లు, 12 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.

ఆర్కిటెక్చర్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్రోగ్రామ్‌లో సస్టయినబుల్ ఆర్కిటెక్చర్, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్, ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ ఆర్కిటెక్చర్ పూర్తి చేసి ఉండాలి. మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌కు(బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ/కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్/కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులై ఉండాలి. మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌కు బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, ఏడాది అనుభవం ఉన్నవారు; బ్యాచిలర్స్ డిగ్రీ(ఫైన్ ఆర్ట్స్/డిజైన్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ప్లానింగ్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ ప్రోగ్రామ్ ఉంది. ఇందులో ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ(ప్లానింగ్/ ఆర్కిటెక్చర్) లేదా (బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లకు మాస్టర్స్ డిగ్రీ(జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ) పూర్తిచేసిన అభ్యర్థులు; ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌కు మాస్టర్స్ డిగ్రీ(ఎకనామిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్స్ రీసెర్చ్) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అడ్మిషన్ ప్రక్రియ: అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. సంస్థ నిర్ణయం మేరకు ఇందులో అర్హత పొందినవారికి సంబంధించి స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ పరిశీలన, పోర్ట్‌ఫోలియో అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **వెబ్‌సైట్:** www.spav.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PoDek9Jలో చదవండి.

సింహం నక్కల మీదకు వస్తే వార్ అవదురా లఫూట్



నందమూరి బాలకృష్ణ దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఫస్ట్ గ్లింప్స్‌ను మహా శివరాత్రి సందర్భంగా విడుదల చేశారు. యాక్షన్ సీక్వెన్స్‌తో రూపొందించిన ఈ గ్లింప్స్‌లో బాలకృష్ణ కూల్‌గా, ప్రశాంతంగా కనిపిస్తూనే తనదైన శైలిలో పవర్‌ఫుల్ డైలాగ్‌తో అదరగొట్టారు. కొంతమంది గూండాలు తన వైపు పరిగెత్తుకుని వస్తుంటే బాలయ్య కూల్‌గా ఆల్కహాల్ తాగుతుండడం ఆకట్టుకుంది. 'ఎంట్రా వార్ డిక్లేర్ చేస్తున్నావా' అని వచ్చిన వాళ్లలో ఒకడు అడిగితే 'సింహం నక్కల మీదకు వస్తే వార్ అవదురా.. ఇట్స్ కాల్డ్ హంటింగ్' అంటూ పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పి బాలకృష్ణ వేట మొదలుపెట్టడం గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. ఈ గ్లింప్స్ బాలకృష్ణ అభిమానుల్ని, సినీ ప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఇందులో ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్. ఎస్. థమన్, ఫొటోగ్రఫీ: విజయ్ కార్తిక్, ఎడిటింగ్: నిరంజన్, సమర్పణ: శ్రీకర్ స్టూడియోస్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య.

భైరవుడై.. రక్షకుడై...



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'కల్కి 2898 ఏడీ'. మే 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం ఈ చిత్రం నుంచి ప్రభాస్ పాత్రను యూనిట్ పరిచయం చేసింది. భైరవగా సరికొత్త లుక్‌లో ప్రభాస్ అలరించారు. భవిష్యత్తులో కాశీ నగరంలో జరిగే కొన్ని సంఘటనల నేపథ్యంలో సాగిన ప్రత్యేక వీడియో సినిమాపై ఆసక్తిని పెంచింది. కాశీ ప్రజలను విలన్ల నుంచి కాపాడే రక్షకుడిగా ప్రభాస్ కనిపించారు. వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే నటిస్తున్నారు. కమల్‌హాసన్ ప్రతినాయక పాత్రలో అలరించనున్నారు. అమితాబ్‌బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఇటలీలో ప్రభాస్, దిశా పటానీపై ఓ పాటను చిత్రీకరిస్తున్నారు.

ధనుష్ కుబేర



జాతీయ అవార్డు చిత్రాల దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందిస్తున్న తాజా చిత్రానికి టైటిల్ నిర్ణయించారు. ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు 'కుబేర' అని పేరు పెట్టారు. మహాశివరాత్రి సందర్భంగా సినిమా టైటిల్ వెల్లడించి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అత్యంత సంపన్నుడైన దేవుడు కుబేరుడు. ఆయన పేరునే ఈ సినిమాకు పెట్టారు. కానీ విడుదల చేసిన పోస్టర్‌లో ధనుష్ లుక్ టైటిల్‌కు భిన్నంగా ఉంది. చిరిగిన బట్టలతో అన్నపూర్ణా దేవి నుంచి శివుడు భిక్ష తీసుకుంటున్న పెయింటింగ్ ముందు ధనుష్ నిలబడి కనిపించారు. దీంతో ఆయన పాత్ర ఎలా ఉంటుందో అనే ఆసక్తి పెరిగింది. అలాగే మరో కీలక పాత్ర పోషిస్తున్న నాగార్జున లుక్ ఎలా ఉంటుందా అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. రష్మిక ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు.

కాశీలో శివశక్తి



తమన్నా ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఇటీవలే కాశీలో చిత్రీకరణ ప్రారంభమైంది. అశోక్‌తేజ దర్శకత్వంలో డి. మధు నిర్మిస్తున్నారు. ఇందులో తమన్నా శివశక్తి అనే పాత్ర పోషిస్తున్నారు. శివరాత్రి సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నాగా సాధువు అవతారంలో తమన్నా సరికొత్తగా కనిపించారు. ఈచిత్రంలో హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్ సింహ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

అదిగో కన్నప్ప



పరమశివుని భక్తుడు కన్నప్ప జీవితగాథ ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'కన్నప్ప'. మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్నాడు. శివరాత్రి సందర్భంగా ఈ చిత్రం నుంచి కన్నప్ప పాత్రధారిగా విష్ణు ఫస్ట్‌లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. విల్లు ఎక్కుపెట్టిన భంగిమలో శక్తిమంతంగా కనిపించి ఆకట్టుకున్నారు. 'గొప్ప శివభక్తుని పాత్రలో నటించడం అదృష్టంగా భావిస్తున్నా. ఇదిగో మీ కన్నప్ప.. హర హర మహదేవ్' అని విష్ణు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ చిత్రానికి ముఖేశ్ కుమార్ దర్శకుడు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మించడంతో పాటు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభాస్ పరమశివుని పాత్ర పోషిస్తున్నారు. శరత్‌కుమార్, మోహన్‌లాల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

ఎనిమిది భాగాలుగా హాఫ్ లయన్



ప్రకాశ్ ఝా

దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితం ఆధారంగా ప్రముఖ ఓటీటీ సంస్థ 'ఆహా' 'హాఫ్ లయన్' పేరుతో వెబ్‌సిరీస్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. వినయ్ సీతాపతి రచన 'హాఫ్ లయన్' పుస్తకం దీనికి ఆధారం. ప్రకాశ్ ఝా దర్శకత్వంలో ఆహా స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సిరీస్ గురించి ఓ ఇంటర్వ్యూలో ప్రకాశ్ ఝా మాట్లాడుతూ 'పీవీ నరసింహారావు ప్రధానిగా తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు నన్ను బాగా ప్రభావితం చేశాయి. ఉమ్మడి ఆంధ్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా ఆయన జీవితంలోని కీలకఘట్టాలను స్పృశిస్తూ ఈ సిరీస్ సాగుతుంది. 'తెలుగువాళ్లు గర్వించే వ్యక్తి పీవీ, ఆయన బయోపిక్ చేద్దాం' అని నిర్మాత అల్లు అరవింద్ నన్ను కలిశారు. అలా ఈ ప్రాజెక్ట్ మొదలైంది' అని చెప్పారు. ఈ సిరీస్ ఎనిమిది ఎపిసోడ్లుగా ఉంటుంది, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పూర్తయింది అని ఆహా సహ వ్యవస్థాపకులు అజిత్ ఠాకూర్ చెప్పారు. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సిరీస్ తెరకెక్కిస్తున్నాం, త్వరలో నటీనటుల ఎంపిక ప్రారంభించి, ఈ ఏడాది ద్వితీయార్థంలో చిత్రీకరణ ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.

వారంటీ, సర్వీస్ సెంటర్లపై సమగ్ర వివరాలివ్వాల్సిందే..

నాలుగు రంగాలకు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ: ఆటోమొబైల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మొబైల్ అండ్ ఎలక్ట్రానిక్స్, వ్యవసాయ యంత్రాల తయారీ రంగ కంపెనీలు తాము విక్రయించే ఉత్పత్తులపై వారంటీతో పాటు సర్వీసింగ్ సెంటర్లకు సంబంధించి వినియోగదారులకు సమగ్ర వివరాలు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఉత్పత్తుల మరమ్మతులకు సంబంధించి ఫిర్యాదులు పెరిగిన నేపథ్యంలో వినియోగదారుల ప్రయోజనార్థం ప్రభుత్వం ఈ నిర్దేశకాలు జారీ చేసింది. ఉత్పత్తుల మరమ్మతులకు సంబంధించి వినియోగదారులను ఇబ్బందికి గురి చేస్తున్న ప్రస్తుత, కొత్త ఆందోళనలను పరిష్కరించేందుకు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ ఈ నాలుగు రంగాల ప్రతినిధులతో ఇదివరకే భేటీ అయ్యారు.

ఫారెక్స్ నిల్వల్లో భారీ వృద్ధి

ముంబై: భారత విదేశీ మారక (ఫారెక్స్) నిల్వల్లో భారీ వృద్ధి నమోదైంది. ఆర్‌బీఐ శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ నెల 1తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు మరో 655 కోట్ల డాలర్ల మేర పెరిగి మొత్తం 62,562.6 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. అంతక్రితం వారంలోనూ నిల్వలు 297 డాలర్లకు పైగా పెరిగాయి. 2021 అక్టోబరులో ఫారెక్స్ నిల్వలు ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయి 64,500 కోట్ల డాలర్లకు పెరిగాయి. కానీ, అంతర్జాతీయ ప్రతికూల పరిణామాలతో రూపాయి విలువ క్షీణతకు అడ్డుకట్ట వేసేందుకు ఆర్‌బీఐ మార్కెట్లోకి విరివిగా డాలర్లను విడుదల చేయాల్సి రావడంతో ఫారెక్స్ నిల్వలు మళ్లీ తగ్గుతూ వచ్చాయి.

ఎయిర్ ఇండియాలో విస్తారా విలీనానికి మార్గం సుగమం

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా-విస్తారా ఎయిర్‌లైన్స్ విలీనానికి రంగం సిద్ధమైంది. ఈ విలీనానికి కాంపిటిషన్ అండ్ కన్స్యూమర్ కమిషన్ ఆఫ్ సింగపూర్ (సీసీసీఎస్) ఆమోదం తెలిపింది. అయితే ఇందుకోసం కొన్ని షరతులు విధించింది. ఈ విలీనం విమానయాన రంగంలో గుత్తాధిపత్యానికి దోహదం చేయకూడదని స్పష్టం చేసింది. ఎయిర్ ఇండియా సీఈఓ, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ ఈ విషయం తెలిపారు. కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆరు నెలల క్రితమే ఈ విలీనానికి ఆమోదం తెలిపింది. దీంతో టాటా గ్రూప్ నిర్వహణలోని ఎయిర్ ఇండియా ఈక్విటీలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా లభిస్తుంది. ఈ విలీనంతో రెండు సంస్థల షెడ్యూల్స్, కాంట్రాక్టులు, విమానాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని విల్సన్ తెలిపారు.

'ఎన్నికల'పై ఎఫ్ఎంసీజీ కంపెనీల ఆశలు

రూ.5-10 ప్యాకెట్లకు పెరగనున్న డిమాండ్

ఉత్పత్తి, పంపిణీ పెంచుతున్న కంపెనీలు



న్యూఢిల్లీ: కొద్ది రోజుల్లో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రాబోతోంది. ఇందుకు అవసరమైన ఖర్చుల కోసం రాజకీయ పార్టీలు, పోటీపడే అభ్యర్థులు ఇప్పటికే సిద్ధమయ్యారు. వీరి ప్రచార సభలు, ర్యాలీలకు వచ్చే జనానికి మంచినీళ్ల ప్యాకెట్లు, చిన్న చిన్న బిస్కెట్ ప్యాకెట్లు, శీతల పానీయాల వంటి చిరుతిళ్లు, కానుకలు పంచేందుకు పార్టీలు సిద్ధమై పోయాయి. ఈ డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ఎఫ్ఎంసీజీ కంపెనీలూ సిద్ధమయ్యాయి. రూ.5 లేదా రూ.10 ధర ఉండే చిన్న చిన్న ప్యాకెట్లు, బాటిళ్లతో సిద్ధమవుతున్నాయి.

ఉత్పత్తి పెంపు: సాధారణ రోజుల్లో రూ.5 లేదా రూ.10 ప్యాకెట్లకు పెద్దగా డిమాండ్ ఉండదు. ఎన్నికల సమయంలోనే వీటికి డిమాండ్. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బిహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు ఇప్పటికే వేడెక్కాయి. దీంతో ఆయా రాష్ట్రాల్లో ఈ చిన్న ప్యాకెట్లు, బాటిళ్లకు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఇది మరింత పెరగనుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కంపెనీలు ఈ ప్యాకెట్ల ఉత్పత్తి, పంపిణీ 10 శాతం వరకు పెంచేశాయి. కంపెనీల సేల్స్ రిప్రజెంటేటివ్‌లు గ్రామీణ ప్రాంతాల్లో సైతం పెద్దఎత్తున పర్యటిస్తూ కిరాణా షాపుల్లో వీటి కొరత లేకుండా స్టాకులు పెంచుతున్నారు.'ర్యాలీలు ఎక్కువగా జరిగే హిందీ రాష్ట్రాల్లో చిన్న ప్యాకెట్లలో లభించే బిస్కెట్లు, స్నాక్స్‌కు ఇప్పటికే గిరాకీ పెరిగింది. దీంతో మామూలు రోజుల కంటే ఎన్నికల సమయంలో ఈ చిన్న ప్యాకెట్ల నిల్వలను 8 నుంచి 10 శాతం వరకు పెంచబోతున్నాం' అని ఒక కంపెనీ ఉన్నతాధికారి చెప్పారు. చిన్న చిన్న ప్యాకెట్లలో హెయిర్ ఆయిల్, షాంపూలు, పానీయాలు అమ్మే కంపెనీలదీ ఇదే పరిస్థితి.

చిన్న మొత్తాల పొదుపు రేట్లు యథాతథం

ఏప్రిల్-జూన్ త్రైమాసికానికీ ప్రస్తుత రేట్లే వర్తింపు



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో తొలి త్రైమాసికానికి చిన్న మొత్తాల పొదుపు పథకాల వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) నాలుగో త్రైమాసికానికి ప్రకటించిన వడ్డీ రేట్లు.. 2024-25 తొలి త్రైమాసికంలోనూ (ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు) యథాతథంగా కొనసాగుతాయని కేంద్ర ఆర్థిక శాఖ శుక్రవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రస్తుతం సుకన్య సమృద్ధి పథకంపై చెల్లించే వడ్డీ 8.2 శాతంగా ఉండగా.. మూడేళ్ల టర్మ్ డిపాజిట్‌తో పాటు పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ (పీపీఎఫ్) వడ్డీ రేటు 7.1 శాతంగా.. పొదుపు ఖాతాలోని సొమ్ముపై చెల్లించే వడ్డీ 4 శాతంగా ఉంది. అలాగే, కిసాన్ వికాస్ పత్రాలపై 7.5 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)పై 7.7 శాతం వడ్డీ లభించనుంది. ప్రస్తుత త్రైమాసికంలో లాగే వచ్చే క్వార్టర్‌లోనూ నెలవారీ ఆదాయ పథకంపై 7.4 శాతం వడ్డీ రాబడి సమకూరనుంది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కేంద్రం ప్రతి మూడు నెలలకు ఒకసారి చిన్న మొత్తాల పొదుపు రేట్లను సవరిస్తుంటుంది. 2022 మే నుంచి ఆర్‌బీఐ రెపో రేటును పలు విడతల్లో మొత్తం 2.5 శాతం పెంచింది. దాంతో రెపో రేటు 6.5 శాతానికి చేరుకుంది. తత్ఫలితంగా బ్యాంక్‌లు రుణాలతో పాటు పలు డిపాజిట్ పథకాలపై చెల్లించే వడ్డీ రేటును సైతం పెంచాయి. అయితే, ఆర్‌బీఐ గత ఐదు సమీక్షల్లో రెపో రేటును యథాతథంగా కొనసాగించింది.

రికార్డు స్థాయిలో 'సిప్' పెట్టుబడులు

రెండేళ్ల గరిష్ఠ స్థాయిలో ఈక్విటీ ఎంఎఫ్‌లు

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాల్లో పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. గత నెల (ఫిబ్రవరి) ఈ పథకాల్లో క్రమానుగత పెట్టుబడులు (సిప్) రికార్డు స్థాయిలో రూ.19,186 కోట్లకు చేరాయి. ఈ ఏడాది జనవరితో పోలిస్తే ఇది రూ.348 కోట్లు ఎక్కువ. ఇదే సమయంలో ఈక్విటీ ఎంఎఫ్‌ల పెట్టుబడులూ 23 నెలల గరిష్ఠ స్థాయి రూ.26,866 కోట్లుగా నమోదయ్యాయి. జనవరి నెలతో పోలిస్తే ఇది 23 శాతం ఎక్కువ. కొత్త ఫండ్స్, థిమాటిక్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెరగడం ఇందుకు ప్రధాన కారణమని దేశంలోని మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే యాంఫీ తెలిపింది. ఫిబ్రవరి నెల మొత్తం మీద ఎంఎఫ్ పరిశ్రమ రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. ఇందులో రూ.63,809 కోట్లు డెట్ ఫండ్స్ ద్వారా సమకూరితే, ఈక్విటీ ఫండ్స్ ద్వారా రూ.26,866 కోట్లు సమకూరాయి. హైబ్రిడ్ ఫండ్స్ ద్వారా మిగతా రూ..18,105 కోట్లు సమకూరాయి. దీంతో గత నెలాఖరు నాటికి ఎంఎఫ్‌ల నిర్వహణలోని పథకాల నికర పెట్టుబడుల విలువ రూ.54.54 లక్షల కోట్లకు చేరింది. జనవరితో పోలిస్తే ఇది రూ.1.8 లక్షల కోట్లు ఎక్కువ.

బ్యాంకింగ్ సిబ్బందికి ఏటా 17% వేతన పెంపు

ఐదు రోజుల పని దినాలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) సిబ్బంది కల నెరవేరనుంది. వారానికి ఐదు రోజుల పని దినాల కోసం వారు చేస్తున్న విజ్ఞప్తి ఫలించనుంది. జీతాల సవరణ కోసం ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ), బ్యాంకింగ్ యూనియన్ల మధ్య జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరింది. వీరి జీతాలనూ ఏటా 17 శాతం చొప్పున పెంచేందుకూ ఐబీఏ అంగీకరించింది. ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. 2022 నవంబరు నుంచి అమలయ్యే ఈ నిర్ణయం వల్ల, దాదాపు ఎనిమిది లక్షల మంది పీఎస్‌బీ సిబ్బందికి మేలు జరగనుంది. జీతాల సవరణతో పీఎస్‌బీలపై ఏటా రూ.8,284 కోట్ల అదనపు భారం పడుతుందని అంచనా. మెడికల్ సర్టిఫికెట్ లేకుండా మహిళా ఉద్యోగులు నెలకు ఒక సిక్ లీవ్ పెట్టుకునేందుకూ ఐబీఏ అంగీకరించింది.

కార్పొరేట్ బోర్డుల్లో పెరిగిన 'మహిళా' స్వామ్యం

న్యూఢిల్లీ: జనాభాలో అర్ధభాగానికి పైబడి తామే ఉన్నప్పటికీ వ్యాపార, పారిశ్రామిక విభాగాల్లో మాత్రం తమ పాత్ర పరిమితమేనన్నది పలువురు మహిళల ఫిర్యాదు. కానీ డెలాయిట్ గ్లోబల్ బోర్డ్‌రూమ్ ప్రోగ్రామ్ నిర్వహించిన సర్వే ప్రకారం కార్పొరేట్ బోర్డుల్లో మహిళా డైరెక్టర్ల సంఖ్య గత ఐదేళ్ల కాలంలో క్రమంగా పెరుగుతూ ఇప్పుడు 18.3 శాతానికి చేరింది. అయితే ప్రపంచ సగటు 23.3 శాతంతో పోల్చితే మాత్రం మన దేశంలో కార్పొరేట్ మహిళా డైరెక్టర్ల సంఖ్య ఇంకా తక్కువగానే ఉంది. 50 దేశాలకు చెందిన 18,000 కంపెనీల్లో ఈ సర్వే నిర్వహించారు. భారత్ నుంచి 400 కంపెనీలు వాటిలో ఉన్నాయి.

నివేదిక ముఖ్యాంశాలు...

- 2018 నాటికి మహిళా డైరెక్టర్ల సంఖ్య 13.8 శాతం కాగా 2021 నాటికి 17.1 శాతానికి, 2023 నాటికి 18.3 శాతానికి పెరిగింది.
- 2022 నుంచి మహిళా డైరెక్టర్ల సంఖ్య 3.6 శాతం పెరిగింది. దీని ప్రకారం చూస్తే 2038 నాటికి బోర్డుల్లో మహిళా డైరెక్టర్ల సంఖ్య పురుషులతో సమానం అవుతుంది. గతంలో ప్రకటించిన అంచనా 2045తో పోల్చితే ఏడు సంవత్సరాల ముందే ఈ గమ్యం సాధ్యమవుతుంది.
- 2018 సంవత్సరంతో పోల్చితే డైరెక్టర్ల బోర్డుకు చైర్‌పర్సన్‌గా వ్యవహరించే మహిళల సంఖ్య 2023 నాటికి 4.5 శాతం నుంచి 4.1 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో సీఈఓలుగా సారథ్య బాధ్యతలు నిర్వహించే మహిళల సంఖ్య మాత్రం 3.4 శాతం నుంచి 5.1 శాతానికి పెరిగింది.
- రంగాలవారీగా ధోరణులు పరిశీలించినట్టయితే 21.3 శాతం మహిళా డైరెక్టర్లతో లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్ రంగం అగ్రస్థానంలో ఉంది. టెక్నాలజీ, మీడియా, టెలికాం (20.5 శాతం), కన్స్యూమర్ బిజినెస్ (19.7 శాతం), తయారీ (17.4 శాతం), ఆర్థిక సర్వీసులు (16.9 శాతం) తర్వాతి స్థానాల్లో టాప్ 5లో ఉన్నాయి.



మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు నిధుల కటకట

ఆర్థిక స్వతంత్రం, సాధికారత కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా భారతదేశంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లోకి ప్రవేశిస్తున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. విభిన్న రంగాలకు చెందిన పరిశ్రమల్లో మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల సంఖ్య పెరుగుతున్నప్పటికీ విభిన్న అంశాల్లో వారు పలు సవాళ్లు ఎదుర్కొంటున్నారు. చక్కని నైపుణ్యాలు, నవ్య ఆలోచనా ధోరణులు ఉన్నప్పటికీ ఇన్వెస్టర్ విశ్వాసం పొందడంలోను, నిధుల సమీకరణలోను వారు తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా నిధుల కల్పనలో లింగవివక్ష అధికంగా ఉన్నట్టు పలు సర్వేలు తేల్చాయి. సుమారు 62 శాతం మంది మహిళలు ఈ వివక్షను అనుభవిస్తున్నారు. ఈ వ్యత్యాసాన్ని పూడ్చి పెరుగుతున్న పోటీ వాతావరణంలో మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ప్రకాశించాలంటే మరిన్ని మద్దతు వ్యవస్థలను తీసుకురావలసిన అవసరం ఉన్నదని పలువురు అంటున్నారు. మహిళా నాయకత్వాన్ని అభివృద్ధి చేయడంపై అధిక మొత్తాల్లో ఇన్వెస్ట్ చేయడం అనేది నోటిమాటకే పరిమితం కాకూడదని, మహిళల ఉమ్మడి సామర్థ్యాలను వెలికి తీయడంలో కీలకమైన అడుగు కావాలని గ్రేట్ ప్లేసెస్ టు వర్క్ సీఈఓ యశస్విని రామస్వామి అన్నారు. మహిళలు ఇంటి సంరక్షణ బాధ్యతలతో పాటు వృత్తిపరమైన ఆకాంక్షలు నెరవేర్చుకునేందుకు మద్దతు అవసరమన్నారు.

ఇన్ఫీలో సుధా మూర్తి వాటా విలువ రూ.5,600 కోట్లు

కంపెనీలో ఆమె పేరిట 0.83 శాతం వాటా



న్యూఢిల్లీ: రాజ్యసభకు ఎంపికైన సుధా మూర్తి దేశీయ ఐటీ దిగ్గజ కంపెనీ ఇన్ఫోసిస్‌లో 0.83 శాతం వాటాకు సమానమైన 3.45 కోట్ల షేర్లను కలిగి ఉన్నారు. కంపెనీ షేరు ప్రస్తుత ధర ప్రకారం ఈ వాటా విలువ దాదాపు రూ.5,600 కోట్లు. ఇన్ఫోసిస్ సహ-వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణ మూర్తి భార్యే సుధా మూర్తి. బ్రిటన్ ప్రస్తుత ప్రధాని రుషి సునాక్‌కు అత్తగారు కూడా. పలు పుస్తకాల రచయిత, దాతృత్వమూర్తి అయిన 73 ఏళ్ల సుధా మూర్తి ప్రస్తుతం మూర్తి ట్రస్ట్‌కు చైర్‌పర్సన్‌గా ఉన్నారు. సుధా మూర్తికి 2006లో పద్మశ్రీ అవార్డు దక్కింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆమెకు పద్మ భూషణ్ పురస్కారాన్ని సైతం ప్రకటించింది. కాగా, ఇన్ఫోసిస్‌లో నారాయణ మూర్తి రూ.2,691 కోట్ల విలువైన 1.66 కోట్ల ఈక్విటీ షేర్లు కలిగి ఉన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	65,730 ▲	60,250 ▲	79,000 ▲
ముంబై	64,955 ▲	59,499 ▲	72,265 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ		విజయవాడ	463
హైదరాబాద్	469	విశాఖపట్నం	475
9వ తేదీ		వరంగల్	471
చిత్తూరు	523	దజను గుడ్లు రూ.72	
గోదావరి	463		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	107	గోదావరి	114
వరంగల్	107	విజయవాడ	114
కరీంనగర్	107	గుంటూరు	114
మహబూబ్‌నగర్	107	ఒంగోలు	114
కర్నూలు	107	చిత్తూరు	110
విశాఖపట్నం	113		

వారెవా..దీప్తి



దీప్తి శర్మ (59 రన్స్, 4/19)

- ఆల్‌రౌండ్ షోతో అదుర్స్
- ఈ సీజన్‌లో తొలి హ్యాట్రిక్ నమోదు
- ఢిల్లీపై పరుగు తేడాతో యూపీ గెలుపు

సంక్షిప్త స్కోర్లు

యూపీ: 20 ఓవర్లలో 138/8 (దీప్తి 59, హీలీ 29, రాధా 2/16, టిటాస్ 2/23).
ఢిల్లీ: 19.5 ఓవర్లలో 137 ఆలౌట్ (లానింగ్ 60, దీప్తి 4/19, హ్యారిస్ 2/8, సైమా 2/13).

నేటి మ్యాచ్
ముంబై x గుజరాత్
రాత్రి 7.30 గం. నుంచి

న్యూఢిల్లీ: చావో రేవో తేల్చుకోవాల్సిన కీలక పోరులో యూపీ వారియర్స్ అదరగొట్టింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో భాగంగా శుక్రవారం అత్యంత ఉత్కంఠగా సాగిన లోస్కోరింగ్ మ్యాచ్‌లో యూపీ ఒక్క పరుగు తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి ప్లేఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. 139 పరుగుల స్వల్ప ఛేదనలో ఢిల్లీ 19.5 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌటైంది. ఢిల్లీ జట్టులో కెప్టెన్ మెగ్ లానింగ్ (60) మినహా అంతా విఫలమయ్యారు. జెమీమా 17, షఫాలీ 15, క్యాప్సీ 15 రన్స్ చేశారు. యూపీ కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి ఢిల్లీ చివరి రెండు ఓవర్లలో ఏకంగా ఆరు వికెట్లు సమర్పించుకుంది. 19వ ఓవర్‌లో దీప్తి 5 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీసింది ఇక, ఆఖరి ఓవర్ చివరి నాలుగు బంతుల్లో రెండు పరుగులు చేయాల్సిన దశలో ఢిల్లీ మిగతా మూడు వికెట్లు కోల్పోయి భారీ మూల్యం చెల్లించుకుంది. యూపీ బౌలర్లలో దీప్తి శర్మ (4/19) హ్యాట్రిక్ సహా నాలుగు వికెట్లు పడగొట్టగా.. హ్యారిస్, సైమా ఠాకూర్ చెరో 2 వికెట్లు తీశారు. అంతకుముందు యూపీ 20 ఓవర్లలో 8 వికెట్లకు 138 రన్స్ చేసింది. దీప్తి శర్మ (59) అర్ధ సెంచరీతో సత్తా చాటగా, కెప్టెన్ అలిసా హీలీ (29) ఫర్వాలేదనిపించింది. ఆల్‌రౌండ్ షోతో అలరించిన దీప్తి శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది. ఈ సీజన్‌లో హ్యాట్రిక్ తీసిన తొలి ప్లేయర్‌గా దీప్తి రికార్డుకెక్కింది. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన రెండో ప్లేయర్ దీప్తి. గతేడాది ఇస్సీ వాంగ్ (ముంబై తరఫున) తొలి హ్యాట్రిక్ నమోదు చేసింది. ఇక ఈ టోర్నీలో అతి తక్కువ స్కోరును కాపాడుకున్న తొలి జట్టుగా యూపీ నిలిచింది.

సింధు ఇంటికి

- సాత్విక్ జోడీ సెమీస్‌కు
- లక్ష్యసేన్ కూడా

పారిస్: స్టార్ షట్లర్ పీవీ సింధుకు ఫ్రెంచ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. క్వార్టర్‌ఫైనల్లో ఒలింపిక్ చాంపియన్ చెన్ యు ఫీ (చైనా)తో జరిగిన హోరాహోరీ పోరులో పరాజయం పాలైంది. శుక్రవారం దాదాపు గంటన్నరపైగా సాగిన మ్యాచ్‌లో సింధు 24-22, 17-21, 18-21తో రెండోసీడ్, డిఫెండింగ్ చాంప్ చెన్ యు ఫీకి తలొగ్గింది. ఇక, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి జోడీ సెమీఫైనల్ చేరింది. క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్/చిరాగ్ 21-19, 21-13తో థాయ్‌లాండ్ ద్వయం సుపక్ జామ్‌కో/కిట్టినుపాంగ్‌ను చిత్తుచేసింది. ఫైనల్ బెర్త్ కోసం కొరియా జోడీ హ్యాక్/సియో సెంగ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ కూడా సెమీఫైనల్లో ప్రవేశించాడు. క్వార్టర్స్‌లో లక్ష్య సేన్ 19-21, 21-15, 21-13తో ప్రపంచ మాజీ విజేత లో కీన్ యే (సింగపూర్)పై గెలిచాడు.

హాజెల్‌వుడ్ 'పాంచ్'

న్యూజిలాండ్ 162 ఆలౌట్

క్రైస్ట్‌చర్చ్: ఆస్ట్రేలియాతో శుక్రవారం మొదలైన రెండో టెస్టులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. పేసర్లు హాజెల్‌వుడ్ (5/31), స్టార్క్ (3/59) ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ లాథమ్ (38) ఫర్వాలేదనిపించాడు. వందో టెస్టు ఆడుతున్న కేన్ విలియమ్సన్ (17) కూడా నిరాశపరిచాడు. 107 రన్స్‌కే 8 వికెట్లు కోల్పోయిన దశలో హెన్రీ (29), సౌథీ (26) ఆదుకోవడంతో జట్టు ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. అయితే కివీస్‌ను తక్కువ స్కోరుకే అవుట్ చేశామన్న ఆనందం కంగారూలకు ఎంతోసేపు మిగల్లేదు. మొదటి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్ తొలిరోజు ఆట ముగిసేసరికి 124/4 స్కోరు చేసింది. లబుషేన్ (45), లియాన్ (1) క్రీజులో ఉన్నారు.

ప్రీక్వార్టర్స్‌లో నిషాంత్

బస్టో ఆర్సిజియో (ఇటలీ): ప్రపంచ ఒలింపిక్ బాక్సింగ్ క్వాలిఫయర్‌లో భారత బాక్సర్ నిషాంత్ దేవ్ ప్రీక్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన 71 కిలోల విభాగం రెండో రౌండ్‌లో నిషాంత్ 5-0తో మదీవ్ ఎస్కేర్ ఖాన్ (జార్జియా)ను చిత్తుగా ఓడించాడు. ప్రీక్వార్టర్స్ బౌట్ ఆదివారం జరగనుంది. ఇతర బౌట్లలో అంకుషిత బోరో (66 కి) 2-3తో సోన్విక్ ఎమిలీ (ఫ్రాన్స్) చేతిలో, సంజీత్ (92 కి.) 0-5తో ఐబెక్ ఒరల్బె (కజకిస్థాన్) చేతిలో ఓడి తొలిరౌండ్లోనే వెనుదిరిగారు.

వినూత్నంగా ఒలింపిక్ వేడుకలు

పారిస్: ఒలింపిక్ క్రీడల చరిత్రలోనే తొలిసారిగా ఆరంభ వేడుకలను స్టేడియం బయట నిర్వహిస్తున్నారు. వచ్చే జూన్ 26న పారిస్ ఒలింపిక్స్ ఆరంభ వేడుకలను వినూత్నంగా పారిస్‌లోని సీన్ నదిపై గల ఆస్టర్‌లిజ్ వంతెనపై సూర్యాస్తమయం వేళ నిర్వహించనున్నారు. ఇందులో 10 వేల 500 మంది అథ్లెట్లు పాల్గొననున్నారు. వీరంతా నదిలో 160 నౌకలపై ఆరు కిలోమీటర్ల మేర ప్రయాణించి, పరేడ్ చేయనున్నారు. క్రీడల విస్తృతిని చాటాలనే ఉద్దేశంతో ఈ విధంగా బహిరంగ ప్రదేశంలో సహజ వెలుగుల మధ్య ఆరంభ వేడుకలను జరుపుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ప్రజ్ఞానందకు నాలుగో స్థానం

ప్రాగ్ (చెక్ రిపబ్లిక్): ప్రాగ్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నీని ప్రజ్ఞానంద నాలుగో స్థానంతో ముగించాడు. శుక్రవారం జరిగిన ఆఖరిదైన 9వ రౌండ్‌లో స్థానిక జీఎం డేవిడ్‌తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. అబ్దుసత్తోరోవ్ (ఉజ్బెకిస్థాన్) 6.5 పాయింట్లతో విజేతగా నిలవగా, నుయెన్ (చెక్ రిపబ్లిక్) 5 పాయింట్లతో రెండోస్థానంలో నిలిచాడు. పర్హామ్ (ఇరాన్), ప్రజ్ఞానంద 5 పాయింట్లతో నుయెన్‌తో సమంగా నిలిచినా, తక్కువ టైబ్రేక్ స్కోరుతో 3, 4 స్థానాలకు పరిమితమయ్యారు. గుకేష్, విదిత్ 7, 10 స్థానాల్లో నిలిచారు.

ధర్మశాలలో దంచేశారు

భారత్ తొలి ఇన్నింగ్స్ 473/8
ప్రస్తుత ఆధిక్యం 255



రోహిత్, గిల్ శతకాలు

దేవ్‌దత్, సర్ఫరాజ్ హాఫ్ సెంచరీలు

ఇంగ్లండ్‌తో ఐదో టెస్టు


గిల్ (110)
రోహిత్ శర్మ (103)

ధర్మశాల: ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదో టెస్టులో రెండో రోజు టీమిండియా 'టాప్'షోతో అలరించింది. ప్రత్యర్థి బౌలర్లను ఆటాడుకుంటూ భారత బ్యాటర్లు పరుగుల వరద పారించారు. శుభ్‌మన్ గిల్ (110), కెప్టెన్ రోహిత్ శర్మ (103) సెంచరీలతో సత్తా చాటుకున్నారు. ఆ తర్వాత అరంగేట్ర బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కళ్ (65) తన రంజీ ఫామ్‌ను కొనసాగించగా.. సర్ఫరాజ్ (56) మరోసారి దూకుడు ప్రదర్శించాడు. ఇలా టాప్-5 ఆటగాళ్లంతా 50+ పరుగులతో ఇంగ్లండ్‌ను అల్లాడించారు. దీంతో శుక్రవారం ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 120 ఓవర్లలో 8 వికెట్లకు 473 పరుగుల భారీ స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 255 రన్స్ ఆధిక్యంలో కొనసాగుతోంది. అయితే క్రీజులో ఉన్న కుల్దీప్ (27 బ్యాటింగ్), బుమ్రా (19 బ్యాటింగ్) 108 బంతులను ఎదుర్కొని జట్టును ఆలౌట్ కాకుండా కాపాడారు. అలాగే తొమ్మిదో వికెట్‌కు అజేయంగా 45 పరుగులు జత చేయడం విశేషం. శనివారం తొలి సెషన్‌లో ఈ జోడీ ఎంతసేపు నిలుస్తుందనే దానిపై భారత్ ఆధిక్యం ఆధారపడి ఉంటుంది.

సెంచరీల జోరు: 135/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజును ఆరంభించగా.. రోహిత్, గిల్ మరో వికెట్ కోల్పోకుండా సెంచరీలతో సెషన్‌ను ముగించారు. అలాగే 46 పరుగుల ఆధిక్యం లభించింది. ఇక ఈ ఇద్దరినీ విడదీసేందుకు బౌలర్లు ఎంతగా ప్రయత్నించినా నిరాశే ఎదురైంది. బషీర్ ఓవర్లలో రోహిత్‌ను కట్టడి చేసేందుకు లెగ్ స్లిప్‌లో ఫీల్డింగ్ పెట్టగా.. ఉడ్ షార్ట్‌బాల్స్‌తో ప్రయత్నించాడు. అలాగే లెగ్ సైడ్‌లో ఆరుగురు ఫీల్డర్లను మోహరించినా ఇద్దరు బ్యాటర్లు ఇబ్బంది లేకుండా సెషన్‌లో 129 రన్స్ రాబట్టారు. రోహిత్ తొలిరోజే ఫిఫ్టీ పూర్తి చేయగా.. గిల్ 26 పరుగులతో రెండో రోజును ఆరంభించాడు. అండర్సన్ ఓవర్‌లో 6,4.. ఉడ్ ఓవర్‌లో 4,4తో జోరు కనబరుస్తూ వేగంగా ఆడాడు. దీంతో రోహిత్ సెంచరీ పూర్తయిన రెండో బంతికే గిల్ కూడా శతకం అందుకున్నాడు.

పడిక్కళ్, సర్ఫరాజ్ దూకుడు: టీ బ్రేక్ ఆరంభంలోనే వరుస ఓవర్లలో రోహిత్‌ను స్టోక్స్ గిల్‌ను అండర్సన్ క్లీన్ బౌల్డ్ చేశారు. దీంతో రెండో వికెట్‌కు 171 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. అయితే అరంగేట్ర బ్యాటర్ దేవ్‌దత్, సర్ఫరాజ్ అంత సులువుగా లొంగలేదు. మూడో వికెట్‌కు 97 పరుగులు జోడించారు. ఫోర్‌తో టెస్టుల్లో పరుగుల ఖాతాను తెరిచిన పడిక్కళ్.. అండర్సన్ ఓవర్‌లో అయితే మూడు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. అంతేకాకుండా తన తొలి 30 పరుగుల్లో 7 ఫోర్లు ఉండడం విశేషం. ఇక సర్ఫరాజ్ ఆరంభంలో నెమ్మదిగా ఆడి 30 బంతుల్లో 9 పరుగులే చేసినా.. హార్ట్‌లీ ఓవర్‌లో 2 ఫోర్లతో టచ్‌లోకి వచ్చాడు. పేసర్ ఉడ్‌ను కూడా వదల్లేదు. సులువుగా బౌండరీలు బాదేస్తూ మరో 25 బంతుల్లోనే తన ఫిఫ్టీని పూర్తి చేశాడు.

ఐదు వికెట్లు ఫట్: ఆఖరి సెషన్‌లో భారత తడబడి ఐదు వికెట్లను కోల్పోయింది. తొలి బంతికే సర్ఫరాజ్‌ను స్పిన్నర్ బషీర్ అవుట్ చేశాడు. ఆ తర్వాత సిక్సర్‌తో అర్ధసెంచరీ సాధించిన దేవ్‌దత్, జురెల్ (15)లను కూడా బషీర్ పెవిలియన్‌కు చేర్చాడు. మరోవైపు 102వ ఓవర్‌లో జడేజా (15), అశ్విన్ (0) వికెట్లను హార్ట్‌లీ పడగొట్టాడు. ఇలా ఒక్క పరుగు వ్యవధిలో భారత్ మూడు వికెట్లు కోల్పోగా అప్పటికి స్కోరు 428/8. ఇంకా రోజు ముగిసేందుకు 18 ఓవర్లతో పాటు చేతిలో రెండు వికెట్లే ఉండడంతో ఆలౌట్ ఖాయమే అనిపించింది. కానీ కుల్దీప్ సిసలైన బ్యాటర్‌గా క్రీజులో నిలవగా, అతడికి బుమ్రా సహకరిస్తున్నాడు. ఈ ఇద్దరూ ఏకాగ్రతతో ఆడి మరో వికెట్ కోల్పోకుండా రెండో రోజును ముగించారు.

1 ఇంగ్లండ్‌పై ఎక్కువ టెస్టు సెంచరీలు (4) సాధించిన భారత ఓపెనర్‌గా గవాస్కర్‌తో కలిసి టాప్‌లో ఉన్న రోహిత్.

3 భారత్ తరఫున అత్యధిక అంతర్జాతీయ సెంచరీలు (48) సాధించిన మూడో బ్యాటర్‌గా ద్రవిడ్ సరసన రోహిత్. సచిన్ (100), విరాట్ (80) ముందున్నారు. అలాగే వార్నర్ (49), సచిన్ (45) తర్వాత 43 శతకాలతో మూడో ఓపెనర్‌గా నిలిచాడు.

ఆ విషయం చెప్పకపోతేనే మంచిది

రెండో రోజు బ్యాటింగ్‌లో గిల్‌కు పేసర్ అండర్సన్ మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగింది. అతడి ఓవర్‌లో గిల్ భారీ సిక్సర్ బాదాక ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే ఆ సమయంలో తమ ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను వెల్లడించకుండా ఉంటేనే మంచిదని మ్యాచ్ ముగిశాక గిల్ తెలిపాడు. ఇక తన ఆటతీరు చూశాక తండ్రి లఖ్విందర్ సంతోషించి ఉంటాడన్నాడు.

4 ఒకే ఇన్నింగ్స్‌లో భారత టాప్-5 బ్యాటర్లు 50+ స్కోర్లు సాధించడం ఇది నాలుగోసారి. గతంలో ఆసీస్, కివీస్, శ్రీలంకపై ఈ ఫీట్ నమోదు చేశారు.

50 ఇంగ్లండ్ పేసర్ అండర్సన్‌కు టెస్టుల్లో ధర్మశాల 50వ వేదిక.

స్టోక్స్ మ్యాజిక్



సుమారు ఎనిమిది నెలల తర్వాత బంతి చేతపట్టిన ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తొలి ఓవర్‌లోనే అబ్బురపరిచాడు. రెండో రోజు తొలి సెషన్‌లో పేసర్లు, స్పిన్నర్లు అంతా తేలిపోవడంతో వారికి ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఇక తప్పదనుకున్న స్టోక్స్ రెండో సెషన్‌ను తనే ఆరంభించాడు. అయితే తాను వేసిన మొదటి బంతికే సెంచరీ మీదున్న రోహిత్‌ను బౌల్డ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అతడు విసిరిన గుడ్‌లెంగ్త్ బాల్ రోహిత్‌ను ఏమార్చుతూ వికెట్‌ను ఎగరగొట్టింది. దీంతో ఈ మ్యాజిక్ బాల్‌కు రోహిత్ సైతం అవాక్కవుతూ పెవిలియన్ చేరాడు. అటు స్టోక్స్ సహచరులు కూడా నమ్మలేని విధంగా చూస్తూ అతడిని అభినందించారు.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 218; భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (స్టంప్) ఫోక్స్ (బి) బషీర్ 57; రోహిత్ (బి) స్టోక్స్ 103; గిల్ (బి) అండర్సన్ 110; దేవ్‌దత్ (బి) బషీర్ 65; సర్ఫరాజ్ (సి) రూట్ (బి) బషీర్ 56; జడేజా (ఎల్బీ) హార్ట్‌లీ 15; జురెల్ (సి) డకెట్ (బి) బషీర్ 15; అశ్విన్ (బి) హార్ట్‌లీ 0; కుల్దీప్ (బ్యాటింగ్) 27; బుమ్రా (బ్యాటింగ్) 19; **ఎక్స్‌ట్రాలు:** 6; **మొత్తం:** 120 ఓవర్లలో 473/8. **వికెట్ల పతనం:** 1-104, 2-275, 3-279, 4-376, 5-403, 6-427, 7-427, 8-428; **బౌలింగ్:** అండర్సన్ 14-1-59-1; ఉడ్ 15-1-89-0; హార్ట్‌లీ 39-3-126-2; బషీర్ 44-5-170-4; స్టోక్స్ 5-1-17-1; రూట్ 3-0-8-0.

బీఆర్‌ఎస్‌లోనే ఉంటా..

- పార్టీ మారతాననే ప్రచారం అవాస్తవం!
- నా కుమారుడికి మల్కాజిగిరి ఎంపీ టికెట్ వద్దు
- కేటీఆర్‌కు మాజీ మంత్రి మల్లారెడ్డి స్పష్టీకరణ



హైదరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్న ప్రచారం నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధిష్ఠానం అప్రమత్తమైంది. మల్లారెడ్డిని పిలిపించుకుని మాట్లాడింది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నివాసంలో శుక్రవారం కేటీఆర్‌తో మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి సమావేశమయ్యారు. పార్టీ మార్పు అంశం, మల్కాజిగిరి ఎంపీ టికెట్ కేటాయింపు, మర్రి రాజశేఖర్‌రెడ్డి కళాశాల భవనం కూల్చివేతతో పాటు పలు అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తిలేదని, కేసీఆర్ వెంటే నడుస్తానని మల్లారెడ్డి ఈ సందర్భంగా చెప్పినట్లు తెలుస్తోంది. పార్టీ మారుతున్నానన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేయడమే కాక.. తన కుమారుడికి మల్కాజిగిరి ఎంపీ సీటు వద్దని, వేరే ఎవరికైనా ఇవ్వాలని కేటీఆర్‌తో మల్లారెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కాలేజీ భవనాల కూల్చివేతపై మాట్లాడేందుకే సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసినట్లు మల్లారెడ్డి వివరణ ఇచ్చినట్లు తెలిసింది. కాగా, బీఆర్‌ఎస్ నుంచి మల్కాజిగిరి టికెట్ ఇవ్వకపోయినా.. తన కుమారుడు బరిలో ఉంటారని మల్లారెడ్డి గతంలో వ్యాఖ్యానించారు. అలాంటిది ప్రస్తుత నిర్ణయం వెనుక వేరే ఉద్దేశం ఉండి ఉంటుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే, మల్లారెడ్డి పార్టీ మారనని అధిష్ఠానానికి చెప్పినప్పటికీ.. దానిని నమ్మలేమని బీఆర్‌ఎస్ వర్గాలు అంటున్నాయి.

బీజేపీలోకి జలగం వెంకట్రావు, సీతారాం నాయక్!

- జలగం కోసం రంగంలోకి మాజీ సీఎం
- ఖమ్మం నుంచి పోటీకి దింపాలని యోచన
- సీతారానాయక్‌కు కిషన్ రెడ్డి ఆహ్వానం

హైదరాబాద్, వరంగల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక సీట్లు సాధించాలనే లక్ష్యంతో బీజేపీ నాయకత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇతర పార్టీలకు చెందిన కీలక నేతలను కాషాయ దళంలోకి చేర్చుకునే ప్రయత్నాలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, బీఆర్‌ఎస్ నేత సీతారాంనాయక్ త్వరలో బీజేపీలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టిన బీజేపీ.. లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి జలగం వెంకట్రావును బరిలోకి దించాలని భావిస్తుంది. ఇందుకు సంబంధించి ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి.. జలగం వెంకట్రావుతో సమావేశమై చర్చలు జరిపినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. వెంకట్రావు చేరికపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని సమాచారం. మరోవైపు, బీఆర్‌ఎస్ సీనియర్ నేత అజ్మీరా సీతారాంనాయక్ బీజేపీలో చేరడం ఖాయమైంది. శుక్రవారం హనుమకొండలోని సీతారాంనాయక్ ఇంటికెళ్లిన కిషన్‌రెడ్డి.. బీజేపీలోకి రావాలని ఆయన్ను ఆహ్వానించారు. 2014లో బీఆర్‌ఎస్ తరఫున మహబూబాబాద్ ఎంపీగా గెలిచిన సీతారాంనాయక్‌కు 2019లో పార్టీ టికెట్ నిరాకరించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో





ములుగు టికెట్ కేటాయించాలని సీతారాం కోరినా.. నిరాశే మిగిలింది. తాజాగా.. మహబూబాబాద్ ఎంపీ టికెట్‌ను సిటింగ్ ఎంపీ మాలోతు కవితకే బీఆర్‌ఎస్ కేటాయించింది. దీంతో తీవ్ర నిరాశకు గురైన సీతారాంనాయక్ బీజేపీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కిషన్‌రెడ్డి ఆయన్ను స్వయంగా కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ విషయమై సీతారాం మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో అనేక అవమానాలు ఎదుర్కొన్నానని, కనీసం గౌరవం లేని చోట ఎలా ఉండగలమని ప్రశ్నించారు. కార్యకర్తలతో చర్చించిన తర్వాత బీజేపీలో చేరికపై స్పష్టత ఇస్తానని చెప్పారు. స్పష్టం చేశారు.

టచ్ చేస్తే మేమేంటో చూపిస్తాం

- కాంగ్రెస్ జోలికొస్తే కేసీఆర్ ఫాంహౌస్ గడీని బద్దలుకొడతాం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం జోలికి వస్తే మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌజ్ గడీని బద్దలు కొడతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టచ్ చేస్తే తమ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం నల్లగొండలోని పానగల్ ఛాయాసోమేశ్వరాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత నల్లగొండలో భూగర్భ డ్రైనేజీ, గుర్రంపోడు, మిర్యాలగూడలో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము తలుచుకుంటే బీఆర్‌ఎస్‌లో 'ఆ ముగ్గురు' తప్ప ఎవరూ మిగలరనే విషయాన్ని కేటీఆర్ గుర్తుంచుకోవాలన్నారు. కాళేశ్వరంలో మూడు పిల్లర్లే కుంగాయని కేటీఆర్ మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తోందని, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్‌ఎల్‌బీసీని ఉద్దేశ్యపూర్వకంగా పక్కన పెట్టిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ పథకానికి రూ.2,200 కోట్లు కేటాయించామని, రెండున్నరేళ్లలో పథకాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు.

సిలిండర్ ధర తగ్గింపు మహిళలకు వరం

- బీజేపీ నేతలు లక్ష్మణ్, బండి సంజయ్

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గిస్తూ ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా మహిళలకు వరం అని బీజేపీ ఎంపీలు కె.లక్ష్మణ్, బండి సంజయ్ కొనియాడారు. ఈ మేరకు వారు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఉజ్వల యోజన లబ్ధిదారులకు రూ. 300 సబ్సిడీని 2025 మార్చి వరకు కేంద్రం పొడిగించిందని, అలాగే ఉజ్వలేతర గ్యాస్ సిలిండర్లపై రూ. 100 తగ్గించడం సంతోషకరమని అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్, గేట్స్ ఫౌండేషన్ ప్రజా ఆరోగ్య విభాగాల్లో కీలక పాత్ర పోషిస్తున్న సుధామూర్తిని రాజ్యసభకు నామినేట్ చేయడం మహిళలంతా గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు.

'గురుకుల' నియామకాలు పారదర్శకమే: ట్రిబ్

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గురుకుల ఉపాధ్యాయుల నియామకాలలో ఎలాంటి గందరగోళం జరగలేదని తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామక బోర్డు(ట్రిబ్) అధికారులు స్పష్టంచేశారు. 9,210 పోస్టుల భర్తీకి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించామని, అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీగా ధ్రువపత్రాల పరిశీలన జరిపామని పేర్కొన్నారు. రిలిక్విష్‌మెంట్ విధానాన్ని 2018లో అప్పటి ప్రభుత్వం తొలగించిందని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వెయిటింగ్, రెండవ జాబితా పద్ధతిని 1998లోనే రద్దు చేశారని అధికారులు తెలిపారు. నిజానిజాలు తెలియకుండా అభ్యర్థులను గందరగోళంలోకి నెట్టవద్దని, అభ్యర్థులు కూడా అవాస్తవాలను నమ్మవద్దని అధికారులు సూచించారు. వికలాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అనువైన తేదీల్లోనే మెడికల్ వెరిఫికేషన్ జరిగేలా చర్యలు తీసుకుంటామని ట్రిబ్ అధికారులు స్పష్టం చేశారు.

అభివృద్ధి కోసం ప్రధానిని కలిస్తే తప్పేంటి?

- నిధులు ఇవ్వకపోతే ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం: పొన్నం

భీమదేవరపల్లి, మార్చి 8: రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాని మోదీని కలిస్తే తప్పేంటని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, పలు పథకాల కోసం ప్రధానమంత్రిని ఇటీవల సీఎం రేవంత్‌తోపాటు తాను కలిసినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు ఇవ్వకపోతే ప్రజాక్షేత్రంలో నిలదీస్తామన్నారు. బీజేపీ విషయంలో కేసీఆర్, కేటీఆర్ మాదిరిగా రాష్ట్రంలో ఒకలా, ఢిల్లీలో మరోలా వ్యవహరించాల్సిన అవసరం తమకు లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒకే సిద్ధాంతంతో పని చేస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ.. ఉత్తర దక్షిణ ధ్రువాలని, అవి ఎప్పుడూ కలవవని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరు వల్లే ప్రస్తుతం రాష్ట్రంలో కరువు ఛాయలు ఏర్పడ్డాయని, ఈ విషయంలో ఆ పార్టీనే తమపై నిందారోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

కాంగ్రెస్ అభ్యర్థులుగా

రఘువీర్, వంశీచంద్

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభ స్థానానికి మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి, నల్లగొండ నుంచి జానారెడ్డి పెద్ద కుమారుడు రఘువీర్‌రెడ్డి, జహీరాబాద్ నుంచి మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్ పేర్లను ఖరారు చేసింది. వాస్తవానికి గురువారం జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశంలో తెలంగాణలోని తొమ్మిది స్థానాలకు అభ్యర్థులపై స్పష్టత వచ్చినా.. సామాజిక సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని విడతల వారీగా అభ్యర్థుల పేర్లను ప్రకటించాలని అధిష్ఠానం భావించింది. ఈ మేరకే తొలి జాబితాలో నాలుగు సీట్లలో మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో వంశీచంద్‌రెడ్డి విద్యార్థి దశ నుంచీ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడి స్థాయి వరకు ఎదిగారు. ఇక రఘువీర్ రెడ్డి కూడా విద్యార్థి దశ నుంచీ కాంగ్రెస్‌లో ఉన్నారు. కాగా, సురేశ్ షెట్కార్ జహీరాబాద్ నుంచి గతంలోనూ ప్రాతినిధ్యం వహించారు. బలరాం నాయక్ కూడా గతంలోనూ మహబూబాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహించడమే కాకుండా కేంద్ర మంత్రిగానూ వ్యవహరించారు.

ఆ సీట్లు ఆగింది అందుకేనా?

తెలంగాణలోని మొత్తం 17 సీట్లకుగాను 9 స్థానాల్లో అభ్యర్థులపై సీఈసీ భేటీలో ఏకాభిప్రాయం వచ్చినా.. నాలుగు సీట్లలోనే అభ్యర్థులను ప్రకటించడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ప్రకటించిన నాలుగు సీట్లతోపాటు సికింద్రాబాద్, చేవెళ్ల, మెదక్, పెద్దపల్లి, నిజామాబాద్ సీట్లపై ఏకాభిప్రాయం వచ్చిందని, కానీ.. రెడ్డి సామాజికవర్గం వారు, ఇటీవలే పార్టీలో చేరిన వారి పేర్లు ఎక్కువగా ఉండడంతో తొలి జాబితాలో వాటిని నిలిపేసినట్లు చెబుతున్నారు. చేవెళ్ల నుంచి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పేర్లు ఖరారు కాగా, బీసీ సామాజికవర్గం నుంచి సురేశ్ షెట్కార్ (జహీరాబాద్), నీలం మధు ముదిరాజ్ (మెదక్), బొంతు రామ్మోహన్ (సికింద్రాబాద్) పేర్లు, ఎస్సీ సామాజికవర్గం నుంచి గడ్డం వంశీ (పెద్దపల్లి) పేరు ఖరారైనట్లు చెబుతున్నారు. పెండింగ్‌లో పెట్టిన ఈ సీట్లలో జీవన్‌రెడ్డి మినహా మిగిలిన వారంతా కాంగ్రెస్‌లో ఇటీవల చేరిన వారే. తొలి జాబితాలో మహిళ ఉంటే బాగుంటుందన్న ఉద్దేశంతో తొలుత సునీతా మహేందర్‌రెడ్డి పేరును ప్రకటించాలని భావించారు. ఇందుకోసం వంశీచంద్‌రెడ్డి పేరును హోల్డ్‌లో పెట్టాలన్న చర్చ అధిష్ఠానం వద్ద జరిగింది. అయితే ఇప్పటికే ఆయన అభ్యర్థిత్వాన్ని రేవంత్‌రెడ్డి ప్రకటించి ఉండడంతో వెనక్కి తగ్గారు. ఇక మలి జాబితా మరో రెండు, మూడు రోజుల్లో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 11న జరిగే సీఈసీ సమావేశంలో వారిని ఖరారు చేసే అవకాశాలున్నాయి. వీరిలో కరీంనగర్ నుంచి ప్రవీణ్‌రెడ్డి పేరు పరిశీలనలో ఉంది. నాగర్‌కర్నూలు నుంచి మాజీ ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వారు ఢిల్లీలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిశారు. ఈ విషయమై రేవంత్‌తో చర్చలు జరిపిన ఆమె.. సీఎం వెంటనే హైదరాబాద్ బయలుదేరి వచ్చారు.



వయనాడ్ నుంచే రాహుల్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి కేరళలోని వయనాడ్ నుంచే బరిలోకి దిగనున్నారు. కేరళలో సిటింగ్ అభ్యర్థులతోనే మళ్లీ పోటీ చేయించాలని కాంగ్రెస్ ఎన్నికల కమిటీ నిర్ణయించింది. కాగా, శుక్రవారం ప్రకటించిన తొలిజాబితాలో ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్(రాజ్‌నంద్‌గావ్), ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్(అలపుఝ), శశిథరూర్ (తిరువనంతపురం)వంటి ప్రముఖులు ఉన్నారు. మొత్తంగా ఛత్తీస్‌గఢ్ నుంచి 5స్థానాలకు, కర్ణాటకలో 7 స్థానాలు, కేరళలో 16స్థానాలు, తెలంగాణలో నాలుగు, మేఘాలయలో రెండు, నాగాలాండ్, సిక్కిం, లక్షద్వీప్, త్రిపురల్లో ఒక్కో స్థానానికి అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మన్నె జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ తమ అభ్యర్థిగా ప్రకటించింది. జీవన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆమోదించారు. ఈ స్థానానికి బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికైన కసిరెడ్డి నారాయణరెడ్డి.. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరి కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయగా ఆ స్థానం భర్తీకి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఉప ఎన్నికకు నామినేషన్ల దాఖలుకు సోమవారం(11వ తేదీ) తుది గడువు.

నకిలీ పోలీస్ ఘరానా మోసం

- రైల్వేలో ఉద్యోగాల పేరిట రూ.కోట్లు వసూలు
- పోలీస్ కమిషనర్‌ను కలిసిన బాధితులు
- టాస్క్‌ఫోర్స్ అదుపులో నిందితుడు

పెందుర్తి (విశాఖపట్నం), మార్చి 8: రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కోట్ల రూపాయలు వసూలుచేసిన నకిలీ ఎస్‌ఐను, అతడి స్నేహితురాలిని పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిసింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం శేఖరపురానికి చెందిన హనుమంతు రమేశ్‌కుమార్ (39).. పెందుర్తిలో నివాసం ఉంటూ స్థానికులతో పరిచయం పెంచుకున్నాడు. తాను విశాఖలో టూ టౌన్ ఎస్‌ఐగా పని చేస్తున్నానని వారిని నమ్మించాడు. పెయింటింగ్ పనులు చేసే దుంపల కృష్ణారావు కుమారుడితోపాటు మరో 12 మందికి రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి.. సుమారు రూ.కోటి దాకా వసూలు చేశాడు. ఉద్యోగాలపై అనుమానం వచ్చి వారు నిలదీయడంతో రైల్వే నియామక పరీక్ష ఉందని అందరినీ విజయవాడ తీసుకెళ్లాడు. ఓ లాడ్జిలో శ్రావణి అనే యువతిని పరిచయం చేసి ఆమె రైల్వే డీఆర్‌ఎం పీఏ అని చెప్పాడు. లాడ్జిలోనే పరీక్ష కండక్ట్ చేశారు. అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చేశాడు. కొన్ని నెలల తరవాత సికింద్రాబాద్‌లో చేరాల్సి ఉంటుందని చెప్పి.. ఆ 12 మంది దగ్గర మిగిలిన మొత్తాన్ని వసూలుచేశాడు. అనంతరం వారందరినీ ఓరోజు సికింద్రాబాద్ రమ్మని అక్కడ గల ఓ హోటల్‌లో ఉంచాడు. అనుమానం వచ్చి వారంతా సికింద్రాబాద్ రైల్వే డీఆర్‌ఎం కార్యాలయానికి వెళ్లి ఆ అపాయింట్‌మెంట్ పత్రాలు చూపించగా నకిలీవని తేల్చారు. బాధితుల్లో కొంతమంది సీపీని ఆశ్రయించడంతో టాస్క్‌ఫోర్సు బృందాలు హైదరాబాద్‌లో రమేశ్‌కుమార్‌ను, శ్రావణిని అదుపులోకి తీసుకున్నాయి. బాధితుడు కృష్ణారావు ఫిర్యాదు మేరకు రమేశ్‌కుమార్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని సీఐ ఎల్.రామకృష్ణ చెప్పారు. రమేశ్ కుమార్, శ్రావణి నకిలీ పోలీసుల అవతారంలో పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.3 కోట్ల వరకూ వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఇదిలావుండగా తన భర్త రమేశ్‌కుమార్ కనిపించడం లేదని సరిత జనవరి ఒకటో తేదీన పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



నెనావత్ అశోక్, లకావత్ శ్రీను, జానయ్య, విఘ్నేశ్ (ఫైల్)

నలిగిన ప్రాణాలు!

- 4 వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి దుర్మరణం
- మృతుల్లో బావమరుదులు, నలుగురు తండ్రీకొడుకులు

పుల్‌కల్, ఆర్మూర్, అర్వపల్లి, మిర్యాలగూడ, మార్చి 8: రాష్ట్రంలో రోడ్లు నెత్తురోడాయి. శుక్రవారం నాలుగు వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటనలతో పండుగ పూట ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల్లో బావమరుదులు, నలుగురు తండ్రీకొడుకులున్నారు. కూలీ పనుల కోసం సంగారెడ్డి జిల్లా కేంద్రానికి బావమరుదులు కలిసి బైక్ మీద వెళుతుండగా శివ్వంపేట సమీపంలోని చార్మినార్ బ్రేవరీస్ వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలలు పగిలి ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మృతులను మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ముప్పారం గిరిజన తండాకు చెందిన నెనావత్ అశోక్ (30), టేక్మాల్ మండలం మల్కాపూర్ (అంతాయిపల్లి)కి చెందిన లకావత్ శ్రీను (35)గా గుర్తించారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం అంక్సాపూర్ శివారులో ఆగివున్న లారీని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ మీద ప్రయాణిస్తున్న తండ్రీకొడుకులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులను దొన్కల్ గ్రామానికి చెందిన మాడవేటి రవీందర్ (55), మాడవేటి శివరాజ్ (25)గా గుర్తించారు. రవీందర్‌కు డయాలసిస్ చేయించేందుకు ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా ఈ ఘటన జరిగింది. సూర్యాపేట జిల్లా బొల్లంపల్లి వద్ద ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీ అదుపు తప్పి దూసుకెళ్లడంతో టైర్ల కింద నలిగి తండ్రీకొడుకులు మృతిచెందారు. ధాన్యం కొనుగోలు కేంద్రం మైదానంలో 15 మంది క్రికెట్ ఆడుతుండగా ఆ గ్రామానికి చెందిన గద్దగూటి జానయ్య (38), ఆయన కుమారుడు విఘ్నేశ్(12) చూస్తున్నారు. అదే సమయంలో బొల్లపల్లికి చెందిన జానయ్య మద్యం మత్తులో లారీని ముందుకు దూకించడంతో విఘ్నేశ్‌పైకి దూసుకెళుతుండటాన్ని చూసిన తండ్రి జానయ్య కాపాడేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఇద్దరిపై నుంచి లారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలో బైక్‌పై నుంచి అన్నదమ్ములు కింద పడ్డారు. ఈ ఘటనలో తీవ్రగాయాలతో తమ్ముడు ప్రభాస్ (13) మృతిచెందాడు. అన్న లక్ష్మణ్ మిర్యాలగూడలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉంది.

మార్క్‌ఫెడ్ జీఎం విష్ణువర్ధన్‌రావు..

సర్కార్‌కు సరెండర్!

- డిప్యుటేషన్ రద్దుకు బోర్డు నిర్ణయం

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సంస్థ (టీఎస్-మార్క్‌ఫెడ్) జనరల్ మేనేజర్ వి.విష్ణువర్ధన్‌రావు డిప్యుటేషన్ రద్దుచేసి ప్రభుత్వానికి సరెండర్ చేయాలని డైరెక్టర్ల బోర్డు నిర్ణయించింది. ఈ నెల 6న హైదరాబాద్ నాంపల్లిలోని మార్క్‌ఫెడ్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ మార గంగారెడ్డి అధ్యక్షతన డైరెక్టర్ల బోర్డు సమావేశం జరిగింది. మార్క్‌ఫెడ్ ఎండీ సత్యనారాయణరెడ్డితోపాటు వివిధ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్లు బొర్రా రాజశేఖర్, జగన్మోహన్ రెడ్డి, రంగారావు, చరణ్, విజయ్, నర్సయ్య.. మెదక్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల డీసీఎమ్మెస్ చైర్మన్లు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో విష్ణువర్ధన్‌రావు డిప్యుటేషన్, గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలపై చర్చ జరిగింది. రాష్ట్ర సహకారశాఖలో జాయింట్ రిజిస్ట్రార్ హోదాలో పనిచేసే విష్ణువర్ధన్‌రావు 2018-19లో డిప్యుటేషన్‌పై మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్‌గా చేరారు. తొలుత మూడేళ్ల డిప్యుటేషన్‌పై పనిచేశాక మళ్లీ రెండేళ్ల డిప్యుటేషన్ సర్వీసు పొడిగించారు. గత ప్రభుత్వ హయాంలో ఒకరిద్దరు మంత్రులతో ఉన్న పరిచయాలతో సుదీర్ఘకాలం జీఎంగా పనిచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా డిప్యుటేషన్ కొనసాగిస్తున్నారని, ఆయన డిప్యుటేషన్ రద్దుచేసి ప్రభుత్వానికి సరెండర్ చేయాలని డైరెక్టర్లు నిర్ణయించారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎండీని ఆదేశించారు. అయితే తనను సరెండర్ చేయొద్దని, తానే జీఎం పోస్టుకు రాజీనామాచేసి మాతృశాఖకు వెళ్తానని అదే సమావేశంలో పాల్గొన్న విష్ణువర్ధన్‌రావు బోర్డు డైరెక్టర్లకు విన్నవించినట్లు తెలిసింది. అయితే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇంకా బహిర్గతం కాలేదు. కాగా విష్ణువర్ధన్‌రావుపై గతంలో వచ్చిన ఆరోపణలు సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. వ్యవసాయశాఖ-మార్క్‌ఫెడ్ సంయుక్తంగా రైతులకు పంపిణీచేసిన లింగాకర్షక బుట్టల (ఫిరమోన్ ట్రాప్స్) టెండర్లలో గోల్‌మాల్ జరిగింది. కియాబయోటెక్ కంపెనీ రూ.8 కోట్లకు నకిలీ యూసీ(యుటిలైజేషన్ సర్టిఫికెట్లు) సమర్పించింది. ఈ వ్యవహారంలో కంపెనీ సీఈవో ముకుంద్‌తోపాటు మార్క్‌ఫెడ్ జీఎం విష్ణువర్ధన్‌రావు, చీఫ్ ఫెర్టిలైజర్ మేనేజర్ రేఖ, కమిషనరేట్‌లో ప్లాంట్ ప్రొటెక్షన్ విభాగం డీడీఏ మోహన్‌రెడ్డి, ఏడీఏ మధుమోహన్‌తోపాటు స్టేట్ సెలక్షన్ కమిటీ అధికారుల ప్రమేయంపై ఆరోపణలొచ్చాయి. దీనిపై 2021లో అప్పటి ఏసీబీ డీజీ పూర్ణచందర్‌రావు విజిలెన్స్ విచారణ జరిపించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా అది బుట్టదాఖలైంది. దీంతోపాటు మూసాపేటలోని మార్క్‌ఫెడ్ గోదాముల్లో నిల్వచేసిన 50 వేల క్వింటాళ్ల ఎరువులు గాయబ్ అయ్యాయి. రూ.3కోట్ల విలువైన ఎరువులు తడిసిపోదయ్యాయి. ఈ వ్యవహారంలోనూ మార్క్‌ఫెడ్ జీఎం, సీఎఫ్ఎంల ప్రమేయంపై ఆరోపణలు వచ్చాయి. తాజాగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్క్‌ఫెడ్ సహా 10 కార్పొరేషన్లలో గత పదేళ్లలో జరిగిన అవకతవకలు, కీలక నిర్ణయాలపై విచారణకు ఆదేశించడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

'బంగారు' బాటలో.. ముడుపుల మూటలు

ఏపీలో నాయకులకు, తెలంగాణలో అధికారులకు.. లంచాలివ్వడంలో ఓ డిస్టిలరీ యాజమాన్యం కొత్తపుంత

- జ్యువెలరీషాపుల్లో పసిడి కొన్నట్లు రికార్డులు
- వారికి చెక్కులు ఇచ్చి.. నగదుగా వెనక్కి!
- బంగారాన్ని డీలర్లకు ఇచ్చినట్టు రికార్డులు
- ఇలా ఏడాదిలో 360 కోట్ల లావాదేవీలు
- నేతలు, అధికారులకు రూ.340 కోట్లు
- అధిక భాగం ఏపీలోని ఓ 'బిగ్‌షాట్'కే!

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అది ఒక మద్యం తయారీ కంపెనీ. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎక్కువగా అమ్ముడయ్యే ఓ ప్రముఖ బ్రాండు మద్యాన్ని తయారుచేస్తుంటుంది. ఆ కంపెనీకి సంగారెడ్డిలో, మహారాష్ట్రలో తయారీప్లాంట్లు ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మద్యం అమ్మకాల విషయంలో ప్రభుత్వాలదే గుత్తాధిపత్యం ఉన్న నేపథ్యంలో.. కంపెనీలన్నీ రాజకీయ నాయకత్వాలకు, కొన్నిచోట్ల అధికారులకు ముడుపులు.. అదీ నగదు రూపంలోనే ముట్టజెప్పాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే సదరు డిస్టిలరీ యాజమాన్యం.. నాయకులకు, అధికారులకు లంచాలు ఇవ్వడంకోసం ఓ సరికొత్త అక్రమానికి తెరతీసింది!! అందుకు ఆ సంస్థ ఎంచుకున్న మార్గం.. బంగారం దుకాణాలు. జ్యువెలరీ షాపులకు కమీషన్లను ఎరగా చూపి.. ఏడాది వ్యవధిలో రూ.340 కోట్ల మేర ముడుపులను డబ్బు రూపంలో నాయకులు, అధికారులకు సమర్పించుకుంది. ఈ ముడుపుల్లో ఎక్కువ భాగం ఆంధ్రప్రదేశ్‌లోని ఒక 'బిగ్ షాట్'కు ముట్టినట్లు సమాచారం. తెలంగాణలోని ఇద్దరు కీలక అధికారులకు మాత్రం రూ.15 కోట్లకు పైగా సొమ్ము అందినట్లు తెలిసింది. ఒక అధికారి భార్య ఆస్పత్రి పెట్టుకోవడానికి కూడా డబ్బును సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ డిస్టిలరీ యాజమాన్యం నుంచి ఆమ్యామ్యాలు పుచ్చుకున్న ఆ 'లంచావతారాలు' ఎవరు? దీనికి ఇంకా లింకులేమైనా ఉన్నాయా? అనే కోణంలో కేంద్ర దర్యాప్తు బృందాలు కూపీ లాగుతున్నాయి.

మోసం ఇలా..

మద్యాన్ని తయారు చేసే ఆ డిస్టిలరీ.. రెండు తెలుగు రాష్ట్రాలకూ నెలకు 4 లక్షల కేసుల (ఒక్కో కేసులో 12 ఫుల్ బాటిళ్లు ఉంటాయి) మద్యాన్ని సరఫరా చేస్తుంటుంది. ఇందులో 3 లక్షల కేసులను ఏపీకి, లక్ష కేసులను తెలంగాణకు సరఫరా చేస్తోంది. తమ కంపెనీ సరుకును ప్రభుత్వాలు ఎక్కువ మొత్తంలో కొనేలా చేసేందుకు నాయకులు, అధికారులకు లంచాలు ఇస్తూ వస్తోంది. ముడుపుగా ఇవ్వాల్సిన నగదును సమకూర్చుకోవడానికి డిస్టిలరీ యాజమాన్యం కొన్ని జ్యువెలరీ షాపుల యజమానులతో కుమ్మక్కయింది. వారికి చెక్కులు ఇచ్చి.. వారి వద్ద బంగారాన్ని కొనుగోలు చేసినట్లు.. కొన్న బంగారాన్ని తమ డీలర్లకు నజరానాగా ఇచ్చినట్లు ఉత్తుత్తి రికార్డులను సృష్టించింది. కానీ వాస్తవంగా.. వారి వద్ద ఎలాంటి నగలనూ కొనుగోలు చేయలేదు. నగల దుకాణాలవారు ఆ చెక్కులను బ్యాంకుల్లో వేసి.. వచ్చిన నగదును వచ్చినట్టే డిస్టిలరీ యాజమాన్యానికి అప్పగించారు. ఈ లావాదేవీలు చేసిపెట్టినందుకుగాను వారి నుంచి 6 శాతం కమీషన్‌గా పుచ్చుకున్నారు. ఈ దందాలో మద్యం తయారీ కంపెనీకి హైదరాబాద్‌లోని నాలుగు జ్యువెలరీ షాపులు, ముంబైలోని కొన్ని షాపులు సహకరించినట్టు సమాచారం. ఇలా ఏడాది వ్యవధిలో రూ.360 కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. అందులో నగల దుకాణాల వారికి ఇచ్చిన 6 శాతం కమీషన్ సొమ్ము పోను దాదాపు రూ.340 కోట్ల డబ్బు రాజకీయ నాయకులకు, అధికారులకే ముట్టజెప్పినట్లు తెలిసింది. ఐటీ అధికారుల దాడుల్లో ఈ వ్యవహారం బయటపడడంతో ఆయా నగల దుకాణాల వారిపై జరిమానా కూడా విధించి, లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

నేడే పొత్తు పొడుపు!

టీడీపీ-జనసేన-బీజేపీ దోస్తీపై అధికారిక ప్రకటన!

- బీజేపీ-జనసేనకు 8 లోక్‌సభ, 30 అసెంబ్లీ స్థానాలు

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

ఏపీలో తెలుగుదేశం - జన సేన - బీజేపీ మధ్య పొత్తు ఖరారైంది. శనివారం అధికారిక ప్రకటన చేయడమొక్కటే మిగిలింది. బీజేపీ పెద్దల ఆహ్వానం మేరకు ఢిల్లీకి వెళ్లిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధిపతి పవన్‌కల్యాణ్ గురువారం రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయిన సంగతి తెలిసిందే. విశ్వసనీయ సమాచారం ప్రకారం... గంటన్నరపాటు జరిగిన భేటీలో తొలి ఐదు నిమిషాల్లోనే సీట్ల సర్దుబాటు అంశం కొలిక్కి వచ్చింది. ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీచేసి... ఏపీలో జగన్ సాగిస్తున్న ఐదేళ్ల అరాచక పాలనకు అంతం పలకాలని మూడు పార్టీలు తీర్మానించుకున్నాయి. అక్షర క్రమంలోనే కాదు, అభివృద్ధిలోనూ ఆంధ్ర ప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయాలని నిర్ణయించాయి.

ఇదీ సీట్ల లెక్క....

చంద్రబాబు, పవన్ కల్యాణ్ శుక్రవారం కూడా ఢిల్లీలోనే ఉండి బీజేపీ నేతలతో మంతనాలు జరిపారు. జనసేన-బీజేపీ కలిసి 8 లోక్‌సభ, 30 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మిగిలిన స్థానాల్లో తెలుగుదేశం అభ్యర్థులు బరిలో ఉంటారు. 8 ఎంపీ సీట్లలో 6, 30 అసెంబ్లీ సీట్లలో 6 నుంచి 8 బీజేపీకి కేటాయించేందుకు జనసేన సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా 370 స్థానాల్లో, ఎన్డీయే కూటమి ద్వారా 400లకుపైగా సీట్లలో గెలవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. దీంతోపాటు... ప్రధానమంత్రి నరేంద్రమోదీకి దేశవ్యాప్తంగా ఉన్న ఆదరణ రీత్యా తమకు గౌరవనీయమైన స్థాయిలో ఎంపీ సీట్లు కేటాయించాలని బీజేపీ అగ్రనేతలు కోరినట్లు సమాచారం. దీంతో... ఉభయ కుశలోపరిలాగా తుది నిర్ణయం తీసుకున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో సమావేశమైన తర్వాత పొత్తుపై అధికారిక ప్రకటన వెలువడుతుందని బీజేపీ వర్గాలు తెలిపాయి. "మాకు కేటాయించిన సీట్లన్నీ గెలిపించుకుంటాం. రాష్ట్రంలో మా కూటమి అధికారంలోకి వచ్చేందుకు శాయ శక్తులా కృషి చేస్తాం" అని బీజేపీ నేతలు హామీ ఇచ్చినట్లు తెలిసింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సందర్భంగా కనీసం మూడు, నాలుగు సార్లు పర్యటించాలనుకున్నారని... ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి అవసరమైన హామీలు ఇస్తారని కూడా బీజేపీ నేతలు చెప్పినట్లు తెలిసింది.

మీ బలం... మోదీ కరిష్మా!

"మాకు ఆంధ్రప్రదేశ్‌లో తగినంత ఓట్ల బలం లేదు. కానీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ పట్ల జనంలో చెప్పుకోదగిన ఆదరణ ఉంది. దీనికి మీరు తోడైతే బీజేపీ పట్ల రాష్ట్ర ప్రజల అభిమానం మరింత పెరుగుతుందని నమ్ముతున్నాం" అని బీజేపీ అగ్రనేతలు చంద్రబాబుతో అన్నట్లు తెలిసింది. గత అయిదేళ్ల జగన్ పాలనలో అరాచకాలు కొనసాగాయని, రాష్ట్రం కొన్ని దశాబ్దాలు వెనుకబడిందని తమకు సమాచారం అందిందని, తమ సర్వే ప్రకారం 25 లోక్‌సభ సీట్లలో కనీసం 23 సీట్లు తెలుగుదేశం-జనసేన-బీజేపీ గెలుచుకుంటుందని తమకు తెలిసిందని వారు చెప్పినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న తీరు, అప్పుల పాలు చేస్తున్న వైనం తమకు ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. జగన్ తమకు మద్దతుగా నిలుస్తున్నప్పటికీ ఆయనను ప్రోత్సహించడం సరైందికాదని తాము భావిస్తున్నామని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ పొత్తు కుదరకుండా చేసేందుకు జగన్ చేసిన ప్రయత్నాలు కూడా ఆయన పట్ల బీజేపీలో వ్యతిరేకత పెంచిందని తెలుస్తోంది. కాగా... తనకు రాష్ట్రాభివృద్ధి తప్ప మరేమీ ముఖ్యం కాదని, అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చేయడం, నదుల అనుసంధానానికి వీలుగా పోలవరం వంటి బృహత్తర ప్రాజెక్టులను పూర్తి చేయడం, కేంద్రం సహకారంతో రాష్ట్రాన్ని పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చేయడం తనకు ప్రధానమని చంద్రబాబు బీజేపీ నేతలకు చెప్పినట్లు తెలిసింది.



క్రెడాయ్ ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

రియల్టీని ఇబ్బంది పెట్టిన ధరణి

- అద్భుతమైన కాన్సెప్ట్ అని ప్రజలను కష్టాల పాల్జేశారు
- మాది ఫ్రెండ్లీ ప్రభుత్వం.. అన్నివైపులా హైదరాబాద్ అభివృద్ధి
- క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభంలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్ సిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అద్భుతమైన కాన్సెప్ట్ అని తీసుకొచ్చిన ధరణి పోర్టల్ కారణంగా రియల్ ఎస్టేట్ రంగం ఇబ్బందిపడిందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ధరణిని అడ్డుపెట్టుకుని విధ్వంసం సృష్టించారని, సామాన్య ప్రజానీకాన్ని కష్టాల పాల్జేశారని పేర్కొన్నారు. ఎన్నికల్లో చెప్పినట్లుగానే ఆ పోర్టల్‌ను రద్దు చేస్తామని, ఇప్పటికే కమిటీ వేశామని తెలిపారు. రెవెన్యూ లొసుగులను తొలగించి పారదర్శక సేవలు అందిస్తామని చెప్పారు. శుక్రవారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ షో-2024ను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ధరణిలో 2.50 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, గతంలో 5 లక్షలకు పైగా దరఖాస్తులను తిరస్కరించారని, మొత్తంగా 8 లక్షల నుంచి 9 లక్షల దరఖాస్తుల విషయంలో సమస్యలున్నాయని, వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుని ప్రజల ఆస్తులను కాపాడతామని తెలిపారు. రిజిస్ట్రేషన్ల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సి ఉందని, పారదర్శకత కోసం సూచనలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే స్నేహపూర్వక (ఫ్రెండ్లీ) ప్రభుత్వమని, హైదరాబాద్‌ను 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చేస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. తమ ప్రభుత్వం ఏర్పడి 90 రోజులైందని, గత సర్కారులో తలెత్తిన ఇబ్బందులు, కొందరు వ్యక్తులకు చేకూరిన ప్రయోజనాలను తెలుసుకోవడానికే ఇంత సమయం పట్టిందన్నారు.

హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్‌లో బిల్డర్ల పాత్ర

హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్ రావడంలో నిర్మాణ సంస్థలు, బిల్డర్లు ప్రముఖ పాత్ర వహించారని.. బిల్డర్లు, రియల్టర్లు బాగుంటేనే ప్రభుత్వం బాగుంటుందని పొంగులేటి అన్నారు. బిల్డర్ల ప్రతి పైసాకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందని, ఆ నమ్మకాన్ని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి అని, హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చేసేలా సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మూసీ అభివృద్ధిపై సీఎం ప్రధానంగా దృష్టిసారించారని చెప్పారు. 2050 విజన్ పేరుతో ప్రణాళికాయుత అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

నిర్మాణ రంగానికి తోడ్పాటునివ్వాలి: క్రెడాయ్

గ్రేటర్ సిటీగా మార్పు, మెట్రో కనెక్టివిటీ పెంపు, మూసీ సుందరీకరణ, రాజీవ్ రహదారి, నాగ్‌పూర్ రోడ్డుపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం వంటి కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు రియల్ ఎస్టేట్ అభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. 2050 మాస్టర్ ప్లాన్‌లో అభివృద్ధికి ప్రత్యేక స్థానం కల్పించాలని కోరారు. ప్రగతికి వెన్నెముకలాంటి నిర్మాణ రంగానికి ప్రభుత్వం చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రేడియల్ రోడ్స్ వంటివి అభివృద్ధి చేస్తే అందుబాటు ధరల్లో ఇళ్ల నిర్మాణానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ఐజీబీసీ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ ఉపాధ్యక్షుడు జి.రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మూడు రోజులు జరిగే క్రెడాయ్ ప్రాపర్టీ షోలో హైదరాబాద్‌లోని ప్రముఖ బిల్డర్లు, నిర్మాణ సంస్థలు తమ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్నాయి. బ్యాంకర్లు, వివిధ సంస్థలు ఇందులో భాగస్వామ్యం అయ్యాయి.

హైదరాబాద్ అభివృద్ధి బాధ్యత నాదే

(మొదటిపేజీ తరువాయి)

ఫరూక్‌నగర్ బస్ డిపో వద్ద పాతబస్తీ మెట్రోరైలు ప్రాజెక్టు విస్తరణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇది ఓల్డ్‌సిటీ కాదు ఒరిజినల్ సిటీ. అసలు హైదరాబాదంటే ఇదే' అని వ్యాఖ్యానించారు. కులీకుతుబ్‌షాల నుంచి నిజాం వరకు నగరాన్ని అభివృద్ధి చేసి అంతర్జాతీయంగా పేరు తీసుకువచ్చారని, దాన్ని కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. 2004-14 మధ్యన కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి నీళ్లతో పాటు మెట్రోరైలు కూడా వచ్చిందని సీఎం గుర్తు చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి సిద్ధం చేస్తున్న '2050 వైబ్రెంట్ మాస్టర్ ప్లాన్'లో భాగంగా అక్బరుద్దీన్‌తో కలసి లండన్ నగరాన్ని సందర్శించానని తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నామని, గుజరాత్‌లో సబర్మతీ నదీ తీరప్రాంతం అభివృద్ధికి ప్రధాని మోదీ పెద్ద ఎత్తున నిధులిచ్చారని, అలాగే మూసీ కోసం కూడా నిధులివ్వాలని ప్రధానిని కోరినట్లు సీఎం తెలిపారు. గండిపేట నుంచి 55 కి.మీ.ల మేర మూసీ నది అభివృద్ధిని ప్రజలు చూస్తారని చెప్పారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లేవారి కోసం మెట్రోరైలు చాలా అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. 'జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్ ప్రాంత వాసులు ఎయిర్‌పోర్టుకు మెట్రోలో వెళ్లరు. కారులోనే వెళ్తారు. వారికి ఎయిర్‌పోర్టు దాకా మెట్రో అవసరం లేదు. కానీ, పాతబస్తీ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లాలనుకునే వారు సాధారణంగా కారులో వెళ్లరు. వారికి వీడ్కోలు పలకటానికి వెళ్లేవారితో కలిపి అందరికీ కారు కూడా సరిపోదు. అందుకే ఈ ప్రాంతం నుంచి మెట్రోరైలు వేస్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలియజేశారు. మెట్రో వల్ల పాతబస్తీ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లి రావటం సులభమవుతుందని, వచ్చే నాలుగేళ్లలో పాతబస్తీ మెట్రో రైలు విస్తరణను పూర్తి చేస్తామని, చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్‌లో అతిపెద్ద మెట్రో జంక్షన్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం వెల్లడించారు. పాతబస్తీలో రోడ్ల విస్తరణకు రూ.120 కోట్లు కావాలని ఎంపీ అసదుద్దీన్ తన దృష్టికి తీసుకొస్తే.. అధికారులతో మాట్లాడి వెంటనే రూ.200 కోట్లు విడుదల చేశామని, జీవోలు కూడా వెలువరించామని తెలిపారు. మీరాలం బ్రిడ్జి కోసం నిధులు కావాలంటే మంజూరు చేశామన్నారు. చంచల్‌గూడ జైలును వేరే ప్రాంతానికి తరలించి, ప్రస్తుతం జైలు ఉన్న ప్రదేశంలో కేజీ టూ పీజీ వరకు విద్యాసంస్థల్ని నెలకొల్పుతామని రేవంత్‌రెడ్డి హామీనిచ్చారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. రాబోయే పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, హైదరాబాద్‌లోని గల్లీగల్లీ అభివృద్ధి బాధ్యత తనదేనని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అందుకోసం ఎన్ని నిధులైనా వెచ్చిస్తామని, అవసరమైతే కేంద్రాన్ని నిధులు అడుగుతామని, పాతబస్తీని ఎంఐఎంతో కలసి అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపారు.



పాతబస్తీ మెట్రోరైలు ప్రాజెక్టు మ్యాపును తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్

11న మణుగూరుకు సీఎం

మణుగూరు, మార్చి 8: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని మణుగూరు పట్టణానికి సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 11వ తేదీన రానున్నట్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. సీఎం పర్యటనను పురస్కరించుకుని ముత్యాలమ్మ నగర్‌లో రెండు కొత్త హెలీప్యాడ్‌లను ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన జరిపారు.

మహిళా సాధికారతకు మరిన్ని పథకాలు

- స్త్రీలకు సమాన అవకాశాలు రావాలి
- అంతర్జాతీయ మహిళా దినోత్సవ, మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన సీఎం

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు, హక్కులు దక్కాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన రాష్ట్రంలోని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు అండగా.. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల ద్వారా త్వరలోనే మరికొన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ప్రజాపాలనలో మహిళల ప్రాతినిధ్యం, భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని, అన్ని రంగాల్లో మహిళలను అభివృద్ధి, ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. మహిళల సాధికారితతో పాటు ఆర్థిక స్వావలంభనకు మహాలక్ష్మి పథకం, రూ.500కే గ్యాస్ సిలిండర్ గ్యారెంటీలను తమ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని పేర్కొన్నారు. కాగా, మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.




కాంగ్రెస్‌కు అండగా ఉంటాం: అసదుద్దీన్

మెట్రో విస్తరణ శంకుస్థాపన కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏదైనా అనుకుంటే సాధించే పట్టుదల కలిగిన వ్యక్తి అని, ఆ మొండితనమే ఆయనను సీఎం స్థాయికి తీసుకొచ్చిందని ప్రశంసించారు. 'కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారం ఇచ్చారు. ఆ తీర్పును మేము గౌరవిస్తాం. ఈ విషయాన్ని మా పార్టీ అసెంబ్లీలో కూడా చెప్పింది. ఇప్పుడు మళ్లీ చెబుతున్నా. మీ చేతుల్లో ఐదేళ్లపాటు అధికారం ఉంటుంది. మీరు అభివృద్ధి పథంలో నడవండి. మేము అండగా ఉంటాం' అని అసదుద్దీన్ పేర్కొన్నారు. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే శక్తులను నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. యాకుత్‌పురా నియోజకవర్గంలో రోడ్డు విస్తరణ అవసరం ఉందని, ఆ పనులకు రూ.120 కోట్ల నిధులు కావాలని అడిగితే.. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఏకంగా రూ.200 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. మీరాలం ట్యాంక్ సమీపంలో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. పాతబస్తీ నుంచి ప్రతి రోజు 10-15 వేల మంది యువతీ యువకులు హైటెక్ సిటీకి వెళ్లి వస్తుంటారని, మెట్రో రైలు పనులను సకాలంలో పూర్తి చేస్తే వారికి సౌకర్యంగా ఉంటుందని అసదుద్దీన్ తెలిపారు. మెట్రో పనులు పూర్తయితే 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందే.. జేబీఎస్ వద్ద మెట్రో రైలు ఎక్కితే ఫలక్‌నుమా వద్ద దిగుతామన్నారు. ఉస్మానియా ఆసుపత్రికి కొత్త భవనాన్ని నిర్మించాలని, చంచల్‌గూడ జైలును శివారు ప్రాంతాలకు తరలించి.. ఆ ప్రాంతంలో కేజీ టూ పీజీ క్యాంపస్‌ను నిర్మించాలని కోరారు. డీఎస్సీలో ఉర్దూ మీడియం పోస్టులను ప్రకటిస్తున్నారు గానీ వాటిని భర్తీ చేయడం లేదని, ఆ పోస్టులను డీ రిజర్వు చేసి ఇతర మీడియంలతో భర్తీ చేసి పాతబస్తీ పిల్లలకు మెరుగైన విద్యనందించాలన్నారు. మూసీ సుందరీకరణకు తమ వంతు సహకారం అందిస్తామని, స్థలాల సేకరణకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని అసదుద్దీన్ తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఓల్డ్‌సిటీ మెట్రో కోసం నిధులు కేటాయించిందేగానీ మంజూరు చేయలేదన్నారు. ఉపాధి కోసం, హజ్ యాత్ర కోసం పాతబస్తీ నుంచి గల్ఫ్ దేశాలకు నిత్యం వందలాది మంది వెళ్తుంటారని, వారికి తోడుగా విమానాశ్రయానికి వారి కుటుంబసభ్యులు వెళ్తారని, వీరందరికీ మెట్రో రైలు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మెట్రో మొదటి దశ పనులకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి శ్రీకారం చుడితే.. రెండోదశ పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని గుర్తు చేశారు. పాతబస్తీకి మెట్రో రైలు రావడం ద్వారా ఈ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని ఆలోచించే సీఎం రేవంత్ రెడ్డి.. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా దాకా పనులకు ఏకంగా రూ.2 వేల కోట్లు కేటాయించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, వేం నరేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, గోల్కొండలో మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను సీఎం తిలకించారు.

కాళేశ్వరం ఉద్యోగులు కమిటీ ముందుకు!

ప్రాజెక్టులో పనిచేస్తున్న, రిటైరైన ఉద్యోగులు, ఇంజనీర్లంతా.. నేడు హైదరాబాద్‌కు రావాలని ఇరిగేషన్‌శాఖ ఆదేశం

- బ్యారేజీలపై వివరాలు అడగనున్న ఎన్‌డీఎస్‌ఏ కమిటీ
- రెండో రోజు కొనసాగిన నిపుణుల బృందం పర్యటన



సుందిళ్ల బ్యారేజీని పరిశీలిస్తున్న ఎన్‌డీఎస్‌ఏ బృందం

హైదరాబాద్/భూపాలపల్లి/పెద్దపల్లి/మంథని రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీల కుంగుబాటు, లీకేజీలను పరిశీలించేందుకు వచ్చిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల బృందం.. శనివారం ఆ బ్యారేజీల నిర్మాణాలతో ముడిపడిన ఉద్యోగులు, ఇంజనీర్లతో సమావేశం కానుంది. ఈ మేరకు వారందరూ నిపుణుల కమిటీ ముందుకు రావాల్సిందిగా నీటిపారుదల శాఖ ఆదేశించింది. 2016 నుంచి ప్రస్తుతం (ఈనెల 8వ తేదీ దాకా) బ్యారేజీల ఇన్వెస్టిగేషన్, హైడ్రాలజీ, మోడల్ స్టడీస్, డిజైన్లు, నిర్మాణం, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో పాల్గొన్నవారు హైదరాబాద్‌లోని జలసౌధకు రావాలని పేర్కొంది. ఆయా విభాగాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న వారితోపాటు బదిలీ అయినవారు, పదవీ విరమణ చేసినవారు కూడా విధిగా హాజరుకావాలని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(అడ్మిన్) జి.అనిల్‌కుమార్ సర్క్యులర్ మెమో జారీ చేశారు. సంబంధిత ప్రాజెక్టులకు చెందిన చీఫ్ ఇంజనీర్లు/సూపరింటెండెంట్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తమ పరిధిలోని తాజా, మాజీ ఉద్యోగులంతా హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. వీరితో ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ సమావేశమై.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించి పలు వివరాలను సేకరించే అవకాశం ఉంది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశముందని ఇంజనీరింగ్ వర్గాలు అంటున్నాయి.

రెండో రోజు కొనసాగిన బృందం పర్యటన..

గురువారం తొలిరోజు మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల బృందం.. శుక్రవారం రెండో రోజు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించింది. ఉదయం 10:25 గంటలకు భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం చేరుకుని ఇరిగేషన్ అధికారులతో సమావేశమై ప్రాజెక్టు పూర్తి వివరాలను తెలుసుకున్నారు. సరిగ్గా 11:20 గంటలకు డ్యామ్ దిగువ భాగానికి వెళ్లి 2019 నుంచి లీకేజీలు చోటుచేసుకుంటున్న 38వ నంబర్ పియర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తం 66 పిల్లర్లను ఒకదాని తరువాత ఒకటిగా పరిశీలించి సమాచారం సేకరించారు. అన్నారం సరస్వతి బ్యారేజీలో ఎక్కడెక్కడ సీపేజ్‌లు ఉన్నాయనే విషయంపై ఆరా తీశారు. బుంగలు, నీటి లీకేజీ జరుగుతున్న ప్రాంతంలో శాస్త్రీయ పద్ధతుల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా బ్యారేజీ ఐదో బ్లాక్‌లోని 38వ పియర్ డౌన్ స్ట్రీమ్ వెంట ఉన్న పరిస్థితులను అధ్యయనం చేశారు. 28, 38 పియర్ల వద్ద ఏర్పడిన సీపేజ్ బుంగల మరమ్మతులను పరిశీలించారు. ఈ రెండు పియర్ల వద్ద బ్యారేజీ ఎగువ భాగాన, అంతర్భాగాన ఏర్పడిన పరిస్థితులను వివిధ కోణాల్లో తనిఖీ చేశారు. సీపేజ్ ఎప్పటి నుంచి జరుగుతోంది? ప్రాథమికంగా ఎలాంటి చర్యలు చేపట్టారు? నిర్మాణం సందర్భంగా అనుసరించిన సాంకేతికత, ప్రాజెక్టు డిజైన్, కాంక్రీట్ దిమ్మెల పరిస్థితి తదితర అంశాలను అన్నారం బ్యారేజీ చీఫ్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి, ఈఈ యాదగిరి తదితరుల నుంచి బృందం సభ్యులు సేకరించారు. మధ్యాహ్నం 1:30 గంటల వరకు బ్యారేజీలోని మొత్తం 66 గేట్ల సమాచారాన్ని క్రోడీకరించిన తర్వాత అధికారులతో కొద్దిసేపు సమావేశమయ్యారు.

ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల బృందం అన్నారం నుంచి పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతంలోని సుందిళ్ల వద్ద నిర్మించిన పార్వతి బ్యారేజీ వద్దకు మధ్యాహ్నం 2గంటలకు చేరుకున్నారు. భోజన విరామం అనంతరం బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి నీటి పారుదల శాఖాధికారులు ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని పరిశీలించారు. గోదావరి నదిలో ఎంత లోతు నుంచి పిల్లర్లు నిర్మించారు, బ్యారేజీని ఏ డిజైన్ ప్రకారం నిర్మించారు వంటి విషయాలను తెలుసుకున్నారు. అనంతరం అరగంటపాటు బ్యారేజీ మ్యాప్‌లు పరిశీలించి నిర్మాణంపై ఆరా తీశారు. 2022లో భారీ వర్షాలు కురిసినప్పుడు బ్యారేజీకి ఎంత వరద వచ్చింది? అప్పుడు ఎన్ని గేట్లు తెరిచారు? బ్యారేజీకి కుడి వైపున గల సేఫ్టీ వాల్‌పైకి నీళ్లు ఎందుకు వచ్చాయి? తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. 2023 వర్షాకాలం సీజన్‌లో శ్రీపాద ఎల్లంపల్లి బ్యారేజీ నుంచి దిగువకు అత్యధికంగా వదిలిన వరద నీరు ఎంత? ఆ సమయంలో బ్యారేజీ గేట్లను క్రమంగా తెరిచారా? లేక ఓపెన్ బ్యారేజీ ఫ్రీ చేశారా? అని సంబంధిత అధికారులను ఆరా తీశారు. కాగా, గత ఏడాది అత్యధికంగా 9లక్షల క్యూసెక్కుల వరకు వరద వచ్చిందని, అప్పుడు గేట్లన్నీ పూర్తిగా తెరిచి ఓపెన్ ఫ్రీగా ఉంచామని అధికారులు ఎన్‌డీఎస్‌ఏ బృందానికి వివరించినట్లు సమాచారం. 2022లో వచ్చిన వరద ఉధృతిని పరిగణనలోకి తీసుకుని 4లక్షల క్యూసెక్కుల వరద నుంచే బ్యారేజీ ఓపెన్ ఫ్రీ పెట్టామని చెప్పినట్లు తెలిసింది. అనంతరం సాయంత్రం 3:45 గంటలకు బ్యారేజీ దిగువకు వెళ్లి మొదట 45, 46, 47, 48, 49 పిల్లర్లను, ఆ తర్వాత మధ్యలోకి వచ్చి 30వ పిల్లర్‌ను పరిశీలించారు. ఎక్కడైనా పిల్లర్లు పగుళ్లు బారాయా, గేట్లపైన ఏమైనా పగుళ్లు ఉన్నాయా అనే విషయాలతోపాటు పిల్లర్ల కింద ఉన్న బేస్‌ను పరిశీలించారు. బ్యారేజీని గంటన్నరపాటు పరిశీలించారు.

సుందిళ్ల బ్యారేజీ పరిశీలన..

డబుల్ డెక్కర్ కారిడార్!

ఎన్‌హెచ్-44పై ప్యారడైజ్ జంక్షన్ నుంచి సుచిత్ర దాకా 5.320 కి.మీ మేర నిర్మాణం.. వ్యయం రూ. 1,580 కోట్లు

- తొలుత ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం.. దానిపై మెట్రో
- నిర్మాణం పూర్తయితే రద్దీ, ట్రాఫిక్ కష్టాలన్నీ గాయబ్
- జంట నగరాలతో పాటు 5 జిల్లాల ప్రజలకు ప్రయోజనం
- నేడు సీఎం రేవంత్ శంకుస్థాపన.. కండ్లకోయలో సభ



హైదరాబాద్, మేడ్చల్ టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి తాడ్‌బండ్ జంక్షన్, బోయినపల్లి జంక్షన్ మీదుగా సుచిత్ర-డెయిరీ ఫాం రోడ్డు దాకా 5.320 కిలోమీటర్ల మేర రూ.1,580 వ్యయంతో నిర్మించనున్న 'డబుల్ డెక్కర్ కారిడార్'కు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. కండ్లకోయ జంక్షన్ సమీపంలో ఈ కార్యక్రమం జరుగనుంది. అక్కడ సీఎం సభ కోసం ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మాణంలో భాగంగా తొలుత ఎలివేటెడ్ కారిడార్ పూర్తి చేసి, దానిపై మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. నగరంలో తొలి డబుల్ డెక్కర్ కారిడార్ ఇదే. సికింద్రాబాద్-బోయినపల్లి జంక్షన్ మధ్య జాతీయ రహదారి-44పై వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్న ప్రాంతంలో ప్యారడైజ్ జంక్షన్ వద్ద రోజుకు సగటున 1,57,105 వాహనాలు (ప్యాసింజర్ కార్ యూనిట్ పర్ డే -పీసీయూ) రాకపోకలు సాగిస్తుండగా ఓఆర్ఆర్ జంక్షన్ సమీపంలో 72,687 వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. 'డబుల్ డెక్కర్ కారిడార్ పూర్తయితే రద్దీ, ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి. ఫలితంగా హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు రాకపోకలు సాగించే ఉత్తర తెలంగాణలోని మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, కామారెడ్డి, నిర్మల్-ఆదిలాబాద్ ప్రజలకు మేలు జరగనుంది. ఈ కారిడార్ నిర్మాణానికి మొత్తం 73.16 ఎకరాల భూమి అవసరం. ఇందులో రక్షణ శాఖ పరిధిలోనేదే 55 ఎకరాలకు పైగా ఉంది. మరో 8.2 ఎకరాల మేర ప్రైవేటు స్థలం ఉంది. అండర్‌గ్రౌండ్ టన్నెల్ నిర్మాణానికి దాదాపు 9 ఎకరాలు అవసరం. కారిడార్ పొడవు 5.320 కిలోమీటర్లలో 4.650 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను, 600 మీటర్ల మేర అండర్ గ్రౌండ్ టన్నెల్ నిర్మిస్తారు. మొత్తంగా 131 పియర్స్ ఉంటాయి. ఆరు వరుసల్లో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఈ కారిడార్‌పైకి రాకపోకలు సాగించేందుకు వీలుగా బోయినపల్లి జంక్షన్ సమీపంలో 0.248 కి.మీ. వద్ద , 0.475 కిలోమీటర్ వద్ద రెండు వైపులా ర్యాంపులు నిర్మిస్తారు.

2019 నుంచే కేంద్రానికి రేవంత్ విజ్ఞప్తులు

వాస్తవానికి జంట నగరాల పరిధిలోని ఎన్‌హెచ్-44పై వాహనాల రద్దీ విపరీతంగా ఉంటోంది. రక్షణ శాఖ పరిధిలో భూములు ఉండటంతో సికింద్రాబాద్‌లో రహదారి విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ కోసం నిబంధనలు అడ్డంకిగా మారాయి. 2019లో మల్కాజిగిరి ఎంపీగా ఎన్నికైన రేవంత్ రెడ్డి అప్పట్నుంచే ఈ రహదారి విస్తరణ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. సికింద్రాబాద్ ప్రాంతంలో రహదారుల విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని, నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో రక్షణ శాఖ స్టాండింగ్ సభ్యుడిగా ఉన్న రేవంత్ ఆ కమిటీ సమావేశాల్లోనూ కంటోన్మెంట్ ప్రాంతంలో రహదారుల విషయంలో ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై చర్చను కొనసాగించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఈ అంశంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. డిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను జనవరి 5న కలిసి రాజధాని నగరం కంటోన్మెంట్ ప్రాంతంలో రహదారుల విస్తరణ కోసం రక్షణ శాఖ భూములు తమకు అప్పగించాలని, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. స్పందించిన రక్షణ శాఖ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అంగికరిస్తూ మార్చి 1న రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది.

పోర్టల్ అప్‌డేట్‌తో నిలిచిన ధరణి ఓటీపీ!

- దరఖాస్తు చేయడానికి కనిపించని ఆప్షన్లు
- వ్యవసాయభూముల రిజిస్ట్రేషన్లు మినహా మిగతావి బంద్

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతోంది. అయితే, ఇందులో భాగంగా ధరణి పోర్టల్‌ను అప్‌డేట్ చేస్తుండడంతో కొన్ని సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ముఖ్యంగా ధరణి ఓటీపీ సేవలు ఆగిపోయాయి. కొత్తగా దరఖాస్తులు చేసుకునే అర్జీదారులకు ధరణి పోర్టల్ నుంచి ఓటీపీ వస్తేనే వాటిని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం కుదురుతుంది. ఓటీపీలు రాకపోవడంతో ఆ అవకాశం లేకుండా పోయింది. అలాగే.. కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి సంబంధించి కొన్ని ఆప్షన్లు కూడా పోర్టల్‌లో కనిపించట్లేదు. డీఎస్ పెండింగ్, విస్సింగ్ సర్వే నంబర్, మ్యూటేషన్ తదితర ఆప్షన్లను ప్రయత్నించినప్పుడు సాంకేతిక సమస్య ఉన్నట్లుగా సందేశం వస్తోంది. కొందరికి ధరణి ఓటీపీ వచ్చినా.. దరఖాస్తులు పోర్టల్‌లో అప్‌లోడ్ కావట్లేదు. భూ సమస్యల పరిష్కారం కోసం కొందరు బాధితులు మీసేవ, సిటిజన్ లాగిన్, సీఎస్‌సీ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తే.. ఆ దరఖాస్తులను కూడా పోర్టల్ అనుమతించట్లేదు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ప్రక్రియ మాత్రమే సజావుగా సాగుతోంది. ఇక.. ధరణి పోర్టల్‌లో ఆర్డీవో, తహశీల్దార్, ఆపరేటర్ లాగిన్స్ అన్నీ కొత్తగా కనిపిస్తున్నాయి. కలెక్టర్ పరిష్కరించాల్సిన అర్జీలను ముందుగా అదనపు కలెక్టర్ పరిశీలించి అప్రూవ్ చేసిన అనంతరం ఆ దరఖాస్తు కలెక్టర్ లాగిన్‌లోకి వెళ్తోంది. టీఎం-7లో దరఖాస్తు చేసుకున్న నాలా కన్వర్షన్ అర్జీలు, టీఎం-16 పరిధిలోకి వచ్చే భూముల సమస్యలు, టీపీ-20లోకి వచ్చే ఎన్‌ఆర్ఐల భూసమస్యలు, టీఎం-22లో సంస్థలకు సంబంధించిన పట్టదారు పాస్‌పుస్తకాల జారీ, టీఎం-26 పరిధిలోకి వచ్చే కోర్టు కేసులకు సంబంధించిన సమస్యలు, టీఎం-33 పరిధిలోకి వచ్చిన భూ సమస్యల (మార్కెట్ విలువ రూ.5 లక్షలలోపు విలువగల భూములకు సంబంధించిన) దరఖాస్తులను ఆర్డీవో పరిష్కరించనున్నారు. కానీ, కొత్త లాగిన్ వివరాలతో పోర్టల్‌లోకి ప్రవేశించేందుకు వారు ప్రయత్నిస్తుంటే సాంకేతిక సమస్య లున్నట్లు చూపిస్తోంది. టీఎం-4 (టెక్నికల్ మాడ్యూల్) కింద వచ్చిన విరాసత్ దరఖాస్తులను , టీఎం-10 పరిధిలోని జీపీఏ, ఎస్‌పీఏ, ఎగ్జిక్యూటివ్ జీపీఏలను, టీఎం-14 లోని స్పెషల్ ల్యాండ్ మ్యాటర్, టీఎం-32లోని ఖాతా మెర్జింగ్‌కు సంబంధించిన అర్జీలను తహశీల్దార్లు పరిశీలించనున్నారు. కానీ కొత్త లాగిన్ వివరాలతో వారూ పోర్టల్‌లోకి ప్రవేశించలేకపోతున్నారు. ధరణి పోర్టల్‌ను పూర్తిగా అప్‌డేట్ చేశాక ఈ సమస్యలన్నీ తొలగిపోతాయని.. అందుకు కొంత సమయం పడుతుందని రెవెన్యూ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

'సెర్ప్' సీఈవోగా అనితారామచంద్రన్

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్‌కు గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ(సెర్ప్) సీఈవోగా ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటి వరకు ఈ బాధ్యతలు చూస్తున్న ఐఏఎస్ అధికారి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి, కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి తఫ్సీర్ ఇక్బాల్‌ను నియమించింది. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్(ఐఎస్‌డబ్ల్యూ) డీఐజీగా ఉన్న ఆయన్ను బదిలీ చేసి ఈ బాధ్యతలు అప్పగించింది. ఇప్పటి వరకు మైనారిటీ సంక్షేమ శాఖ బాధ్యతలు చూసిన ఐఏఎస్ అధికారి ఒమర్ జలీల్‌ను అక్కడి నుంచి రిలీవ్ చేసింది. కాగా... తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఇన్‌చార్జి డీఐజీ బాధ్యతల్లో తఫ్సీర్ ఇక్బాల్ కొనసాగుతారని ప్రభుత్వం తెలిపింది. చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్)గా ఉన్న 2005 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి బి.సైదులును బదిలీ చేసి మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శిగా నియమించింది.

విద్యుత్ నియంత్రణ మండలిలో కొలువుల మేళా

హైదరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ఈఆర్‌సీ)లో పెద్దసంఖ్యలో ఉద్యోగ నియామకాలకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదలయింది. టారిఫ్ ఉత్తర్వులు ఇచ్చే క్రమంలో పిటిషన్లను సమగ్రంగా పరిశీలించడానికి వీలుగా ఉద్యోగులను నియమించుకోవాలని మండలి నిర్ణయించింది. గత పదేళ్లలో తొలిసారి కొలువుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఒక జాయింట్ డైరెక్టర్(ఇంజనీరింగ్), ఒక డిప్యూటీ డైరెక్టర్(ట్రాన్స్‌మిషన్), ఒక డిప్యూటీ డైరెక్టర్(డిస్ట్రిబ్యూషన్), ఒక డిప్యూటీ డైరెక్టర్(లా), ఒక డిప్యూటీ డైరెక్టర్/లీగల్ ప్రొసీజర్స్, ఒక డిప్యూటీ డైరెక్టర్/టారిఫ్(అకౌంట్స్ అండ్ ఫైనాన్షియల్ అనాలిసిస్), ఒక డిప్యూటీ డైరెక్టర్(టారిఫ్ ఎకనామిక్స్), ఒక డిప్యూటీ డైరెక్టర్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), ఒక డిప్యూటీ డైరెక్టర్(టారిఫ్ ఇంజనీరింగ్), ఒక డిప్యూటీ డైరెక్టర్(పే అండ్ అకౌంట్స్), ఒక డిప్యూటీ డైరెక్టర్(కన్స్యూమర్ అసిస్టెంట్), ఒక అకౌంట్స్ ఆఫీసర్, ఒక క్యాషియర్, ఒక లైబ్రేరియన్, రెండు స్టెనో కమ్ కంప్యూటర్ ఆపరేటర్, నాలుగు క్లర్క్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, రెండు పర్సనల్ అసిస్టెంట్, ఒక రిసెప్షనిస్ట్, 5 ఆఫీస్ సబార్డినేట్.. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. 18 నుంచి 46 ఏళ్లలోపు వయసున్న వారే ఈ ఉద్యోగాలకు అర్హులు. అభ్యర్థులు ఏప్రిల్ 1వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంది. దరఖాస్తులను 'కమిషన్ కార్యదర్శి, ఇంటినెం.11-4-660, ఐదో అంతస్తు, సింగరేణి భవన్, రెడ్ హిల్స్, హైదరాబాద్- 500 004' చిరునామాలో సమర్పించాలి. మరిన్ని వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం, సమగ్ర నోటిఫికేషన్ కోసం http://tserc.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

మెడికవర్ ఆస్పత్రికి సీఎం రేవంత్

» అస్వస్థతకు గురైన సోదరుడికి పరామర్శ

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి హైటెక్‌సిటీలోని మెడికవర్ ఆస్పత్రికి వెళ్లారు. దవాఖానాలో చికిత్స పొందుతున్న ఆయన సోదరుడు తిరుపతిరెడ్డిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. తిరుపతిరెడ్డికి ఛాతీనొప్పి రావడంతో గురువారం ఆస్పత్రిలో చేర్పించారు. వివిధ పరీక్షలు చేసిన వైద్యులు.. ఆయన శరీరంలో పలు చోట్ల రక్త ప్రవాహానికి అడ్డంకులు ఉన్నట్లు గుర్తించి స్టెంట్స్ వేశారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ శరత్‌రెడ్డి పర్యవేక్షణలో తిరుపతిరెడ్డికి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది.

సింగరేణికి జాతీయ స్థాయి అవార్డు


అవార్డును అందుకుంటున్న సింగరేణి ప్రతినిధులు

హైదరాబాద్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఉన్న సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం జాతీయ స్థాయిలో నీటి వినియోగ సామర్థ్యంలో అత్యుత్తమ యూనిట్‌గా అవార్డును సొంతం చేసుకుంది. ప్రతిష్ఠాత్మక కౌన్సిల్ ఆఫ్ ఎన్విరో ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో గురువారంన్యూఢిల్లీలో జరిగిన ద్వితీయ జాతీయ స్థాయి అత్యుత్తమ థర్మల్ ప్లాంట్ల బహుమతి ప్రదానోత్సవ వేడుకలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి 'బెస్ట్ నేషనల్ వాటర్ ఎఫిషియంట్ యూనిట్ అవార్డును అందజేశారు. ఈ అవార్డును సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం తరఫున అధికారులు కె.చంద్రలింగం, ఎల్‌జేవీ సుబ్బారావు, ఐఆర్ఈడీ మాజీ డైరెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. జాతీయ స్థాయిలో 500 మెగావాట్లకు పైగా సామర్థ్యం గల సుమారు 150 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ విద్యుత్ కేంద్రాల్లో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఈ అవార్డును సాధించడం పట్ల సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ హర్షం వ్యక్తం చేశారు.

మెడికల్ కాలేజీల్లో 'ఘోస్ట్' ఫ్యాకల్టీకి చెక్

» ఒకటి రెండు రోజుల్లో కొత్త వెబ్‌సైట్: ఎన్ఎంసీ

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో 'ఘోస్ట్' ఫ్యాకల్టీకి చెక్ పెట్టేందుకు జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) సిద్ధమైంది. అందుకోసం ఒక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఒకటి రెండు రోజుల్లో దీన్ని ప్రారంభించనున్నట్లు ఎన్ఎంసీ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. మెడికల్ టీచర్లు, మెడికోల హాజరు ప్రక్రియను క్రమబద్ధీకరించే ప్రయత్నాన్ని ఎన్ఎంసీ చేస్తోంది. మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ ఆస్పత్రుల్లో అధ్యాపకులు, డాక్టర్లకు బయోమెట్రిక్ తప్పని సరి చేసి ఈ పోర్టల్‌తో అనుసంధానం చేస్తారు. బయోమెట్రిక్ హాజరు విధానాన్ని హ్యాకింగ్ చేసే పద్ధతులను నిరోధించడంతో పాటు సెక్యూరిటీ పరంగా పూర్తి భద్రతతో ఈ కొత్తపోర్టల్‌ను తీసుకువస్తున్నట్లు అండర్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు ప్రెసిడెంట్ డాక్టర్ అరుణా వాణికర్ వెల్లడించారు.

ఇజ్రాయెల్‌తో అదానీ ఒప్పందాలు రద్దు చెయ్యండి

» భారత ప్రభుత్వానికి మానవ హక్కుల వేదిక డిమాండ్

హైదరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పాలస్తీనలో మారణహోమానికి పాల్పడుతున్న ఇజ్రాయెల్‌తో ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతం అదానీ చేసుకున్న ఒప్పందాలను భారత ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని మానవహక్కుల వేదిక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ యూనిట్లు డిమాండ్ చేశాయి. యుద్ధంలో వినియోగించేందుకు అవసరమైన ఎల్బిట్ హెర్మెస్-900 యూఏవీ(అన్ మ్యాన్డ్ ఏరియల్ వెహికల్స్)ల సరఫరా సహా ఇజ్రాయెల్‌తో అదానీ పలు ఒప్పందాలను ఖండించాయి. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఇజ్రాయెల్‌కు చెందిన ఎల్బిట్ సిస్టమ్స్ సంయుక్తంగా హైదరాబాద్ కేంద్రంగా అదానీ-ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ సంస్థను నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. అదానీ-ఎల్బిట్ సంస్థ ఇటీవల 20 ఎల్బిట్ హెర్మెస్-900 యూఏవీలను ఇజ్రాయెల్ సైన్యానికి సరఫరా చేసిందని పేర్కొన్నారు. పాలస్తీనాలో జరుగుతున్న మారణహోమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా ఒప్పందాల రద్దుకు చర్యలు తీసుకోవాలని మానవహక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు వీఎస్ కృష్ణ, జీవన్ కుమార్ కోరారు.

ఫోన్ టాపింగ్ కేసులో కేసీఆర్ పాత్రపై విచారణ చేయండి!

» కేంద్ర హోం శాఖ ప్రత్యేక ఆదేశాలు అవసరం

» అవేమీ లేకుండానే పలువురి ఫోన్లు టాపింగ్

» పంజాగుట్ట పోలీసులకు న్యాయవాది అరుణ్ కుమార్ ఫిర్యాదు

పంజాగుట్ట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు, మీడియాను తన గుప్పెట్లో పెట్టుకోవడానికి చేయించిన ఫోన్ టాపింగ్‌లపై సమగ్ర విచారణ జరిపించాలని న్యాయవాది పి.ఎస్ అరుణ్ కుమార్ పంజాగుట్ట పోలీసులకు శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన ఫోన్ టాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్ ప్రధాన నిందితుడని ఆయన్ను ఏ1గా చేర్చి కేసు దర్యాప్తు చేయాలన్నారు. కేంద్ర హోంశాఖ ప్రత్యేక ఆదేశాలతో మాత్రమే ఫోన్ సంభాషణలు వినే అవకాశం ఉంటుందని అందుకు విరుద్ధంగా అధికారులపై ఒత్తిడి చేసి టాపింగ్ చేయించారన్నారు. దీని కోసం విదేశాల నుంచి ఆధునిక యంత్ర, పరికరాలు దిగుమతి చేసుకున్నారన్నారు. ఎస్.ఐ.బిలో డీఎస్పీగా పనిచేసిన ప్రణీత్ కుమార్.. అప్పటి ఉన్నతాధికారి, ప్రభుత్వ అధినేత కనుసన్నల్లోనే ఈ పని చేశారన్నారు. ఈ మొత్తం వ్యవహారం కేసీఆర్ లబ్ధి కోసమే జరిగినందున తక్షణమే విచారణ ప్రారంభించి చట్టపరంగా ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయ నిపుణుల సలహా తీసుకుని కేసు నమోదు చేస్తామని పంజాగుట్ట ఏసీపీ ఎస్.మోహన్ కుమార్ తెలిపారు.

లక్ష మందితో 12న మహిళా సదస్సు: సీఎస్

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండులో దాదాపు లక్ష మంది స్వయం సహాయక బృందాల మహిళలతో రాష్ట్ర మహిళా సదస్సును నిర్వహించనున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సదస్సు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో శుక్రవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సదస్సుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని సీఎస్ తెలిపారు. రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు సదస్సులో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

భక్తవశంకర




హైదరాబాద్‌లోని హెచ్ఎంటీ హిల్స్ రామాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తురాలు

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు.. మహాశివరాత్రి సందర్భంగా పోటెత్తిన భక్తులు

వేములవాడ/కీసర/యాదగిరిగుట్ట/పాపన్నపేట, మార్చి 8: మహా శివరాత్రి సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ శుక్రవారం తెల్లవారు జామునుంచే భక్తులు ఆ దేవదేవున్ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. ప్రముఖ శైవ క్షేత్రాల్లో వేడుకలను వైభవంగా నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకుని రాత్రంతా జాగరణ పాటించారు. సాయంత్రం వేళలో శివదీక్ష స్వాములు స్వామి వారిని దర్శించుకున్న అనంతరం.. సాయంత్రం ఆలయ అర్చకులు స్వామివారికి మహాలింగార్చన జరిపారు. రాత్రి 11.35 గంటలకు లింగోద్భవ సమయాన స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. గురువారం సాయంత్రమే రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టువస్త్రాలు సమర్పించగా, అనంతరం టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. మేడ్చల్ జిల్లా కీసరగుట్ట రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం ఉదయం నుంచే బారులు తీరారు. తెల్లవారు జామున 3.30 గంటలకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆలయ నిర్వాహకులు గర్భాలయంలో రుద్రాభిషేకం, యాగశాలలో రుద్ర స్వాహకార హోమం నిర్వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీజేపీ నేత ఈటల రాజేందర్ దంపతులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కీసరగుట్టలో భక్తుల రద్దీ

ఏడుపాయలలో..

మెదక్ జిల్లాలో ఏడుపాయల మహాజాతరకు అంకురార్పణ జరిగింది. శివరాత్రి సందర్భంగా వనదుర్గామాత విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని బంగారు కిరీటం, ముత్యాలహారం, ఇతరత్రా ఆభరణాలతో అలంకరించారు. తెల్లవారు జామునే దుర్గాదేవికి మంగళవాయిద్యాల మధ్య అభిషేకం, సుప్రభాత సేవ నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, తలంబ్రాలతో ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి చేరుకుని దుర్గామాతకు సమర్పించారు. యాదగిరిక్షేత్రంలో కొండపైన అనుబంధ శివాలయంలో విశేష పూజాపర్వాలు శైవాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా అభిషేక పూజలు కొనసాగగా భక్తులు కుటుంబసమేతంగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. నల్లమల అభయారణ్యం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం బౌరాపూర్‌లో వెలసిన భ్రమరాంబికా మల్లికార్జున కల్యాణం అంగరంగ వైభవంగా ప్రభుత్వం నిర్వహించింది. చెంచు పూజరులే వారి సంప్రదాయ పద్ధతిలో చెంచుల ఆడపడుచుగా పిలుచుకునే భ్రమరాంబికాదేవి కల్యాణాన్ని కన్నుల పండవగా జరిపారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు.


వేములవాడలో కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

'వందేభారత్'లో సాంకేతిక లోపాలు.. ప్రయాణికుల తిప్పలు

» ఆఖరి నిమిషంలో రైలు రద్దును ప్రకటిస్తున్న అధికారులు

» ఏసీ లోపంతో విశాఖలో బయలుదేరని వందేభారత్

» సికింద్రాబాద్‌నుంచి వెళ్లే రైలుపై ఆ ప్రభావం..

» 5 గంటల పాటు ప్రయాణికుల పడిగాపులు

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): న్యూజనరేషన్ ట్రైన్స్‌గా పేరొందిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో తరచూ తలెత్తుతున్న సాంకేతిక లోపాలు ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నాయి. తాజాగా, విశాఖపట్నం-సికింద్రాబాద్, సికింద్రాబాద్- విశాఖపట్నం వందేభారత్ రైళ్ల ప్రయాణికులు శుక్రవారం నానాపాట్లు పడ్డారు. విశాఖ నుంచి శుక్రవారం ఉదయం బయలుదేరాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లోని 8 బోగీల్లో ఎయిర్ కండిషన్ వ్యవస్థ ఫెయిలైంది. దీంతో రైలును విశాఖలోనే నిలిపివేస్తున్నట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు చివరి నిమిషంలో ప్రకటించారు. అయితే, అప్పటికే ప్లాట్‌ఫారం పైకి చేరుకున్న ప్రయాణికులు గగ్గోలు పెట్టడంతో.. ఉదయం 7 గంటల తర్వాత ప్రత్యేక రైలు(సాధారణ ఏసీ బోగీలున్న రైలు) ఏర్పాటు చేసి వారిని పంపారు. మరోవైపు, విశాఖ నుంచి రావాల్సిన వందేభారత్ రాకపోవడంతో



సికింద్రాబాద్- విశాఖ వందేభారత్ ప్రయాణికులూ ఇబ్బంది పడ్డారు. షెడ్యూల్ ప్రకారం.. విశాఖ వెళ్లే వందేభారత్ రైలు సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరాలి. కానీ, విశాఖ నుంచి రావాల్సిన రైలు రాకపోవడం, అదనపు రేక్ లేకపోవడంతో సికింద్రాబాద్- విశాఖ వందేభారత్‌ను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు చివరి నిమిషంలో ప్రకటించారు. రద్దయిన వందే భారత్ స్థానంలో ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అయితే, దాదాపు ఐదు గంటల పాటు ప్రయాణికులు ఎదురు చూసిన తర్వాత ఆ రైలు రాత్రి ఏడు గంటలకు ఫ్లాట్‌ఫారమ్ మీదకు వచ్చింది. కాగా, దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మొత్తం ఆరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తుండగా, వీటిలో నాలుగింటి నిర్వహణను జోన్ అధికారులే పర్యవేక్షిస్తుంటారు. ఈ రైళ్లలో తరచూ సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో ఒక అదనపు రేక్‌ను దక్షిణ మధ్య రైల్వే సమకూర్చుకుంటే ప్రయాణికులకు అవస్థలు ఉండవని సీనియర్ రైల్వే అధికారులు చెబుతున్నారు.

ఆకాశంలో సగం కాదు.. 'ఆమే' ఆకాశం : కేటీఆర్

» ఐఐటీ మద్రాస్ కార్యక్రమానికి కేటీఆర్‌కు ఆహ్వానం



హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి):"ఆకాశంలో సగం కాదు.. ఆమే ఆకాశం" అని పేర్కొంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్.. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. యావత్ నారీ శక్తికి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన కేటీఆర్.. బీఆర్ఎస్ హయాంలో మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేశామని పేర్కొన్నారు. కాగా, ఐఐటీ మద్రాస్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగే ఎంట్రప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌కు రావాలని కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన క్రిస్ గోపాలకృష్ణన్ వంటి ప్రముఖులు ఈ సమ్మిట్‌లో పాల్గొననున్నారు.

ధరలు పెంచుదామా.. తగ్గిద్దామా!

» రాజీవ్ స్వగృహ ప్లాట్లు, ఫ్లాట్ల విక్రయాలకు కమిటీలు

» అవి ఇచ్చే నివేదికల ఆధారంగా ధరలపై సర్కారు నిర్ణయం

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహ పరిధిలోని ఓపెన్ ప్లాట్లు, టవర్లలోని ఫ్లాట్లపై సర్కారు దృష్టి పెట్టింది. ఈ మేరకు హెచ్ఎండీఏ పరిధిలో ఒకటి, రాజీవ్ స్వగృహ ఆస్తులున్న జిల్లాల పరిధిలో వేర్వేరు కమిటీలను నియమించింది. ఈ కమిటీలు ఆయా జిల్లాల పరిధిలో రాజీవ్ స్వగృహ కింద ఉన్న ఓపెన్ ప్లాట్లు, టవర్లలోని ఫ్లాట్ల ధరలను ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి నివేదికలు అందించనున్నాయి. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా ముగ్గురు సభ్యులు, హెచ్ఎండీఏ కమిషనర్ చైర్మన్‌గా మరో నలుగురు అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయగా.. ధరలకు సంబంధించిన కసరత్తు సైతం ఇప్పటికే ప్రారంభమైంది. ఇందులో భాగంగా తొలుత రాజీవ్ స్వగృహ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని భూములున్నాయి? ఓపెన్ ప్లాట్లు ఎన్ని? టవర్లలో పూర్తయినవి ఫ్లాట్లు ఎన్ని? పూర్తి కానివి ఎన్ని? అనే వివరాలను సేకరిస్తున్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో భూమి విలువను బట్టి ప్లాట్ల ధరలను ప్రతిపాదించనున్నారు. అలాగే, పూర్తయిన, పూర్తి కాని టవర్లలో ఫ్లాట్ల ధరలు నిర్ణయించనున్నారు. అయితే, ఆయా ఫ్లాట్లను నిర్మించి ఇప్పటికే పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ధరలను పెంచాలా? తగ్గించాలా? అనే అంశంపై కమిటీల్లోనూ సందిగ్ధత నెలకొన్నట్లు తెలిసింది. రాజీవ్ స్వగృహ కింద ప్రస్తుతం 650 నుంచి 700 ఎకరాల వరకు భూములు ఉన్నాయి. ఇవి కాకుండా 1400 ఓపెన్ ప్లాట్లు, పలు టవర్లలో ఫ్లాట్లు ఉన్నాయి. హైదరాబాద్‌లోని పోచారంలో 4 టవర్లు ఉండగా 700, బండ్లగూడలో 700, గాజులరామారంలోని 5 టవర్లలో 600, జవహర్‌నగర్‌లోని 17 టవర్లలో 2,500, ఖమ్మంలోని 8 టవర్లలో 580 ఫ్లాట్లు ఉయి. అయితే వీటిలో బండ్లగూడ, పోచరంలో కొన్నింటి నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో 'ఎక్కడ ఉన్న వాటినే అక్కడే' అనే ప్రాతిపదికన గత ప్రభుత్వం హెచ్ఎండీఏ నేతృత్వంలో విక్రయాలు చేపట్టింది. చదరపు అడుగుకు రూ.2,250 నుంచి రూ.2,500 వరకు ధర నిర్ణయించి, రెండు సార్లు లాటరీ ద్వారా కొనుగోలుదారులకు కేటాయించారు. మిగతా ప్రాంతాల్లోనూ ఇదే మాదిరిగా విక్రయాలు చేపట్టాలని కసరత్తు చేసినా.. పూర్తి కాలేదు. ఇక, రాజీవ్ స్వగృహ కింద జిల్లాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్లను గత ప్రభుత్వం చాలా వరకు విక్రయించింది. ఆదిలాబాద్‌లోని అగ్రజ టౌన్‌షిప్‌లో 362 ప్లాట్లు, మహబూబ్‌నగర్‌లో సారిక టౌన్‌షిప్‌లో 400 ప్లాట్లు, కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్‌లోని అంగారిక టౌన్‌షిప్‌లో 656 ప్లాట్లు, నిజామాబాద్ లోని ధాత్రితోపాటు కామారెడ్డిలోని ధరణి టౌన్‌షిప్‌లో 325 ప్లాట్లను 2022 అక్టోబరు 11న వేలం వేశారు. ఆ తర్వాత హెచ్ఎండీఏ, రంగారెడ్డి జిల్లా పరిధిలోని కవాడిపల్లి, తొర్రూర్, తుర్కయాంజల్, బహదూర్‌పల్లిలోని ప్లాట్లకు 2022 నవంబరు 11న వేలం నిర్వహించారు. వికారాబాద్ జిల్లాలోని అలంపల్లిలో 15ఎకరాలు, అదే జిల్లాలోని గంగారంలో 3.5 ఎకరాలను రూ.55 లక్షల చొప్పున ధర నిర్ణయించి 2022 నవంబరు 14న వేలం నిర్వహించారు. ఇలా మొత్తంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1,500 కోట్లకు పైగా నిధులను సేకరించినట్లు సమాచారం.

ఉద్యోగాలలో 33 % కోటా ఇవ్వాలి

» కర్ణాటక, బిహార్‌లను స్ఫూర్తిగా తీసుకోవాలి

» జీవో 3ను తక్షణం రద్దు చేయాలి

» సీఎం రేవంత్‌కు ఓటుకు నోటు కేసుపై ఉన్న శ్రద్ధ మహిళా హక్కులపై లేదు: కవిత

» జాగృతి ఆధ్వర్యంలో మహిళల ధర్నా



జీవో నంబర్ 3 రద్దు చేయాలని ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ కవిత తదితరులు

హైదరాబాద్, కవాడిగూడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, ఈ మేరకు బిహార్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలను స్ఫూర్తిగా తీసుకోవాలని భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 3 ద్వారా గురుకులాల నియామకాల్లో మహిళలకు కేవలం 12 శాతం రిజర్వేషన్నే అమలు చేస్తోందని, ఆ జీవోను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ పార్లమెంటుకు వెళ్లాలి కానీ తెలంగాణ ఆడబిడ్డలు మాత్రం ఉద్యోగాలు లేకుండా ఇంట్లోనే ఉండిపోవాలా? అని నిలదీశారు. వ్యక్తిగత కారణాలతో చనిపోయిన యువతుల మరణాల్ని కూడా రాజకీయం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ జీవో 3 ద్వారా మహిళలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. జీవో 3ను రద్దు చేసి 33 శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో భారత జాగృతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజునే మహిళల హక్కుల కోసం రోడ్డు పైకి వచ్చి ధర్నాలు చేయడం దౌర్భాగ్యమని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో ఢిల్లీకి వెళ్లి సోనియా, రాహుల్‌ల వద్ద హాజరు వేసుకోవడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి చేసింది ఏమీ లేదన్నారు. ముఖ్యమంత్రికి ఓటుకు నోటు కేసు మీద ఉన్న శ్రద్ధ.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించటంపై లేదన్నారు. కుట్రపూరితంగా తీసుకువచ్చిన జీవో 3ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాయమాటలు, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీకి తమకు మధ్య ఓట్లపరంగా ఒక్క శాతం తేడా మాత్రమే ఉందని కవిత చెప్పారు. ఏది అడిగినా వందరోజులు ఆగమంటున్నారని, ఇంకా పదిరోజుల సమయం ఉందని ఆ తర్వాత.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయకుంటే నిలదీస్తామని హెచ్చరించారు. మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు జరుగుతాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా వ్యతిరేక విధానాలతో ముందుకు వెళ్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షా అరవై వేల ఉద్యోగాల నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని చెప్పారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఆడపిల్లల శవాల మీద పేలాలు ఏరుకుంటున్నారని, ఆయనకు ప్రజావాణి కాదు ఢిల్లీవాణి మాత్రమే వినిపిస్తోందని కవిత ఎద్దేవా చేశారు. మరోవైపు, మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవిత ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితోపాటు పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

లిక్కర్ కేసు నుంచి డైవర్షన్ కోసమే..

ఢిల్లీ మద్యం కేసు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కవిత.. మహిళా రిజర్వేషన్ అంశాన్ని ఎత్తుకున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి సుజాత ఆరోపించారు. మహిళలకు అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలను ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. పాలమూరు ఎత్తిపోతలకు జాతీయహోదా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీజేపీ నాయకురాలు డీకే అరుణ ఎందుకు అడగలేదని నిలదీశారు. ఆమె పాలమూరుకు చేసింది ఏమీ లేదన్నారు.

ఎస్సైలకు ఇక బ్యాచ్‌లవారీగా పదోన్నతులు!

» జోనల్ విధానానికి త్వరలోనే స్వస్తి


» ఇప్పుడున్న విధానంతో ప్రమోషన్లలో అసమానతలు

» ఒకేసారి ఉద్యోగంలో చేరినా ఒక జోన్ వారికి త్వరగా పదోన్నతులు.. మరో జోన్ వాళ్లకు ఆలస్యం

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఇప్పటివరకు అనుసరిస్తున్న జోనల్ విధానంలో కాకుండా ఎస్సైలకు బ్యాచ్‌లవారీగా పదోన్నతులు కల్పించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ విధానం అమలుకు సంబంధించి ఇప్పటికే కసరత్తు మొదలైంది. న్యాయపరమైన అంశాలన్నింటినీ పరిశీలించి త్వరలోనే దీన్ని అమల్లోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం జోనల్ విధానంలో ఎస్సైలకు పదోన్నతులు కల్పిస్తుండటంతో ఒకే బ్యాచ్‌కు చెందిన వారిలో కొందరు సీఐలుగా పదోన్నతి పొంది తర్వాతి పదోన్నతికి సిద్ధమవుతుండగా.. మరికొందరికి ప్రమోషన్లు రాక తమ బ్యాచ్ వారికే సెల్యూట్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో చాలా మంది ఎస్సైలు మానసికంగా క్షోభ పడుతున్నారు. జోనల్ విధానంలో పదోన్నతులు సరికాదన్న చర్చ పోలీస్ శాఖలో ఇదివరకే వచ్చినా.. వివిధ కారణాల వల్ల సమస్య పరిష్కారానికి ముందడుగు పడలేదు. ప్రస్తుతం అనుసరిస్తున్న జోనల్ విధానంలో పోలీస్ శాఖలో వరంగల్ జోన్ ఎస్సైలకే ముందుగా పదోన్నతులు వస్తున్నాయి. నోటిఫికేషన్ సమయంలో వరంగల్ జోన్‌లో ఖాళీలు తక్కువగా ఉండటమే దీనికి కారణం. హైదరాబాద్ జోన్‌లో ఎస్సై పోస్టులు ఎక్కువగా ఉండటంతో పదోన్నతుల్లో జాప్యం జరుగుతోంది. ఉమ్మడి ఏపీలో 2009లో వెలువడ్డ ఎస్సై నోటిఫికేషన్‌లో 1,130 మంది తుది పరీక్షల్లో అర్హత సాధించి శిక్షణకు ఎంపికయ్యారు. 2010 డిసెంబరులో శిక్షణ పూర్తిచేసుకుని విధుల్లో చేరారు. వరంగల్ జోన్‌కు 149, హైదరాబాద్ జోన్‌కు 432 మంది ఎస్సైల్ని అధికారులు కేటాయించారు. 2017 డిసెంబరులో వరంగల్ జోన్‌లోని 149 మందిలో 127 మందికి సీఐలుగా పదోన్నతులు కల్పించారు. మిగిలిన వారికి రెండో దశలో పదోన్నతి కల్పించారు. కానీ, హైదరాబాద్ జోన్‌కు కేటాయించిన వారిలో 2017, 2018, 2019 ఇలా మూడు దశల్లో కేవలం 130 మంది ఎస్సైలకు మాత్రమే సీఐలుగా పదోన్నతి కల్పించిన అధికారులు మిగతా వారి విషయంలో నిర్ణయం తీసుకునేందుకు చాలా కాలం పట్టింది. ఒకే బ్యాచ్‌కు ఎంపికై, ఒకేసారి శిక్షణ పూర్తి చేసుకుని, ఒకేసారి విధుల్లో చేరితే తమ తోటివారు సీఐలుగా తమ పై అధికారి స్థాయిలో ఉంటే.. తాము ఏళ్ల తరబడి పదోన్నతులకు నోచుకోకుండా ఎస్సైలుగానే విధులు నిర్వహించాల్సి వస్తోందని ప్రమోషన్లు పొందని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సైల నుంచి వస్తున్న ఒత్తిడి నేపథ్యంలో పదోన్నతుల్లో అసమానతల్ని తగ్గించేందుకు జోనల్ వ్యవస్థ ప్రకారం కాకుండా బ్యాచ్‌ల వారీగా పదోన్నతులు కల్పించేందుకు ఫైల్ మూవ్‌మెంట్ ప్రారంభించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

NOTHING మార్కెట్లోకి బడ్స్, నెక్‌బ్యాండ్



నథింగ్ ఇటీవల సీఎంఎఫ్ బడ్స్, నెక్‌బ్యాండ్ ప్రొ ఇయర్ ఫోన్స్‌ని విడుదల చేసింది. బడ్స్‌లో నాలుగు హెచ్‌డీ మైక్రో ఫోన్స్, క్లియర్ వాయిస్ టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ విండ్ నాయిస్ రిడక్షన్ అల్గోరిథమ్, 12.4 ఎంఎం బయో ఫైబర్ డ్రైవర్, అల్ట్రా బాస్ టెక్నాలజీ 2.0 ఉన్నాయి. సౌండ్ క్వాలిటీ బాగుంది. సింగిల్ చార్జింగ్‌తో ఎనిమిది గంటల సేపు ప్లేబ్యాక్ ఉంటుంది. ముప్పయ్ అయిదున్నర గంటల సేపు వరకు పెంచుకోవచ్చు. పది నిమిషాల ఫాస్ట్ చార్జింగ్‌తో ఆరున్నర గంటలసేపు వినికిడి సమయాన్ని అందుకోవచ్చు. మూడు స్టయిలిష్ రంగులు - డార్క్‌గ్రే, లైట్ గ్రే, ఆరంజ్ రంగుల్లో ఈ బడ్స్ లభిస్తాయి. నెక్‌బ్యాండ్ విషయానికి వస్తే హైబ్రిడ్ ఏఎన్‌సీ టెక్నాలజీ, 50 డెసిబల్స్ మేరకు నాయిస్ క్యాన్సిలేషన్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. 13.6ఎంఎం కాంపోజిట్ డయాఫ్రమ్ డ్రైవర్, అల్ట్రా బాస్ టెక్నాలజీ 2.0, ఐపీ55 వాటర్ రేటింగ్ ఉన్నాయి. సింగిల్ చార్జింగ్‌తో 37 గంటల సేపు ప్లేబ్యాక్ ఉంటుంది. పదినిమిషాల చార్జింగ్‌తో 18 గంటల సేపు బ్యాటరీ లైఫ్ ఉంటుంది. అలాగే ఈ రెండూ నథింగ్ యాప్‌ను ఉపయోగించుకుంటాయి. బడ్స్‌ని రూ.2,499కి రిటైలర్స్ నుంచి పొందవచ్చు. ఆరంభ ధరగా రూ.2,299కే అందిస్తున్నారు. సీఎంఎఫ్ నెక్‌బ్యాండ్‌ను రూ.2,299కి పొందవచ్చు. ఇది కూడా ఆరంభ ధరగా రూ.200 తగ్గించారు. ఈ రెండూ ఈ నెల 11 నుంచి వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయి.

ప్రొడక్ట్

realme కొత్త స్మార్ట్ ఫోన్లు ఇవే



రియల్‌మి రెండు స్మార్ట్ ఫోన్లను ఇండియాలో విడుదల చేసింది. రియల్‌మి 12ప్రొ+ 5జీ ఒకటి కాగా రెండో రియల్‌మి 12ప్రొ 5జీ. ట్రిపుల్ రేర్ కెమెరాలు కలిగి ఉన్న ఈ రెండూ రియల్‌మి యూఐ 5.0 కస్టమ్ స్కిన్‌పై రన్ అవుతాయి. మొదటిది మీడియాటెక్ డైమెన్సిటీ 7050 5జి చిప్‌సెట్, రెండోదైన వనిల్లా రియల్‌మి 6100 +5జీ ఎస్‌ఓసీ ఫీచర్లు కలిగి ఉన్నాయి. అలాగే మొదటిది 6.67 ఇంచీల ఫుల్ హెచ్‌డీ, 1080 x 2400 పిక్సెల్, అమోల్డ్ డిస్‌ప్లే, 120హెచ్‌జడ్ రిఫ్రెష్ రేటు కలిగి ఉంది. రెండోదైన వనిల్లా 6.72 ఇంచీల ఫుల్ హెచ్‌డీ 1080 x 2400 పిక్సెల్, ఎల్‌సీడీ డిస్‌ప్లే, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు ఉన్నాయి. రెంటికీ 5,000ఎంఏహెచ్ బ్యాటరీలు, సూపర్‌వూక్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ కలిగి ఉన్నాయి. డైనమిక్ ర్యామ్ టెక్నాలజీ ఉంది. దీంతో ఉపయోగించిన ఇంటర్నల్ స్టోరేజీలో ర్యామ్ అదనంగా కలుస్తుంది. రియల్‌మి 12 ప్రొ+5జీ బేస్ ధర రూ.20,999. రెండోది రూ.16,999. కొన్ని ఆఫర్లు కూడా ఉన్నాయి.



ఒకే నంబర్, రెండు ఫోన్లపై వాట్సాప్ అకౌంట్!

ఒకే వాట్సాప్‌ను మొబైల్/ల్యాప్‌టాప్/డెస్క్‌టాప్ వంటి వేర్వేరు డివైజ్‌లపై ఓపెన్ చేసుకోవడం తెలిసిందే. అలాగే, ఒకే ఫోన్‌లో రెండు వేర్వేరు వాట్సాప్‌లు ఉపయోగించుకోవడమూ పాత విషయమే. ఇప్పుడు ఒకే నంబర్ అయినప్పటికీ రెండు స్మార్ట్‌ఫోన్లపై ఏకకాలంలో వాట్సాప్ వినియోగం తాజా వెసులుబాటు. వాట్సాప్‌నకు చెందిన లింక్డ్ డివైజెస్ ఫీచర్ - వేర్వేరు డివైజ్‌లపై ఒకే నంబర్ ఉన్నప్పటికీ కలుపుతుంది. నిజానికి ఈ ఫీచర్‌తో అదనంగా నాలుగు డివైజ్‌లపై పని చేసుకోవచ్చు. డెస్క్‌టాప్ లేదా ఆండ్రాయిడ్ టాబ్లెట్స్‌పై ఇప్పటివరకు అందుబాటులో ఉన్న మాదిరిగా ఇది కూడా ఉంటుంది. ప్రైమరీ ఫోన్‌పై లాగౌట్ చేయకుండానే రెండో ఫోన్‌పై కూడా వాట్సాప్‌ను ఉపయోగించుకోవచ్చు. ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ ఫీచర్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజ్‌లు రెంటిలోనూ ఉంది. దీనికోసం..



- ప్రైమరీ డివైజ్‌లో వాట్సాప్ సెటప్ ఉండటమే కాదు ఉపయోగిస్తూ ఉండాలి.
- రెండో ఫోన్‌లో వాట్సాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- సెటప్ ప్రక్రియలో భాగంగా రైట్ కార్నర్‌లో ఉన్న త్రీడాట్స్‌ను టాప్ చేయాలి. ప్రాంప్ట్ కాగానే ఫోన్ నంబర్‌ని ఎంటర్ చేయాలి.
- లింక్ డివైజ్ ఆప్షన్‌ని ఎంచుకోవాలి.
- మెయిన్ ఫోన్‌లోని లింక్డ్ డివైజ్ ఆప్షన్‌ని యాక్సెస్‌లోకి తెచ్చుకోవాలి. రెండో ఫోన్‌లో డిస్‌ప్లే అయిన క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసుకోవాలి.
- ఒకసారి కనెక్ట్ అయితే చాలు రెంటిలోనూ వాట్సాప్‌ను ఒకేసారి ఉపయోగించుకోవచ్చు.

నార్మల్ - బిజినెస్ అకౌంట్ తేడా ఇదే



వాట్సాప్ మెసేజింగ్ సేవలను 2009 నుంచి అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల మంది యూజర్లు దీనికి ఉన్నారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ యూజర్లను ఆకట్టుకుంటోంది. ఇది రెగ్యులర్ వెర్షన్ పర్సనల్ కమ్యూనికేషన్‌కు ఉపయోగపడుతోంది.

వ్యాపార సంస్థలకు ఉద్దేశించినది బిజినెస్ అకౌంట్స్. కస్టమర్లతో సంబంధాలు నెలకొల్పుకొనేందుకు బిజినెస్ అకౌంట్ పనికొస్తోంది. అలాగే కమ్యూనికేషన్ సొల్యూషన్స్‌కు సూట్ అవుతుంది. కస్టమర్స్‌తో సంబంధాలకు తోడు రెవెన్యూ పెంపు, కస్టమర్ బేస్ పెంపు ఈ అకౌంట్ల లక్ష్యాలుగా ఉంటాయి. ఎక్కువ మందికి చేరిక, అందుకున్న అయిదు నిమిషాల్లోపే అటువైపు వ్యక్తి తెరిచి చూడటం, ప్రొఫెషనల్ ఫీచర్స్ కారణంగా బిజినెస్ సంస్థలు వాట్సాప్‌ను తమ కమ్యూనికేషన్‌కు వేదికగా ఉపయోగిస్తున్నాయి.

బ్రాండింగ్ స్టోర్లు, ఆటోమేటెడ్ మెసేజింగ్ తదితరాలతో ఇక్కడ కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ సైతం పెరుగుతుంది. ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో అటు సంస్థ ఇటు కస్టమర్ ప్రయోజనాల పరిరక్షణ సులభం. రియల్‌టైమ్ కమ్యూనికేషన్ అదనం. అన్నింటికీ మించి ఫ్రీ యాప్. సంభాషణ ప్రాతిపదికగా ఉంటుంది. ఇంప్రెషన్స్ బట్టి బిజినెస్ అకౌంట్స్‌లో ప్రైసింగ్ ఉంటుంది. మొత్తమ్మీద ప్రయోజనాల ప్రాతిపదిక రెంటిలో ఏది అవసరమన్నది ఎంపిక చేసుకోవాలి.

కాల్ ప్రైవసీ సెట్టింగ్ ఇలా



ఎక్స్(ట్విటర్) తన సామర్థ్యాలను పెంచుకుంటోంది. ఆ క్రమంలో ఆడియో, వీడియో కాల్స్‌కు ఎక్స్ అనుమతిచ్చింది. నాన్-వెరిఫైడ్, నాన్-పేయింగ్ వ్యక్తులు కూడా దీన్ని ఉపయోగించుకోవచ్చు. అదే సమయంలో కాల్ ప్రైవసీ సెట్టింగ్స్‌కూ వెసులుబాటు కల్పించింది. దీనికోసం ఫోన్ నంబర్ కూడా అవసరం లేదు. ఈ మార్పులతో ఎక్స్‌ను 'ఎవ్విరిథింగ్ యాప్'గా మారుస్తున్నట్టు ఈ సందర్భంలో ఎక్స్ అధికారికంగా తెలిపింది. ఆడియో, వీడియో కాల్స్ కోసం ముఖ్యంగా...

- ఎక్స్‌లో డైరెక్ట్ మెసేజెస్ ట్యాబ్‌ను ముందు కనుగొనాలి.
- కాల్ చేయాలని అనుకుంటున్న వ్యక్తిని ఎంచుకోవాలి. కాల్‌కు సంబంధించి అతనికి ఉన్న అర్హతలను చెక్ చేసుకోవాలి.
- టాప్‌లో రైట్ కార్నర్‌లో ఉన్న ఫోన్ ఐకాన్‌ని టాప్ చేయాలి. కాల్ కోసం ఇనీషియేట్ చేయాలి.
- ఈ కాల్‌కు ముందు అవతలి వ్యక్తి నుంచి ముందుస్తు అనుమతి అవసరం కావచ్చు. అందుకు మెసేజ్ చేసుకోవాల్సి రావచ్చు. కొందరు పర్మిషన్ తీసుకుని మరీ కాల్ చేయాల్సి రావడమే ఇందుకు కారణం.

కాల్ ప్రైవసీ సెట్టింగ్

డిఫాల్ట్ కాల్స్‌పై కొందరు ఎక్స్ యూజర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐపీ చిరునామా, లొకేషన్ ఇతరులకు తెలియవచ్చన్నది వారి ఆందోళన. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రైవసీ సెట్టింగ్స్‌ను అనుమతించింది. అందుకుగాను...

- డివైజ్‌లో ఎక్స్ యాప్‌ని ఓపెన్ చేయాలి.
- సైడ్‌బార్ మెనూ కోసం టాప్ లెఫ్ట్ కార్నర్‌లో ఉన్న ప్రొఫైల్ ఐకాన్‌పై క్లిక్ చేయాలి.
- సెట్టింగ్స్ అండ్ సపోర్ట్‌ని ఎంపిక చేసుకోవాలి.
- సెట్టింగ్స్ అండ్ ప్రైవసీ ఆప్షన్‌ని ఎంచుకోవాలి.
- ఆపై ప్రైవసీ అండ్ సేఫ్టీ ఎక్కడ ఉందో చూడాలి.
- డైరెక్ట్ మెసేజెస్‌పై టాప్ చేయడం ద్వారా కాల్ సెట్టింగ్స్‌పై యాక్సెస్ పొందాలి.
- ఆడియో అండ్ వీడియో కాల్ సెట్టింగ్స్ వరకు వెళ్ళాలి.
- కాల్ రిసెప్షన్ పూర్తిగా వద్దు అనుకుంటే టర్నాఫ్ చేసేందుకు స్విచ్‌ని టోగెల్ చేయాలి.
- అలా కాదనుకుంటే కొందరు వ్యక్తులు, గ్రూపులకు మాత్రమే కాల్ రిసెప్షన్‌ను కస్టమైజ్ చేయాలి.
- ఎన్‌హ్యాన్స్‌డ్ కాల్ ప్రైవసీని ఎనేబుల్ చేసుకుంటే ఐపీ చిరునామాను దాచిపెట్టి ఉంచవచ్చు. ఇలా ఒక్కో స్టెప్‌తో కాల్ ప్రైవసీని పొందవచ్చు.



ఏఐతో వాల్ పేపర్స్

గూగుల్ క్రోమ్ తన బ్రౌజర్‌ను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో ఇంటిగ్రేట్ చేసింది. అది వాల్‌పేపర్స్ జనరేట్ చేసేందుకు ఉపయోగపడుతుంది. దాంతో హోమ్‌స్క్రీన్‌ను అద్భుతంగా మలుచుకోవచ్చు. ఇంతకుమునుపు ఈ వెసులుబాటు పిక్సెల్ 8 యూజర్లకు మాత్రమే ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి క్రోమ్ బ్రౌజర్‌లోకి వచ్చింది. వెబ్ యూజర్లకు తోడు కస్టమైజేషన్‌కు అవకాశం ఉంది. దీంతో ఇకపై క్రోమ్ యూజర్లు తమ హోమ్ పేజీ డిజైన్‌ను కస్టమైజ్ చేసుకోవచ్చు. అందుకోసం టెక్స్ట్ టు ఇమేజ్ డిఫ్యూజన్‌ను ఉపయోగిస్తుంది. దీనికోసం

- మొదట ఎడిట్ బటన్‌ను టాప్ చేయాలి.
- చేంజ్ థీమ్ టాబ్‌ని టాప్ చేయాలి. క్రియేటివ్ విత్ ఏఐపై క్లిక్ చేయాలి.
- డ్రాప్‌డౌన్ మెనూ నుంచి అభిరుచి మేరకు సబ్జెక్టు, స్టయిల్‌ను పిక్ చేసుకోవాలి.
- కాంబినేషన్ల ఎంపిక తరవాత క్రియేట్‌పై టాప్ చేయాలి
- క్రోమ్ వాల్‌పేపర్ ఎంపిక కోసం నాలుగైదు ఆప్షన్స్ వస్తాయి. అలా వాల్‌పేపర్‌ను పొందవచ్చు.



సైబర్ థ్రెట్స్ ఇవే!

సాంకేతికత ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. మనిషి జీవితాన్ని మరింత సౌకర్యవంతంగా ఉంచేందుకు అది తోడ్పడుతోంది. వెలుగు - చీకటి అన్నట్టు ఆ మంచిని పొంచే ప్రమాదం చొచ్చుకువచ్చి మనిషిని ఆర్థికంగా అతలాకుతలం చేస్తోంది. అదే సైబర్ థ్రెట్. 2024లో ఈ కింది మార్గాల్లో యూజర్లకు థ్రెట్ వచ్చే అవకాశం ఉందని సైబర్ నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వివిధ రూపాల్లో వచ్చే ఈ మాల్వేర్ - నెటిజెన్లను కబళిస్తోంది. వ్యక్తిగత సమాచారం నుంచి మనీ వరకు సర్వం తస్కరిస్తోంది. స్కామ్ స్వరూపం తెలిస్తే, అప్రమత్తంగా ఉండేందుకు వీలవుతుంది. దరిమిలా ఈ ఏడాది సైబర్ థ్రెట్ ఏ రూపంలో ముంచుకొస్తోందో ముందు చూద్దాం.

- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విస్తరణతో వస్తున్న ప్రమాదం డీప్ ఫేక్. ఈ టెక్నాలజీ ఉపయోగించి కన్విన్స్ చేసే వాయిస్, వీడియో, ఇమేజ్ కంటెంట్‌కు రూపకల్పన జరుగుతుంది. ఈ ప్రక్రియతో వాస్తవానికి, ఫేక్‌కు మధ్య ఉండే గీత చెరిగిపోతుంది. ఈ మోసపూరిత చర్యల నివారణకు అప్రమత్తంగా ఉండటం ఒక్కటే పరిష్కారం. వివరాలు తెలియకుండా పర్సనల్ సమాచారాన్ని షేర్ చేసుకోకూడదు. మాయకు గురవుతున్నామా లేదా అన్నది ఒకటికి పదిసార్లు చెక్ చేసుకుంటే తప్ప పర్సనల్ సమాచారాన్ని షేర్ చేసుకోరాదు.
- సోషల్ మీడియాను కూడా సైబర్ క్రిమినల్స్ దుర్వినియోగపరుస్తున్నారు. సెలబ్రిటీలు, ప్రభావపూరిత వ్యక్తుల పేర్లను వాడుకుంటారు. ముఖ్యంగా ఆన్‌లైన్ కమ్యూనిటీస్‌లో ఉన్నప్పుడు చాలా జాగ్రత్తగా ఉండటం మంచిది.
- ఫేక్ కంటెంట్ లేదంటే యువత, కుటుంబ సభ్యులకు హానిచేసే రీతిలో సైబర్ బెదిరింపులు ఉంటాయి.
- విరాళాల పేరిట మోసాలు మరొక ఎత్తు. ఏదోలా మోసంతో వ్యక్తులపై దాడి ఈ రూపంలో జరుగుతుంది. ఉదారతతో విరాళం ఇవ్వాలనుకుంటే లింకుల ద్వారా జొరబాటు ఇందులో ఉంటుంది.
- సరికొత్త మాల్వేర్ వేరియంట్స్ మరో ప్రధాన సమస్య. ఆర్థిక, వ్యక్తిగత డేటా సేకరణ - తద్వారా తస్కరణ, బెదిరింపులు ఇందులో ఉంటాయి. అనేకానేక ఎత్తుగడలు ఇందులో భాగం.
- ఒలింపిక్ ఎత్తుగడలు. ఈవెంట్లపై వ్యక్తులకు ఆసక్తులు ఇందులో లక్ష్యం. సదరు ఈవెంట్‌కు టికెట్ల కొనుగోలు నుంచి, ప్రయాణం, ప్రమోషనల్ కార్యలకలాపాల్లో భాగంగా జరిగే స్కాములు అన్నీ ఇందులోకి వస్తాయి.



చాట్ జీపీటీలో కొత్త వెసులుబాటు

బధిరులు ఇక వినొచ్చు

ఏఐ పవర్డ్ చాట్ జీపీటీ బధిరులకు శుభవార్త చెప్పింది. ప్రత్యేకించి వారికోసం 'రీడ్ అలౌడ్' ఫీచర్‌ను జతచేసింది. దీంతో రాసిన మెసేజ్‌లను పైకి బిగ్గరగా వినిపిస్తుంది. వాయిస్ చాట్ ఫీచర్‌లో ఇదో కొత్త ఫంక్షనాలిటీ. ఏఐ మోడల్స్‌కు చెందిన మల్టీమోడల్ కేపబిలిటీస్‌ను దీనికోసం చాట్‌జీపీటీ ఉపయోగించుకుంటోంది. చాట్‌బోట్ ఆండ్రాయిడ్ యాప్ వెర్షన్‌కు హోమ్-స్క్రీన్ విడ్జెట్ లభ్యం కానుందని కూడా మునుపటి రిపోర్టులు వెల్లడించాయి. ఐఓఎస్ లేదంటే ఆండ్రాయిడ్ డివైజ్‌లో ఇందుకోసం మెసేజ్‌ను టాప్, హోల్డ్ చేయాలి. ఆపై రీడ్ అలౌడ్‌ని టాప్ చేయాలి. మెసేజ్ కింద రీడ్ అలౌడ్ బటన్ ఉంటుంది. దీన్ని ఇప్పుడు విడుదల చేస్తున్నారు. చాట్‌జీపీటీ ఆండ్రాయిడ్, ఐఓఎస్ యాప్‌లకు తోడు వెబ్ క్లయింట్‌లో రీడ్ అలౌడ్ అందుబాటులో ఉంది. ఇంగ్లీష్ సహా 37 భాషల్లో ఈ సౌలభ్యం అందుబాటులో ఉంటుంది. వాయిస్ చాట్ ఫీచర్ మాదిరిగా ఉంటుంది. అలాగే ఉపయోగించుకున్నప్పుడు సంభాషణ పూర్తయ్యేవరకు టెక్స్ట్‌ని చూడలేం. అంటే వినడం, మాట్లాడటానికే ఇక్కడ అవకాశం ఉంటుంది. అంటే ఈ ఫీచర్ ప్రకారం కమ్యూనికేషన్ విధానం టెక్స్ట్‌లోనే ఉంటుంది. వాటి నుంచి యూజర్ అవసరమైనది తీసుకుని వినాలి. స్క్రీన్ చూడలేని వారు, అంధులు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

మెసేజ్‌లనూ ఎడిట్ చేయవచ్చు



ఇన్‌స్టాగ్రామ్‌లో పంపిన డైరెక్ట్ మెసేజ్‌లను యూజర్ 15 నిమిషాలకు లోపు ఎడిట్ చేసుకునే సౌలభ్యం ఉంది. అందుకు అవసరమైన అప్డేట్‌ను ఇన్‌స్టాగ్రామ్ ఇప్పటికే విడుదల చేసింది. దీనికి తోడు మరికొన్ని ఫీచర్లను కూడా తీసుకువచ్చింది. ఎడిట్ యువర్ మెసేజ్, పిన్‌చాట్స్ టు టాప్ ఆఫ్ ఇన్‌బాక్స్, టోగెల్ రీడ్ రిసీట్స్ ఇన్ డైరెక్ట్ మెసేజెస్, సేవ్ యువర్ ఫేవరైట్ స్టిక్కర్స్ అండ్ అప్‌గ్రేడ్ యువర్ రిప్లయ్స్, పర్సనలైజ్ యువర్ చాట్స్ విత్ మోర్ థీమ్స్ వంటివి ఉన్నాయి. మెసేజెస్ విషయానికి వస్తే, ప్రెస్ ఆపై హోల్డ్ తదుపరి ఎడిట్‌పై టాప్ చేస్తే సరిపోతుంది. సెండర్‌కు పంపిన తరవాత 15 నిమిషాలకు మించని వ్యవధి లోపు ఈ పనిచేసుకోవచ్చు. పొరపాట్లు ఏవైనా ఉంటే సరిదిద్దుకుని మెసేజ్‌ని అప్డేట్ చేయవచ్చు. రైట్ చాట్ విండోని వెతుక్కునే బదులు ఇకపై త్వరగా యాక్సెస్ చేసుకునే వెసులుబాటును ఇన్‌స్టాగ్రామ్ కల్పించింది. చదివిన మెసేజ్ కనిపించకుంటే రీడ్ రిసీట్స్ లేదా కొన్నిచాట్స్‌ను టోగెల్ చేయడం ద్వారా దాగి ఉన్న లేదా అప్పటికే చదివిన మెసేజ్ లభ్యమవుతుంది. డైరెక్ట్ మెసేజ్‌లకు ఫేవరైట్ స్టిక్కర్లను కలపవచ్చు. అంతేకాదు స్టిక్కర్లు, జీఐఎఫ్‌లు, వీడియోలు, ఫొటోలు, వాయిస్ మెసేజ్‌లు కూడా ఒక మెసేజ్‌కు సమాధానం ఇచ్చేటప్పుడు దొరుకుతాయి.



సామాజిక మాధ్యమాల్లో రీల్స్‌కు ఉన్న ఆదరణ తెలిసిందే. అయితే ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ మెరుగ్గా ఉండేందుకు, మరింతమందిని ఆకట్టుకునేందుకు కొన్ని ట్రిక్స్ లేదా టిప్స్ ఇలా ఉన్నాయి.

రీల్స్‌కు బెస్ట్ ట్రిక్స్

- కామెంట్లకు రీల్స్‌తో స్పందించడం తెలిసిందే. దీని కోసం ముందు కామెంట్‌ను పట్టుకోవాలి. తదుపరి రిప్లయ్‌ని టాప్ చేయాలి. రీల్ ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. అక్కడ రెస్పాన్స్‌ను క్రియేట్ చేసి దాన్ని రీల్‌గా విడుదల చేయాలి.
- స్టోరీ హైలైట్స్‌ను రీల్స్‌గా మార్చుకోవడం మరొకటి. యూజర్ మొదట ప్రొఫైల్ దగ్గరకు వెళ్ళాలి. 'సేవ్' హైలైట్స్‌ను టాప్ చేయాలి. సెలెక్ట్‌ను ఎంపిక చేయాలి. రీల్ ఎడిటింగ్ ఆరంభించాలి.
- పాటలతో లైబ్రరీ ఇంకొకటి. సౌండ్ ట్రాక్స్‌తో సొంత కంటెంట్‌ను రూపొందించుకోవడం అన్నమాట. అందుకు అభిలషిస్తున్న ఆడియో ఉన్న రీల్‌ను ఓపెన్ చేయాలి. అడుగున ఉన్న ఆడియో లేబుల్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. తదుపరి ఉపయోగానికి వీలుగా స్టోర్ చేసుకునేందుకు సేవ్ ఐకాన్‌ని టాప్ చేస్తే సరిపోతుంది.
- పాటకు ఆటో-సింక్ ఇమేజెస్. రీల్స్‌లో ఇదో ఫీచర్. మీడియా, మ్యూజిక్ సింక్రనైజేషన్ సాఫీగా సాగేందుకు వీలుకలిగిస్తుంది. ఇందుకు రీల్స్ క్రియేషన్ విండోని తెరిచి, మీడియాను సెలెక్ట్ చేసుకోవాలి. ఆడియోను ఎంచుకోవాలి. సింక్రనైజేషన్ పూర్తయ్యేవరకు వేచి ఉండాలి. అదయ్యాక పబ్లిషింగ్ ప్రాసెస్‌తో ప్రొసీడ్ అవ్వాలి.
- రీల్ టెంప్లేట్స్. ప్రీడిజైన్డ్ టెంప్లేట్స్‌తో రీల్స్‌ను చాలా వేగంగా బంధించడం అన్నమాట. న్యూపోస్టు కోసం ప్లస్‌ని టాప్ చేయాలి. రీల్స్ ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. టెంప్లేట్స్‌ను ఎంపిక చేసుకుని అవసరానుగుణంగా క్లిప్స్‌ని జతచేయాలి. ప్రొడక్ట్‌తో సంతృప్తి చెందితే, సేవ్ చేసుకోవాలి.
- జీఐఎఫ్‌తో సమాధానాలు. దీనికోసం సమాధానం ఇవ్వాలని అనుకుంటున్న కామెంట్‌కు రిప్లయ్‌పై క్లిక్ చేయాలి. స్టిక్కర్‌ని టాప్ చేయాలి. జీఐఎఫ్‌ని ఎంచుకోవాలి. దాన్ని కలిపి పబ్లిష్ చేయాలి.



- వాయిస్ ఇన్‌కార్పొరేషన్. ఎడిటింగ్ మెనూలోనే వాయిస్ ఓవర్స్‌ని కలపడం ఇక్కడ ఉంటుంది. రీల్ క్లిప్‌ను రికార్డ్ చేసిన తరవాత నెక్స్ట్‌ను ఎంచుకోవాలి. ఇది ఎడిట్ వీడియో పక్కన ఉంటుంది. వాయిస్ ఓవర్‌ను సెలెక్ట్ చేసుకుని కామెంట్రీని రికార్డు చేయాలి. రీల్‌కు వాయిస్ ఓవర్‌ను కలిపేందుకు డన్‌ని టాప్ చేయాలి.
- లిప్ సింకింగ్ ఇంకొకటి. దీనికి ధ్వని వేగాన్ని, మ్యూజిక్‌తో సింక్ చేయాల్సి ఉంటుంది. రీల్ ఎడిటర్‌ను యాక్సెస్ చేసుకుని యూజర్ తన క్లిప్‌లోకి మ్యూజిక్‌ను ఇన్‌కార్పొరేట్ చేసుకోవాలి. వేగం తగ్గిన మ్యూజిక్ కోసం 3ఎక్స్ వరకు సౌండ్ స్పీడ్‌ను సెట్ చేసుకోవాలి. అడ్జస్ట్ చేసిన ఆ స్పీడ్‌తో రీల్‌ను రికార్డ్ చేసుకోవాలి.
- క్యాప్షన్ జత చేయడం. చేసిన రీల్‌కు ఒక క్యాప్షన్ ఉండాలి. దీనికోసం ఇన్‌స్టాగ్రామ్‌కు చెందిన క్యాప్షన్ టూల్స్‌ను ఉపయోగించాలి. మాన్యువల్‌గా క్యాప్షన్‌ను ఎడిటింగ్ సమయంలో జతచేయాలి. క్యాప్షనింగ్‌కు మూడో పార్టీ యాప్‌ను ఉపయోగించుకోవాలి.
- రీల్స్‌ను అరేంజ్ చేయడంలో వ్యూహం అవసరం. రీల్స్ చేయడం ఒక ఎత్తు. వాటిని అప్‌లోడ్ చేయడం మరొక ఎత్తు. ఇందుకు ఒక వ్యూహాన్ని సన్నద్ధం చేసుకోవాలి. ఎప్పుడు ఏ రీల్ రిలీజ్ చేయాలన్న ప్లాన్ ఒకటి పక్కాగా ఉండాలి.
- అట్రాక్షన్ కోసం కవర్ ఇమేజ్ ఇంకొకటి. రీల్స్ రూపొందిస్తోంది పూర్తిగా వీక్షకుల కోసం అన్న విషయం తెలిసిందే. అప్పీలింగ్ థంబ్ నెయిల్స్‌తో అందంగా, కనిపించగానే చూసేలా చేయడమే ఈ కవర్ ఇమేజ్ ఉద్దేశం.

ఈ ట్రిక్స్ ఉపయోగించుకుంటే రీల్స్‌కు ఆదరణ మరింత పెరుగుతుంది అని చెప్పవచ్చు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శనివారం 9 మార్చి 2024

ఏపీఆర్‌డీసీ సెట్ నోటిఫికేషన్

గుంటూరులోని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(ఏపీఆర్ఈఐఎస్)- ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీఆర్‌డీసీ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ప్రకారం పల్నాడు జిల్లా - నాగార్జునసాగర్‌లోని ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ మొదటి ఏడాది ప్రవేశాలు కల్పిస్తారు. ఈ కాలేజీని బాలురకు మాత్రమే ఉద్దేశించారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ట్యూషన్ ఫీజు ఉండదు. ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. అకడమిక్ యాక్టివిటీస్‌తోపాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తారు. విద్యార్థులకు అవసరమైన ల్యాబొరేటరీలు, లైబ్రరీలు, డిజిటల్ క్లాసెస్, రీడింగ్ రూమ్‌లు, ప్లే గ్రౌండ్‌లు అందుబాటులో ఉంటాయి. 15 నుంచి 20 మంది విద్యార్థులను ఒక గ్రూప్‌గా చేసి వారి సంరక్షణ కోసం ఒక లెక్చరర్‌ను లోకో-పేరెంట్‌గా నియమిస్తారు.

సీట్ల వివరాలు

- బీఏ(హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్)లో 40 సీట్లు, బీకాంలో 40 సీట్లు, బీఎస్సీ(మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో 36 సీట్లు, బీఎస్సీ(మేథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్)లో 36 సీట్లు చొప్పున మొత్తం 152 సీట్లు ఉన్నాయి.
- ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు 65:35 నిష్పత్తిలో సీట్లు కేటాయిస్తారు.

అర్హత: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలురు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ప్రస్తుతం ఇంటర్/తత్సమాన పరీక్ష రాసిన/రాసే అభ్యర్థులు అర్హులు. బీఏ ప్రోగ్రామ్‌నకు ఇంటర్‌లో ఏ గ్రూప్ వారైనా అప్లయ్ చేసుకోవచ్చు. బీకాం ప్రోగ్రామ్‌నకు హెచ్ఈసీ మినహా అన్ని గ్రూప్‌లవారూ అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ)కి ఎంపీసీ గ్రూప్ అభ్యర్థులు; బీఎస్సీ(మేథ్స్, స్టాటిస్టిక్స్ కంప్యూటర్ సైన్స్) ప్రోగ్రామ్‌నకు ఎంపీసీ, ఎంఈసీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ఏపీఆర్‌డీసీ సెట్ 2024

ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో మొత్తం 150 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొదటి 30 ప్రశ్నలు ఇంగ్లీష్ సబ్జెక్ట్ నుంచి ఉంటాయి. తరవాతి 120 ప్రశ్నలు గ్రూప్ సబ్జెక్టులకు సంబంధించి ఉంటాయి. ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలోనే ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 150. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. మోడల్ పేపర్ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 17 నుంచి
- **ఏపీఆర్‌డీసీ సెట్ తేదీ:** ఏప్రిల్ 25
- **మెరిట్ లిస్ట్ విడుదల:** మే 14
- **మొదటి కౌన్సెలింగ్:** మే 23
- **రెండో కౌన్సెలింగ్:** మే 31
- **మూడో కౌన్సెలింగ్:** జూన్ 7
- **వెబ్‌సైట్:** https:aprs.apcfss.in



విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏవీ)- పీజీ ప్రోగ్రామ్‌లలో డైరెక్ట్ అడ్మిషన్స్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ విభాగాల్లో 12 రెగ్యులర్ సీట్లు; డిజైన్ విభాగంలో 13 రెగ్యులర్ సీట్లు, 12 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.

'ప్లానింగ్'లో పీజీ

ఆర్కిటెక్చర్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్రోగ్రామ్‌లో సస్టయినబుల్ ఆర్కిటెక్చర్, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్, ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ ఆర్కిటెక్చర్ పూర్తిచేసి ఉండాలి. మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌కు(బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ/కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్/కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులై ఉండాలి. మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌కు బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, ఏడాది అనుభవం ఉన్నవారు; బ్యాచిలర్స్ డిగ్రీ(ఫైన్ ఆర్ట్స్/డిజైన్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ప్లానింగ్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ ప్రోగ్రామ్ ఉంది. ఇందులో ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ(ప్లానింగ్/ఆర్కిటెక్చర్) లేదా (బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లకు మాస్టర్స్ డిగ్రీ(జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ) పూర్తిచేసిన అభ్యర్థులు; ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌కు మాస్టర్స్ డిగ్రీ(ఎకనామిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్స్ రీసెర్చ్) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అడ్మిషన్ ప్రక్రియ: అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. సంస్థ నిర్ణయం మేరకు ఇందులో అర్హత పొందినవారికి సంబంధించి స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ పరిశీలన, పోర్ట్‌ఫోలియో అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

- **వెయిటేజీ:** స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌కు 10 మార్కులు, పోర్ట్‌ఫోలియో/అకడమిక్ వర్క్స్‌కు 30 మార్కులు, ఇంటర్వ్యూకి 60 మార్కుల వెయిటేజీ ఉంటుంది.

ముఖ్య సమాచారం

- డిగ్రీ స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. నాలుగేళ్ల డిగ్రీ అభ్యర్థులు ఆరో సెమిస్టర్ వరకు, మూడేళ్ల డిగ్రీ అభ్యర్థులు నాలుగో సెమిస్టర్ వరకు, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ చదువుతున్నవారు ఎనిమిదో సెమిస్టర్ వరకు, రెండేళ్ల పీజీ అభ్యర్థులు రెండో సెమిస్టర్ వరకు సాధించిన మార్కులు సబ్మిట్ చేయాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **అభ్యర్థుల ప్రొవిజనల్ లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 16
- **ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 25, 26
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 9
- **మిగిలిన సీట్ల కేటాయింపులు:** మే 15
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **చిరునామా:** రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, సర్వే నెం. 4/4, ఐటీఐ రోడ్, విజయవాడ-520008
- **వెబ్‌సైట్:** www.spav.ac.in



మీకు తెలుసా?


- తల, ముక్కు, తోక భాగంలో మాత్రమే నల్లగా ఉండి మిగతా అంతా తెల్లగా ఉండే ఈ పక్షిని 'సాక్రెడ్ ఐబిస్' అంటారు. మన దగ్గర ఉండే కొంగ జాతికి చెందిన పక్షి ఇది.
- 68 సెం.మీ పొడవు ఉండే ఈ పక్షి బరువు ఒకటిన్నర కేజీ దాకా ఉంటుంది.
- దక్షిణాఫ్రికా, అంగోలా, బోట్స్‌వానా, బురిండి, కేమెరూన్, సెంట్రల్ ఆఫ్రికా.. లాంటి దేశాల్లో ఇవి ఉంటాయి.
- దక్షిణాఫ్రికా నుంచి జాంబియా వరకూ 1500 కి.మీ. ప్రయాణిస్తాయి. మేగ్రేట్ అవ్వటానికి ఇష్టపడతాయి.
- పచ్చికబయళ్లలో ఉండటానికి ఇష్టపడతాయి. ముఖ్యంగా నీళ్ల ఉండే చోటనే ఉంటాయి. గుంపులుగా ఉంటాయి. ఒక్కో గుంపులో పాతిక పక్షులు ఉంటాయి.



- ఐదు గుడ్ల వరకూ పెడతాయి. పొదిగే కాలం మూడు వారాల నుంచి నాలుగు వారాల వరకూ ఉంటుంది.
- 1817 సంవత్సరంలో దీని ఆనవాళ్ల కనుగొన్నారు. ప్రాంతాన్ని బట్టి ఈ జాతుల రంగుల్లో మార్పు వస్తాయి.
- పురుగులు, చిన్న కప్పలు, చిన్న చేపలను తిని బతుకుతాయి. ఇవి కేవలం నీళ్ల ఉండే ప్రాంతాల్లోని చెట్ల పైకొమ్మల్లో మాత్రమే నివసిస్తాయి.
- మనుషులు, గద్దలతో వీటికి ప్రమాదముంది. గుడ్లు పెట్టే కాలంలో 500 జతల నుంచి 20 వేల జతల వరకూ వీటి గుంపు ఉంటుంది.
- వీటి జీవనకాలం 20 సంవత్సరాలు.

సరైన నీడ ఏది?





7 తేడాలను గుర్తించండి

దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 250


		3					4	
	7			3	2		6	
9						2		3
	8			1	4	3		
			9		8			
		9	3	7			2	
1		2						4
	6		1	9			7	
	9					8		

సుడోకు - 249 సమాధానం

3	2	1	6	4	5	9	8	7
4	8	9	2	1	7	3	5	6
7	6	5	8	9	3	1	4	2
2	4	7	1	3	9	5	6	8
5	9	8	4	2	6	7	1	3
6	1	3	7	5	8	4	2	9
9	5	2	3	6	1	8	7	4
8	3	4	5	7	2	6	9	1
1	7	6	9	8	4	2	3	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

హైదరాబాద్-హబ్సిగూడలో సీఎస్ఐఆర్ నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ)- పీహెచ్‌డీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మోడ్రన్ బయాలజీలో పరిశోధనలు చేయాలనుకొనేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



సీసీఎంబీలో పీహెచ్‌డీ

విభాగాలు: సెల్ బయాలజీ, మాలిక్యులార్ బయాలజీ, జెనెటిక్స్, జినోమిక్స్, డెవలప్‌మెంటల్ బయాలజీ, ప్లాంట్ మాలిక్యులార్ బయాలజీ, కన్జర్వేషన్ బయాలజీ, ఎకాలజీ, ప్రొటీన్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, బయాలజీ ఆఫ్ మాక్రోమాలిక్యూల్స్, బయాలజీ ఆఫ్ ఇన్ఫెక్షన్, ఇమ్యూనాలజీ, ఎపిజెనెటిక్స్, క్రోమాటిన్ బయాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్.

అర్హత: సైన్స్ విభాగాల్లో ఏదేని మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. యూజీసీ/సీఎస్ఐఆర్/డీబీటీ/డీఎస్‌టీ/ఐసీఎంఆర్/డీబీటీ-బీఈటీ/ఇన్‌స్పయిర్/ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ అర్హత పొంది ఉండాలి. పీహెచ్‌డీ పూర్తయ్యే వరకూ ఫెలోషిప్ వ్యాలిడిటీ ఉండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ దరఖాస్తులు పరిశీలించి స్క్రీనింగ్ చేసిన అభ్యర్థులను కంప్యూటర్ బేస్డ్/రిమోట్ ప్రాక్టర్డ్ ఆన్‌లైన్ టెస్ట్‌కు పిలుస్తారు. ఇందులో అర్హత పొందినవారికి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. సీఎస్ఐఆర్/యూజీసీ నెట్ లెక్చరర్‌షిప్ అర్హత మాత్రమే ఉన్న వారిని ఇంటర్వ్యూకి అనుమతించరు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 22
- **ఇంటర్వ్యూ సెంటర్:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** ccmb.res.in

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)/రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్(ఆర్‌పీఎస్ఎఫ్)లో ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్ము అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబై, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.



రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్స్

మొత్తం ఖాళీలు: 4660

1. కానిస్టేబుల్: 4,208 పోస్టులు
2. సబ్ ఇన్‌స్పెక్టర్: 452 పోస్టులు

అర్హత: కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఎస్ఐ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. రీజియన్ల వారీ ఖాళీలు, విద్యార్హత, రాత పరీక్ష, సిలబస్ తదితర పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తారు. సంక్షిప్త ఉద్యోగ ప్రకటనను ఎంప్లాయ్‌మెంట్ న్యూస్(మార్చి 2-8)లో చూడవచ్చు.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి కానిస్టేబుల్ పోస్టులకు18-28 ఏళ్ల మధ్య; ఎస్ఐ పోస్టులకు 20-28 ఏళ్ల మధ్య ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు ఎస్ఐ పోస్టులకు రూ.35,400; కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: ఏప్రిల్ 15

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 14

వెబ్‌సైట్: https://rpf.indianrailways.gov.in/RPF/

ఈఎస్ఐ సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్లు

మొత్తం ఖాళీలు: 1930

కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో శాశ్వత ప్రాతిపదికన నర్సింగ్ ఆఫీసర్ల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: నర్సింగ్ ఆఫీసర్

అర్హతలు: బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్/పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణతతో పాటు స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సు లేదా నర్సు, మిడ్‌వైఫ్‌గా రిజిస్టరై ఉండాలి. లేదా డిప్లొమా(జనరల్ నర్సింగ్ మిడ్-వైఫరీ) ఉత్తీర్ణతతో పాటు స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సు లేదా నర్సు, మిడ్‌వైఫ్‌గా రిజిస్టరై ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 27 నాటికి అన్‌రిజర్వ్‌డ్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 30 ఏళ్లు; ఓబీసీ అభ్యర్థులకు 33 ఏళ్లు; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 35 ఏళ్లు; దివ్యాంగ అభ్యర్థులకు 40 సంవత్సరాలు మించకూడదు.

దరఖాస్తు రుసుము: రూ.25. మహిళలు/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 27

రిక్రూట్‌మెంట్ టెస్ట్ తేదీ: జూలై 7

వెబ్‌సైట్: https://upsc.gov.in/

జాబ్ కార్నర్

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, న్యూఢిల్లీ.... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఈఎస్ఐసీలో సీనియర్ రెసిడెంట్‌లు

మొత్తం ఖాళీలు: 45

విభాగాలు: హెమటాలజీ, పాథాలజీ, సర్జికల్ అంకాలజీ, రేడియాలజీ, మెడిసిన్, అనస్థీషియా, సర్జరీ, పీడియాట్రిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, ఆబ్స్‌స్టేట్రిక్స్ అండ్ గైనకాలజీ, బయోకెమిస్ట్రీ, బ్లడ్ బ్యాంక్, ఈఎన్‌టీ, ప్లాస్టిక్ సర్జరీ, మైక్రోబయాలజీ, నెఫ్రాలజీ, స్కిన్, కార్డియాలజీ.

అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీలో ఎంబీబీఎస్, పీజీ డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 45 సంవత్సరాలు మించరాదు

వేతనం: నెలకు రూ.30,000

ఇంటర్వ్యూ తేదీలు: మార్చి 11, 12

వెబ్‌సైట్: www.esic.gov.in/recruitments#

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్

కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో అర్హతకు ఉద్దేశించిన సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) జూలై - 2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది.

పరీక్ష విధానం: పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్ ఒకటి నుంచి ఐదు తరగతులకు బోధించేవారికి, రెండో పేపర్ ఆరు నుంచి తొమ్మిదో తరగతులు బోధించే వారికి నిర్వహిస్తారు. సీటెట్ స్కోరు లైఫ్ లాంగ్ వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. ఈ పరీక్షను 20 భాషలలో నిర్వహిస్తారు.

అర్హతలు: ఇంటర్, డిగ్రీ, డీఈఎల్‌ఈడీ/డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్‌ఈడీ/బీఎస్సీఈడీ/బీఏఈడీ/బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీ కేటగిరీలకు రూ.1000(పేపర్ 1 లేదా 2 మాత్రమే), రూ.1200(పేపర్ 1 అండ్ 2 రెండూ). ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.500(పేపర్ 1లేదా 2 మాత్రమే), రూ.600(పేపర్ 1 అండ్ 2 రెండూ).

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్. వరంగల్.

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 2

ఓఎమ్మార్ ఆధారిత పరీక్ష తేదీ: జూలై 7

వెబ్‌సైట్: https://ctet.nic.in/

ఎన్ఐడీలో టెక్నికల్ అసిస్టెంట్‌లు

అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 5

1. డిజైన్ అసిస్టెంట్: 1 పోస్టు
2. టెక్నికల్ అసిస్టెంట్: 2 పోస్టులు
3. సీనియర్ అసిస్టెంట్‌లు: 2 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: డిజైన్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లకు 30 ఏళ్లు; సీనియర్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 11

వెబ్‌సైట్: www.nid.edu/home